

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 243 పేజీలు: 10+4 వెల: 6.50


ఎలాన్‌మస్క్‌కు యుఎస్ రక్షణశాఖలో కీలక బాధ్యతలు

ఇరాక్ నుంచి అమెరికా సైన్యం పూర్తిగా నిష్క్రమణ

5

## పైలట్ స్మిత్‌పై గొడ్డలితో దాడి?

అటాక్ ఎలా జరిగిందంటే?



5

'షైదుబాయ్స్' కెప్టెన్ స్మిత్‌పై ప్రశంసల వెల్లువ

రాష్ట్రపతి, ప్రధాని మోడీ సహా ప్రపంచ దేశాధినేతల అభినందనలు



5

## గిరిజన ప్రాంతాల్లో ఏదీ అభివృద్ధి?

అనారోగ్యం, పోషకాహార లోపంతో పిల్లలు మరణిస్తున్నారు

'ఉపాధి హామీ' అమలు కావడం లేదు

కాంగ్రెస్ అధికారంలోకొస్తే వారి హక్కులు కాపాడతాం

ఎంపి బాలాఘాట్‌లో రాహుల్‌గాంధీ



## కరవు 230 మండలాలు!

తెలంగాణలో మూడోవంతు దుర్భిక్షం

7.50 లక్షల ఎకరాల్లో పంటల సాగు నిల్

18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు

కరవు మండలాలపై రాష్ట్ర సర్కార్ కసరత్తు

**హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని 230 మండలాలను కరవు మండలాలుగా ప్రభుత్వం గుర్తించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి రాష్ట్ర సర్కార్ కసరత్తు చేస్తోంది. నైరుతి రుతుపవనాల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర వర్షపాత లోటు ఏర్పడటంతో, ఈ ఏడాది తెలంగాణలో మూడో వంతు ప్రాంతం కరవు లాంటి పరిస్థితులను ఎదుర్కొంటోంది. దీంతో కరవు పీడిత మండలాల జాబితాను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం స్థానిక స్థాయిలో ఉన్న పరిస్థితులను పరిశీలిస్తోందని వ్యవసాయ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. రాష్ట్రంలోని 621 మండలాల్లో సుమారు 230 మండలాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించే అవకాశం ఉంది. దీనికి సంబంధించి ఈ వారంలో లేదా వచ్చే వారంలో అధికారిక ప్రకటన >>2

# 2 డిఏలకు సర్కార్ ఓకే

ఎల్‌నినోపై కేబినెట్ సబ్ కమిటీ, త్వరలో అఖిలపక్ష భేటీ

ఖరీఫ్ సీజన్‌లో 65లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

7800 మె.వా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు ఏర్పాటు

కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్‌కు రూ.650 కోట్లు మంజూరు

డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ ప్రత్యేక పాలసీ ఆమోదం

కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి





గురువారం హైదరాబాద్‌లో కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు 1:** దసరా పండుగ సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభ వార్త చెప్పింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024 నుంచి బకాయి ఉన్న డీఏలలో రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి బకాయి పడ్డ ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు. ఆర్థికంగా భారమైనప్పటికీ.. ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2500 కోట్ల భారం పడనుంది. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులపై కేబినెట్ లో సుదీర్ఘ చర్చ జరిగిందని, రాష్ట్రంలో ఈ వానాకాలంలో దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఉంది. బుధవారంతో రుతుపవనాల కాలం కూడా ముగిసిందని తెలిపారు. దాదాపు 235 మండలాల్లో తీవ్రవర్షాభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నాయని, కరవు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. రాష్ట్రంలోఉన్న ఎల్‌నినో పరిస్థితులు.. చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరిస్తారమని పేర్కొన్నారు. కరవు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసిందని పేర్కొన్నారు. త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదిస్తామని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని, త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని చెప్పారు.ఈ సీజన్లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని సివిల్ సప్లయిస్ విభాగం అంచనా వేసింది. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించిందన్నారు. ఎల్‌నినో పరిస్థితులతో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15,000 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా.. ఈ సీజన్లో అది రికార్డు స్థాయిలో 19,892 >>2



## వింటర్‌లో సమ్మర్!

అక్టోబరు-డిసెంబరు మధ్య మరింత వేడి

ఎల్‌నినోపై ఐఎండి అంచనా

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగిసిందని భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ యేడాది వర్షాకాలం మొత్తంగా 13 శాతం లోటు వర్షపాతంతో ముగిసిపోగా గురువారం నుంచి శీతాకాలం ప్రారంభమైంది. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈ శీతాకాలం హాట్ హాట్‌గా ఉండబోతోందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాబోయే నవంబరు- డిసెంబరులోనూ చలితీవ్రత తక్కువగా నమోదుకానుందని, అక్టోబరులో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.రానున్న అక్టోబరు-డిసెంబరు కాలంలోనూ మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే రాజ్యమేలనుంది. ముఖ్యంగా అక్టోబరు నెలలో దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పాటు పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పైపైకే చేరతాయని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్ నినో ప్రభావమే ఇందుకు ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సెప్టెంబరు మధ్యలోనే ఎండాకాలాన్ని తలపించిన వాతావరణం రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1901 తర్వాత 13వ అత్యల్ప వర్షపాతం.. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కొనసాగిన నైరుతి >>2

# నల్లమల పులి కాదు.. పిల్లి





సిఎం సిరిసిల్ల పర్యటనకు 4 వేల మంది పోలీసులా?

నా ఆస్తులు, మీ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా అన్నదాతల గోస: కెటిఆర్

బిఆర్ఎస్‌లో చేరిన ఆర్మూర్ కాంగ్రెస్, బిజెపి నాయకులు

**హైదరాబాద్,అక్టోబరు1,ప్రభాతవార్త:** తెలంగాణలో రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం నాడు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలు గోస పడుతున్నారని తెలిపారు. ఆరు గంటలు కూడా కరెంట్ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, రైతుబంధు రావడం లేదని, యూరియా దొరకడం లేదని కంటతడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఫోన్ చేస్తే యూరియా పొలం వద్దకే వచ్చేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజలు తమ పక్షాన నిలబడి ఈ ప్రభుత్వంపై పోరాడాలని కోరుతున్నారని చెప్పారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ రైతులను ఇబ్బంది పెట్టిందని, అదే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సిరిసిల్ల పర్యటనలో ముఖ్యమంత్రి చేనేత కార్మికుల సమస్యలపై సమాధానం చెప్పకుండా వెళ్లారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్లలో పలువురు చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, విద్యార్థుల స్కూల్ యూనిఫాం ఆర్డర్లు నిలిచిపోయాయని, నేతన్న బీమా పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. చనిపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు పరిహారం ప్రకటిస్తారని, నేతన్న బీమాపై ప్రకటన చేస్తారని ఆశించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనను జరిపిన తీరుపై కేటీఆర్ ఫైర్ అయ్యారు.. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి పర్యటించడం ప్రజల మధ్య పర్యటనలా లేదని విమర్శించారు. 'నల్లమల పులి అని చెప్పుకుంటడు.. నాలుగు వేల మంది పోలీసులను పెట్టుకుని పోతాడా? నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు పిల్లి' అని విమర్శించారు. ముఖ్యమంత్రి చుట్టూ పోలీసులు తప్ప ప్రజలు కనిపించలేదని, బీఆర్ఎస్ నాయకులను ముందుగానే అరెస్టుచేసి, దుకాణాలు >>2

## 2027 అక్టోబరు 2 నుంచి వన్డే వరల్డ్ కప్

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా మ్యాచ్‌లు

7



హైదరాబాద్‌లో మీడియాతో సిఇఒ సుదర్శన్‌రెడ్డి

## 'సర్'ను ఇక పొడిగించం

92 లక్షల మందికి నోటీసులిచ్చాం

54 లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకొన్నాం: మీడియాతో సిఇఒ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు1,ప్రభాతవార్త:** సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా రాష్ట్రంలో 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. అందులో 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని, 54 లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని సీఈవో తెలిపారు. గురువారం సాయంత్రం బిఆర్‌కె ఆర్ భవన్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్‌కు సంబంధించిన అంశాలను సుదర్శన్‌రెడ్డి వివరించారు. ఎన్నికల కమిషన్‌సర్‌లో కొన్ని మార్పులు చేసిందన్నారు. సర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాల్లో ఫామ్6తో పాటు డిక్లరేషన్ తీసుకోవాలని ఈసీ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇక నుంచి సర్ నోటీసులు అందిన వారి వద్దకే బీఎల్‌వోలు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటారని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందిన కుటుంబ >>2

## కేసు తేలేదాకా నోటిఫికేషన్ రాదు..

'ఖైరతాబాద్'పై ఇసి కీలక ప్రకటన

విజయారెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో అనూహ్య పరిణామం





**హైదరాబాద్,అక్టోబరు1,ప్రభాతవార్త:** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన స్థానానికి ఉపఎన్నికకు రంగం సిద్ధమవుతున్న వేళ.. కాంగ్రెస్ నాయకురాలు, దివంగత నేత పి.జనార్దన్ రెడ్డి (పీజేఆర్) కుమార్తె పి.విజయారెడ్డి తెలంగాణ హైకోర్టుకు ఎక్కారు. తన 2024 ఎన్నికల పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆమె తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. పెండింగ్ పిటీషన్‌పై తుది పరిష్కారం వచ్చే వరకు ఉప ఎన్నికవ నిర్వహించబోమని కోర్టుకు తెలిపింది. దీంతో న్యాయస్థానం ఈ నెల 6కు విచారణను వాయిదా వేసింది. కాగా, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేయగా.. కాంగ్రెస్ తరఫున విజయారెడ్డి బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో దానం నాగేందర్ విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే దానం నాగేందర్ తన ఎన్నికల అఫిడవిట్‌లో కుటుంబ ఆస్తులకు సంబంధించిన కొన్ని వివరాలను పూర్తిగా వెల్లడించలేదని ఆరోపిస్తూ >>2





## పడగ నీడలో పచ్చని బాల్యం!

ముక్కుపచ్చలారని పిల్లలపై పెరుగుతున్న లైంగిక వేధింపులు

ఎపిలో గతేడాది 2,633 కేసులు, తెలంగాణలో 2,078 కేసులు

**ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్**

అభంశుభం తెలియని చిన్నారులపై లైంగికవేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఆయా కుటుంబాలతో సంబంధం ఉన్నవారు. పొరుగున ఉన్న తెలిసిన వారే ఈ నేరాలకు పాల్పడుతున్నారు. రెండు రాష్ట్రాల్లో నమోదు అవుతున్న కేసుల్లో 99శాతం కేసుల్లో పరిచయస్తులు, బంధువులే నేరాలకు పాల్పడుతున్నారు. రెండు రాష్ట్రాల్లో గత సంవత్సరం ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో 103 కేసులో నిందితులకు 20 సంవత్సరాల శిక్ష, ఏడు కేసుల్లో 25 సంవత్సరాల శిక్ష, 132 కేసుల్లో జీవితఖైదు, ఆరు కేసుల్లో మరణశిక్షలు వెలువరిస్తూ తీర్పులు వెలువడ్డాయి, అయితే కోర్టుల దృష్టికి వస్తున్న కేసుల్లో శిక్షలు పడుతున్నవి కేవలం మూడు నుంచి పది శాతం మాత్రమే. >>2



శ్రీనగర్‌లో గురువారం జమ్మూ కాశ్మీర్ పోలీసులు నిర్వహించిన 'కాశ్మీర్ మారథాన్ రన్ ఫర్ యూనిటీ'లో పాల్గొన్న క్రీడాకారులు

# కరవు మండలాలు 230!

>> వెలువడే అవకాశం ఉందని సమాచారం. వర్షపాత గణాంకాల ప్రకారం ఈ ఏడాది పరిస్థితి, 2016-27 పంట కాలంలో వర్షపాత లోటు విషయంలో తెలంగాణ క్లిష్టమైన పరిస్థితిలో ఉండవచ్చని సూచిస్తోంది. అంతేకాకుండా, ప్రస్తుతం చివరి దశలో ఉండి, వాయువ్య భారతదేశం నుండి ఇప్పటికే వైదొలగడం ప్రారంభించిన రుతుపవన కాలంపై ఎల్ నినో ప్రభావాన్ని కూడా తెలంగాణ ఎదుర్కొంటోంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సగటు వర్షపాతం లోటు మైనస్ 17 శాతంగా ఉన్నప్పటికీ, ఈ మొత్తం గణాంకాలు అనేక మండలాల వాస్తవ పరిస్థితిని కప్పిపుచ్చాయి. వాటిలో చాలా మండలాలు అప్పటికే గణనీయమైన వర్షపాత లోటుతో సతమతమవుతున్నాయి. పద్దెనిమిది మండలాలు భారీ లోటు కేటగిరీ పరిధిలో ఉన్నాయి ప్రణాళికా సంఘం నివేదిక ప్రకారం, గురువారం నాటికి వర్షాకాలం ప్రారంభమైన జూన్ నుండి సెప్టెంబరు 30వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 740.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 615.5 మిల్లీమీటర్లుతో సగటున 17 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని సగానికి పైగా మండలాలు అంటే 320 మండలాలు లోటు వర్షపాత వర్గంలో ఉన్నాయి. ఈ లోటు మైనస్ 59 శాతం నుంచి మైనస్ 20 శాతం వరకు ఉంది. జిల్లా వ్యాప్తంగా సగటున గద్వాల్ జిల్లా 41 శాతం లోటుతో వర్షపాతం నమోదు కాగా, ఈ జిల్లాలో అత్యధికంగా అలాగే 60 నుండి 99 శాతం లోటుతో మరో 5 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రాష్ట్రంలోని నారాయణ్‌పేట్, హన్మకొండ జిల్లాల్లో 35 శాతం లోటు, నల్లగొండలో 34 శాతం, మల్కాజిగిలో 33 శాతం, వరంగల్, ఆదిలాబాద్‌లో 32 శాతం, నాగర్‌కర్నూల్, వనపర్తిలో 31 శాతం, మహబూబ్‌నగర్‌లో 29 శాతం, కొత్తగూడెం, వికారాబాద్, హైదరాబాద్‌ల్లో 27 శాతం, ఖమ్మంలో 26 శాతం, సూర్యాపేట్‌లో 23 శాతం, జనగామ, భువనగిరిలో 22 శాతం, నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సగటున 20 శాతం మేర లోటు వర్షపాతం రికార్డయింది. ప్రధానంగా ఖరీఫ్ సీజను ముమ్మరంగా సాగే అగస్టు నెలలో వర్షాభావ పరిస్థితుల కారణంగా అత్యధికంగా 38 శాతం లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఖరీఫ్ కంటే ఈ సారి సాగులోకోత పడింది. గత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 1,33,25,83 ఎకరాల్లో అన్ని పంటలు సాగు కాగా, ఈ సారి అది 1,25,85,426 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఈ లెక్కన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత ఏడాది కంటే ఈ సారి 7 లక్షల 50 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయకుండా వదలివేశారు. కాగా 2015 నవంబర్‌లో అప్పటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం 231 మండలాల్లో కరవు ఉన్నట్లు గుర్తించినా, వాటిని ప్రకటించడంలో తీవ్ర జాప్యం చేసిన ఫలితంగా కీలకమైన కేంద్ర సహాయం అందకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కూడా పొరుగు రాష్ట్రాలు కరవు మండలాలను ప్రకటించడంతో పాటు, ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, రైతులను ఆదుకునేందుకు అమలు చేసే ప్యాకేజీలను కూడా ప్రకటించాయి. పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్ర పభుత్వాలు ఇప్పటికే తమ తమ తాలూకాలలో వరుసగా 177 మరియు 265 తాలూకాలలో కరవును ప్రకటించాయి. వ్యవసాయ రుణాల మారటోరియం, కొత్త రుణాల మంజూరు, వడ్డీ రాయితీలు తదితర చర్యలు చేపాట్టాయి. మరోపక్క ఆయా రాష్ట్రాల్లో కరవు పరిస్థితుల అంచనా కోసం కేంద్ర బృందాలు పర్యటిస్తాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలో ప్రకటించారు. అయితే తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకూ కరవు మండలాలను ప్రభుత్వం ప్రకటించ లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కరవు మండలాల కరసత్తు ఈ వారం లేక వచ్చే వారానికి పూర్తయితే వాటిని ప్రటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఇక పొడిగించం

>> సభ్యులు అందరూ ఉండాల్సిన అవసరంలేదని, ఒకరు వివరాలు ఇస్తే సరిపోతుందని వివరించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈసీ ఈ మార్పులు చేసిందని చెప్పారు. మూడు లక్షల మందికి సంబంధించిన నోటీసులకు సమాధానాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. నోటీసులకు 65 లక్షల మంది సమాధానం ఇచ్చినట్లు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఇంకా 54లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని నవంబర్ 5వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. బీఎల్‌వోలు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీలకు చెందినవారు కాదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశంలేదని ఆయన తెలిపారు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80వేల మంది ఓటర్లకు నోటీసులు వచ్చామని ఇప్పటి వరకు 20శాతం మంది నుంచి మాత్రమే సమాధానాలు వచ్చాయని వివరించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని సీఈవో సుదర్శన్‌రెడ్డి అన్నారు. నోటీసులు అందిన వారి దగ్గరకే బీఎల్‌వోలు వెళ్తారన్నారు.

# తేలేదాకా నోటిఫికేషన్ రాదు..

>> విజయారెడ్డి 2024లో తెలంగాణ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ఫారం26లో వెల్లడించాల్సిన సమాచారాన్ని దాచిపెట్టారని పేర్కొంటూ ఆయన ఎన్నికను రద్దు చేయాలని ఆమె కోర్టును కోరారు. ఆ ఎన్నికల పిటిషన్ ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక ప్రక్రియ మొదలయ్యే పరిస్థితి రావడంతో విజయారెడ్డి మరోసారి కోర్టును ఆశ్రయించారు. తాను గతంలో దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై తుది నిర్ణయం రాకముందే ఉపఎన్నిక నిర్వహిస్తే న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని విజయారెడ్డి తన తాజా పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల ముందుగా తన ఎన్నికల పిటిషన్‌ను తేల్చాలని.. అప్పటివరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయకుండా ఈసీని ఆదేశించాలని ఆమె కోరారు. తాజా పిటిషన్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం, దానం నాగేందర్‌లను ప్రతివాదులుగా చేర్చారు.

ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని విజయారెడ్డి గురువారం లంచ్ మోషన్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. అయితే హైకోర్టు అత్యవసర విచారణకు నిరాకరించింది. ఇంతలో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి పెండింగ్ పిటీషన్‌పై తుది పరిష్కారం అయ్యే వరకు ఉప ఎన్నిక నిర్వహించబోమని కోర్టుకు తెలిపింది. కాగా, తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మాత్రం అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేశారు. ఉపఎన్నిక షెడ్యూల్‌పై ఈసీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# వింటర్‌లో సమ్మర్!

>> రుతుపవనాల కాలంలో దేశంలో ఆశించిన వర్షాలు కురవలేదు. దేశవ్యాప్తంగా దీర్ఘకాలిక సగటులో కేవలం 87శాతం వర్షపాతం మాత్రమే నమోదైంది. మొత్తం రికార్డైన 759.4 మి.మీ వర్షపాతం.. 2001 తర్వాత 4వ అత్యల్పం కాగా, 1901 నుంచి చూస్తే 13వ అత్యల్ప వర్షపాతంగా నమోదైంది.

**ప్రాంతాల వారీగా తీవ్ర లోటు**

తూర్పు, ఈశాన్య భారతంలో కేవలం 1016.3 మి.మీ మాత్రమే వర్షం కురవడంతో 1901 తర్వాత సరికొత్త అత్యల్ప రికార్డు నమోదైంది. అలాగే దక్షిణ ద్వీపకల్పంలో 542.0 మి.మీ వర్షపాతం పడగా, ఇది 2001 తర్వాత 2వ అత్యల్పం. వ్యవసాయానికి కీలకమైన మాన్సూన్ కోర్ జోన్‌లో 779.9 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. దేశంలోని 36 వాతావరణ సబ్ డివిజన్స్‌లో ఏకంగా 17 ఉప విభాగాల్లో లోటు వర్షపాతం రికార్డయింది. 18 సబ్ డివిజన్స్‌లో సాధారణ వర్షపాతం నమోదు కాగా దేశంలో కేవలం ఒకే ఒక్క సబ్‌డివిజన్ అయిన ఒడిశాలో మాత్రమే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

**నెలలవారీ గణాంకాలు**

జూన్‌లో 65శాతం, జులైలో 101శాతం, ఆగస్టులో 84శాతం, సెప్టెంబర్‌లో 92శాతం వర్షపాతం నమోదైంది. సీజన్ మొత్తం మీద 14 అల్పపీడన వ్యవస్థలు ఏర్పడినా, జూన్ నెలలో ఒక్కటి కూడా ఏర్పడకపోవడం తొలిదశలో తీవ్ర వర్షాభావానికి కారణమైంది.

**రికార్డు స్థాయిలో బలపడుతున్న ఎల్ నినో:**

పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల ఏర్పడే ఎల్ నినో ఈ ఏడాది అత్యంత వేగంగా విస్తరిస్తోందని ఐఎండి హెచ్చరించింది. ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ అండ్ సొసైటీ నివేదిక ప్రకారం, సెప్టెంబరు నాటికి సముద్ర ఉష్ణోగ్రతల్లో 3డిగ్రీలు పెరుగుదల నమోదైందని పేర్కొంది. ఈ తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులు శీతాకాలమంతా కొనసాగి 2027 ప్రారంభం వరకు ప్రభావం చూపే అవకాశం ఉందని వివిధ వాతావరణ నమూనాలు స్పష్టం చేస్తున్నాయి.

## వారం - వర్జ్యం

02-10-2026, శుక్రవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె
తి.షష్ఠి ఉ.10.16, న. మృగశిర రా.2.55,
వ.ఉ.9.42 -ఉ.11.12,
దు.ఉ .8.21-ఉ.9.09,
2)మ.12.20- మ.1.08,
రాహు.ఉ .10.30- మ.12.00,
శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** ఇంటర్వ్యూలు విజయవంతంగా పూర్తికాగలవు. వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. వివాహ యత్నాలు సాగిస్తారు.

**వృషభం :** ప్రయత్నకార్యసిద్ధి . ప్రముఖుల నుండి ఆహ్వానాలు. దూరపు బంధువులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

**మిథునం :** దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం :** సంతానం సమస్యలు తీరి ఊరట చెందుతారు. కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి.

**సింహం :** ఇతరుల విషయంలో జోక్యం వద్దు. ప్రయాణాలలో లాభాలు. మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి.

**కన్య :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పనులు విజయవంతంగా పూర్తికాగలవు.

**తుల :** జీవితభాగస్వామి నుండి సహాయం అందుకుంటారు. ఇంట్లో ఒకరి సంపాదన పెరుగుతుంది. కష్టసుఖాలను పంచుకుంటారు.

**వృశ్చికం :** వివాదాలకు దూరంగా వుండటం చాలా మంచిది. కుటుంబ సభ్యుల సలహాతో నూతన కార్యక్రమాలు చేపడతారు.

**ధనుస్సు :** పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. మిత్రులతో సఖ్యతగా మెలగుతారు.

**మకరం :** గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. వివాహ యత్నాలు కలిసి వచ్చే కాలం. విద్యావకాశాలు లభిస్తాయి.

**కుంభం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు సర్దుబాటు అవుతాయి. సోదరుల నుండి ఆస్తి లాభం పొందుతారు.

**మీనం :** కొత్త ఆశలతో ముందుకు సాగుతారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. దీర్ఘకాలిక ఋణాలు కొంత వరకు తీరుస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పడగ

>> వేల కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. చిన్నారుల కేసుల విచారించేందుకు ప్రధానంగా ఫోరెన్సిక్ నివేదికలు, సాక్షాల విషయంలో తీవ్ర అవరోధాలు ఎదురౌతున్నాయి. బాలలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చినా, పోక్సో కేసుల సంఖ్య, కోర్టుల్లో పెండింగ్ కేసులు, విచారణకు పడుతున్న సమయం బాలల రక్షణ వ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. పోక్సో చట్టం 2012 (చిన్నారులపై లైంగిక నేరాల రక్షణ చట్టం) కింద 18 ఏళ్లలోపు పిల్లలపై జరిగే లైంగిక దాడులు, లైంగిక వేధింపులు, పిల్లలను అశ్లీల ప్రయోజనాలకు ఉపయోగించడం వంటి నేరాలపై కేసులు నమోదవుతాయి. దేశవ్యాప్తంగా 2023లో 67,694 పోక్సో కేసులు నమోదయ్యాయి. అదే ఏడాది పిల్లలపై నమోదైన మొత్తం నేరాల్లో పోక్సో కేసుల వాటా 38.2 శాతంగా ఉంది. ఎన్‌సిఆర్‌బి 2024 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 2024లో 2,633 బాలలపై లైంగిక నేరాలు నమోదయ్యాయి. వీటిలో 1,784 కేసులు పోక్సో చట్టం కింద నమోదయ్యాయి. అంటే బాలలపై నమోదైన మొత్తం నేరాల్లో సుమారు 67 శాతం పోక్సో కేసులే. ఈ 1,784 పోక్సో కేసుల్లో 943 కేసులు పోక్సో సెక్షన్ల 4, 6కు సంబంధించినవిగా నమోదయ్యాయి. ఇవి చిన్నారులపైతీవ్రమైన నేరాలకు సంబంధించినవి. తెలంగాణలో 2024లో 2,078 పోక్సో కేసులు నమోదైనట్లు ఎన్‌సిఆర్‌బి గణాంకాలను ఉటంకిస్తూ వచ్చిన నివేదికలు వెల్లడించాయి. హైదరాబాద్‌లోనే 349 కేసులు నమోదయ్యాయి. బాధితుల్లో బాలికల వాటా దాదాపు 99 శాతంగా ఉంది. మరో ఆందోళనకర అంశం ఏమిటంటే బాధితులకు నిందితులు తెలిసినవారే అధికంగా ఉన్నారు. తెలంగాణలో 2024లో గుర్తించిన 2,076 మంది పోక్సో అనుమానితుల్లో 2,074 మంది బాధితులకు తెలిసినవారే అని ఎన్‌సిఆర్‌బి వెల్లడించింది. కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారు, స్నేహితులు వంటి పరిచయ వర్గాలు ఇందులో ఉన్నాయి. తెలంగాణలో పోక్సో కేసులపై 2023లో శిక్షలు పడ్డ శాతం కేవలం 10.23 శాతంగా నమోదైనట్లు కేంద్ర న్యాయశాఖ 2026లో లోక్‌సభకు తెలిపింది. ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని మైనర్ చిన్నారుల కేసుల్లో శిక్షలు పడ్డ శాతం 20.61 గా ఉంది. చిన్నారుల అత్యాచారం కేసుల విచారణను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను 2019లో ప్రారంభించింది. ఇందులో ప్రత్యేకంగా పోక్సో కేసులను మాత్రమే విచారిస్తారు. 2026 ఏప్రిల్ 30 నాటికి దేశవ్యాప్తంగా 775 ఫాస్ట్‌ట్రాక్ కోర్సులు ఉన్నాయి, వాటిలో 398 ప్రత్యేకంగా పోక్సో కేసులకు సంబంధించిన కోర్టులు పనిచేస్తున్నట్లు కేంద్ర న్యాయశాఖ తెలిపింది.

2025 డిసెంబర్ 31 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 16 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయి. ఈ కోర్టులు 2023లో 2,368 కేసులు, 2024లో 2,138 కేసులు, 2025లో 2,701 కేసులను పరిష్కరించాయి. ప్రత్యేక పోక్సో కోర్టుల్లో మాత్రం 2023లో 2,263 కేసులు నమోదు, 2,360 కేసులు పరిష్కారం కాగా, 2024లో 1,419 కేసులు నమోదు, 2,138 కేసులు పరిష్కరించబడ్డాయి. 2025లో 2,159 కేసులు నమోదు కాగా, 2,701 కేసులు పరిష్కరించబడ్డాయి. ప్రస్తుతం కేంద్ర న్యాయశాఖ డ్యాష్‌బోర్డ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఫాస్ట్‌ట్రాక్ పెండింగ్ కేసులు 5,455గా చూపిస్తున్నాయి. తెలంగాణలో 2025 డిసెంబర్ 31 నాటికి 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయి. ఈ కోర్టులు 2023లో 1,720, 2024లో 2,499, 2025లో 2,567 కేసులను పరిష్కరించాయి. తెలంగాణలోని కోర్టుల్లో పెండింగ్ కేసులు 8,861గా ఉన్నాయి.

శిక్షలు పడిన కేసుల వివరాలు పరిశీలిస్తే 2023 నుంచి వరుసగా మూడేళ్లలో 3.97, 5.19, 5.35 శాతంగా ఉంది. తెలంగాణలో 7.12, 7, 20.21 శాతంగా ఉంది. 2025 డిసెంబర్ 31 నాటికి దేశవ్యాప్తంగా 2,24,572 పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు కలిపి చూస్తే రేప్, పోక్సో కేసులతో సహా 2025 చివరికి పెండింగ్ కేసులు 2,45,579కు చేరాయి. 2025లో 1,43,936 కేసులు నమోదవగా, 66,500 కేసులు మాత్రమే పరిష్కరించబడ్డాయి. ఫోక్సో కేసులను త్వరితగతని పరిష్కరించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ప్రవేశపెట్టిన అనేక కారణాల వల్ల తీర్పు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. పోలీసు దర్యాప్తు, ఛార్జ్‌షీట్ దాఖలు, ఫోరెన్సిక్ నివేదికల కోసం వేచి ఉండటం, బాధితులు, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య ఆధారాల సేకరణ, నిందితుల హాజరు, న్యాయవాదులు కోరే వాయిదాలు, కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, సిబ్బంది అందుబాటు వంటి అనేక కారణాలు వల్ల తీర్పులు త్వరితగతిన రావడం లేదు. పోక్సో చట్టంలోని తీవ్రమైన నేరాలకు కఠినమైన శిక్షలు ఉన్నాయి. ఉదాహరణకు అత్యాచారయత్నానికి కనీసం 10 సంవత్సరాల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష ఉండవచ్చు. అత్యాచారం చేసినందుకు కనీసం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు, చట్టంలో పేర్కొన్న కొన్ని పరిస్థితుల్లో మరణశిక్ష కూడా ఉండవచ్చు. ఎన్ని చర్యలు తీసుకున్నా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టినా చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, అత్యాచారాల కేసుల్లో నిందితులు శిక్షలు పడకుండా తప్పించుకుంటున్నారు. కోర్టుల వరకు వెళ్లే కేసులు కూడా చాలా తక్కువగా ఉంటున్నాయి.

# నల్లమల పులి కాదు.. పిల్లి

>> మూసివేయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంబంధించిన వ్యాపారాలు, టెండర్లు, భూముల వ్యవహారాలపై కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి అర్హత లేకపోయినా భారీ విలువైన టెండర్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కొండల్ రెడ్డి అర్హతలు, ఏరోస్పేస్ రంగంలో ఆయనకు వచ్చిన అవకాశాలపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిన్నటి వరకు పెద్దగా ఆస్తులు లేని కుటుంబ సభ్యులు వేల కోట్ల పెట్టుబడులు ఎలా పెడుతున్నారని ప్రశ్నించినందుకే ముఖ్యమంత్రికి కోపం వస్తోందని అన్నారు. తన ఆస్తులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కేసీఆర్ 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రి, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రిగా పనిచేశారని, నాలుగు దశాబ్దాలకు పైగా చట్టసభల్లో ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ తనను చిన్నప్పటి నుంచి బాగా చదువుకోవాలని చెప్పేవారని, తాను చదువుకుని అమెరికాలో ఆరు సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బుతో 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. 2006లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉన్న సమయంలో హోటల్ ప్రారంభించానని, 2009 ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు, వ్యాపార వివరాలను స్పష్టంగా వెల్లడించానని తెలిపారు. నేను అఫిడవిట్‌లో చెప్పిన విషయాన్నే మళ్లీ కొలంబస్ కనుగొన్నట్టు చెబుతున్నరు' అని కేటీఆర్ అన్నారు. వ్యాపారం చేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు. తన ఆస్తులపై, రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ సవాల్ చేశారు. 'మా తాతల ఆస్తుల నుంచి మీ తాతల ఆస్తుల వరకు విచారణ చేయండి అని సవాలు విసిరారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. మూడు నెలల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మూడేళ్లు గడిచినా ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు. దళితబంధు కింద రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారని, బీసీలకు రూ.లక్ష కోట్లు ఇస్తామని చెప్పి ఎంత నిధులు కేటాయించారని ప్రశ్నించారు.

బీసీలకు కాంట్రాక్టులు ఇస్తామని చెప్పారని, రాష్ట్రంలో కాంట్రాక్టులు ఎవరికి దక్కుతున్నాయని ప్రశ్నించారు. మైనారిటీలకు రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఎస్సీ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్‌ల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.



న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన 'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమంలో చీపురుపట్టి చెత్తను శుభ్రం చేస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, కిరణ్ రిజిజు

# 2 డిఎలకు సర్కార్ ఓకే

>> మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరింది. అంటే దాదాపు 20 వేల మెగావాట్లకు చేరింది. గత ఏడాది మొత్తంలో 16,613 మెగావాట్ల గరిష్ట వినియోగం నమోదైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, తగినంత విద్యుత్తు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్తు కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోలు చేయాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు.

భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించిందన్నారు. దాదాపు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపిందని, ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించిందన్నారు. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించిందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుందని, పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించిందని తెలిపారు. తొలిదశలో కొహెడ ఫ్రూట్ మార్కెట్‌కు రూ.650 కోట్లు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేలి తెలిపారు. వైఎస్ కాలంలో ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నందున, ఆ ప్రాజెక్టులను పున: సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీ అమలు చేసే ప్రతిపాదనను మంత్రివర్గం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీకి ఆమోదం తెలిపిందన్నారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు కేబినేట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.. మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని నిర్ణయం తీసుకుందన్నారు.

## బస్సు, మెట్రో కోసం నేడు కామన్ పాస్ ఆవిష్కరణ

**హైదరాబాద్,అక్టోబరు1,ప్రభాతవార్త:** హైదరాబాద్ వాసులు ఎదురుచూస్తున్న కామన్ పాస్ ఆవిష్కరణకు ముహూ ర్తం ఖరారైంది. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీన ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రజాభవన్‌లో ఈ కామన్‌పాస్ ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై పాస్‌ను ఆవిష్కరించనున్నారు.

# 9,102 ఎస్సీ, ఎస్టీ కేసులు

## శిక్షలు 32 మాత్రమే: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదిక విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ జాతులు (ఎస్టీ)పై 9,102 నేరానికి సంబంధించిన కేసులు నమైదయ్యాయని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదించింది. అయితే ఈ కేసుల్లో కేవలం 32 మందికి మాత్రామే శిక్షలు పడ్డాయని ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో గురువారం మూడేళ్ల నివేదికను విడుదల చేసింది. ప్రభుత్వ రికార్డులను ఉపయోగించి, ఈ కేసులలో 213 హత్యలు, మహిళలు, బాలికలపై జరిగిన 1,305 లైంగిక వేధింపుల నివేదికలు ఉన్నాయని తెలిపింది. అదనంగా ఈ మూడేళ్ల కాలంలో భూ వివాదాలు, అఘాయిత్యాలు, సేవా విషయాలు, ఇతర ఫిర్యాదులకు సంబంధించి కమిషన్‌కు 5,867 వినతులు కూడా అందని వెల్లడించింది. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఒక కేసులో పోలీసులు తనను హింసించారని షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీత కేసును కమిషన్ సమీక్షించిందన్నారు. ఫలితంగా ఒక సర్కిర్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు, మరో ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేశారని తెలిపారు. అదేవిధంగా భూ సేకరణ ప్రయత్నానికి సంబంధించి పోలీసులు తమపై దాడి చేశారని ఆదివాసీ మహిళలు ఆరోపించిన వికారాబాద్ జిల్లాలోని లగాచర్లను కమిషన్ సందర్శించిందని బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేసినట్లు చెప్పారు. అలాగే నల్లగొండ జిల్లాలో పోలీసు కస్టడీలో మరణించిన కార్గా రాజేష్ కుటుంబానికి, కస్టడీ మరణం కేసులో రూ.4 లక్షల పరిహారం లభించిందన్నారు. అదేవిధంగా కొత్తగూడెం జిల్లాకు చెందిన దళిత సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాముల శ్రీనివాస్ పై అధికారుల అవమానాలతో ఆత్మహత్య చేసుకున్నారని, ఆయన కుటుంబానికి రూ.8 లక్షలు, భార్యకు ఉద్యోగం, వరంగల్‌లో ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లభించాయని వివరించారు. సంబంధిత అధికార్లపై అట్రాసిటీ కేసులు నమోదు చేయబడ్డాయని చెప్పారు.

# కల్కి భగవాన్‌కు ఘనంగా నివాళులు

## నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

**వరదయ్యపాలెం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** మానవ రూపంలో దేవుడిగా కోట్లాది మంది భక్తులు ఆరాధించే శ్రీ కల్కి భగవాన్ ఇక లేరు అనే వార్త వినగానే దేశం నలుమూలల నుండి, చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం ఏకం క్షేత్రానికి తరలివచ్చారు. ఇప్పటివరకు లక్ష మందికి పైగా భక్తులు.. ఆయన పార్థివదేహాన్ని దర్శించుకున్నారు. శుక్రవారం (2వ తేదీ) మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు.. జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కల్కి భగవాన్ పార్థివ దేహాన్ని దర్శించుకుని నివాళులు అర్పించిన వారిలో తమిళనాడు మాజీ ఫైనాన్స్ మినిస్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి సర్వన్ సింగ్, శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ సాయి ప్రసాద్, విహెచ్‌పి చీఫ్ రాఘవులు, వైసీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జ్ నూకతోటి రాజేష్ తదితర ప్రముఖులు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

**VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY LIMITED**

RFP Tender Notice No.16/2026-27/DIR(T)/SGM/GM(VIWSCO)/ Dt: 29-09-2026
Number of works -1, Value of work : RFP Tender
Tender starting Date: 01-10-2026 @ 3.00 PM,
Tender Closing Date: 08-10-2026 @ 4.00 PM
Note: Further details at www.tender.apeprocurement.gov.in
O/o the GM (VIWSCO) Cell No.8187898428
Sd/- CMD (VIWSCO)

తెలంగాణ ప్రభుత్వం
**వరంగల్ మహానగర పాలక సంస్థ**
టెండర్ ప్రకటన

టెండర్ ప్రకటన నం. EE-IV/GWMC/CTN-16/e-Proc/2026-27, తేది: 01.10.2026, పనుల యొక్క సారాంశం: GWMC కమిషనర్ పని యొక్క అనుమతిపై ఆధారపడి, 8 నం.ల పనుల కొరకు రూ.21.29/- లక్షల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ టెండర్ పద్ధతి ద్వారా పిలువబడుచున్నవి. టెండర్ నోటీస్‌ను పనుల జాబితాతో జతపరచడమైనది. 3 రోజుల టెండర్ కొరకు-8 నం.ల పనులు: డౌన్‌లోడింగ్ కొరకు ప్రారంభ తేది: 03.10.2026 మ.12.00 గం. నుండి ఆపై. డౌన్‌లోడింగ్ కొరకు చివరి తేది: 06.10.2026 మ.12.00 గం. వరకు. బిడ్స్ యొక్క తెరచుట: 06.10.2026 మ.12.10 గం. వద్ద. ఆసక్తి వ్యక్తీకరణ: పని పేరు: "పారిశ్రామిక లాండ్రీ ఎక్విప్‌మెంట్ యొక్క మరమ్మతులు మరియు పునరుద్ధరణ. స్పేర్స్ మరియు సర్వీస్‌లు కలిపి" డాక్యుమెంట్ జారీకి ప్రారంభ తేది: 05.10.2026. డాక్యుమెంట్ జారీకి చివరి తేది: 08.10.2026. EOI దాఖలుకు చివరి తేది: 09.10.2026. సంప్రదింపు వివరాలు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GWMC, వరంగల్. ఇ-మెయిల్: ee.elec.gwmc@gmail.com సంప్రదించవలసిన నం.9701999597. ఇ-ప్రొక్యూర్‌మెంట్ యొక్క వివరాలు ఆన్‌లైన్ అందుబాటులో ఉన్నాయి. ఇ-టెండర్లు ఆన్‌లైన్ https://tender.telangana.gov.in అందుబాటులో ఉన్నాయి. మరియు EOI నిమిత్తం బిడ్/షెడ్యూల్ డాక్యుమెంట్ కొరకు EE యొక్క కార్యాలయాన్ని సంప్రదించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.10975-PP/CL/Advt/1/2026-27, తేది: 01.10.2026

# యువత ఆకాంక్షలకు ప్రతీక యుపిఎస్సీ

## 'ప్రభుత్వమే మైబాప్ష్ నుంచి 'పౌరుడి సేవకు ప్రాధాన్యత్ష వైపు

## మహిళల భాగస్వామ్యం పెరుగుదల అవకాశాల విస్తరణకు నిదర్శనం

## కమిషన్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోడీ కీలక సందేశం

## సర్దార్‌పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన యుపిఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుపిఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.
యుపిఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోడీ మాట్లాడుతూ "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనల్లు" అని పేర్కొన్నారు. 'నేషన్ ఫస్ట్.. సిటిజన్ ఫస్ట్' అనే రెండు ప్రమాణాలను సివిల్ సర్వీసుల నియామకాల్లో గుర్తుంచుకోవాలని సూచించారు.

గతంలో ప్రభుత్వం అన్నింటికీ ఆధారం అనే భావన ఉండేదని ప్రధాని మోడీ ప్రస్తావించారు. ఇప్పుడు పాలనా విధానంలో పౌరుడి సేవకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. 21వ శతాబ్దపు భారతదేశం కొత్త వర్క్ కల్చర్‌తో ముందుకు సాగుతోందని, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే నిపుణులు ప్రభుత్వ సేవల్లో అవసరమని పేర్కొన్నారు.

సివిల్ సర్వీసుల్లో నియామకాల విషయంలో ప్రధాని మోడీ రెండు అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. 'దేశం ముందు' (నేషన్ ఫస్ట్), 'పౌరుడు ముందు' (సిటిజన్ ఫస్ట్) అనే రెండు ప్రమాణాల ఆధారంగా ఎంపిక ప్రక్రియను చూడాలని సూచించారు. అభ్యర్థికి ఎంత పరిజ్ఞానం ఉందో మాత్రమే పరీక్షించే విధంగా నియామక పరీక్షలు ఉండకూడదని, ప్రజాసేవలోకి ఎందుకు రావాలనుకుంటున్నారనే అంశాన్ని కూడా పరిశీలించే విధంగా వ్యవస్థ ఉండాలని అన్నారు. ప్రజా పదవుల ఆకర్షణ కంటే ప్రజా సేవ పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రభుత్వ సేవల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో మహిళల భాగస్వామ్యం గత కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిందని, 1952లో కేవలం 3 శాతంగా ఉన్న ఈ సంఖ్య నేడు సుమారు 30శాతానికి చేరిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. యుపిఎస్‌సి చరిత్రలో ఇప్పటివరకు నలుగురు మహిళలు చైర్‌పర్సన్‌లుగా వ్యవహరించారని, వారిలో ముగ్గురు 2014 తర్వాతే నియమితులయ్యారని ఆయన తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) శతాబ్ది ఉత్సవాల్లో ప్రసంగించిన ప్రధాని మోడీ, మహిళల భాగస్వామ్యం పెరగడం వారికి లభిస్తున్న అవకాశాల విస్తరణకు నిదర్శనమని అన్నారు.
యుపిఎస్‌సి శతాబ్ది ప్రదర్శనను పరిశీలించిన సమయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సివిల్ సర్వీసుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేసుకున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోడీ గుర్తుచేసుకున్నారు. ఆ కాలంలో బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ పరీక్షలో సంస్కృతం వంటి భారతీయ భాషలకు సంబంధించిన పేపర్ ఉండటం తన దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు.
"1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దార్లు" అని ప్రధాని మోడీ వివరించారు.
1926 అక్టోబరు 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యుపిఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# సుదీర్ఘ వారాంతపు సెలవుతో రద్దీగా మారిన రహదారులు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గాంధీజయంతి కారణంగా శుక్రవారం సెలవు దినం కావడంతో హైదరాబాద్ నుంచి జనం మూడు రోజులు సొంత వూళ్ళో తమవాళ్ళ వద్దగడపడానికి బయలు దేరవడంతో రహదారులు రద్దీగా మారాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఆదిలాబాద్, కరీంనగర్, ముంబయి, మహబూబ్‌నగర్, విజయవాడ రోడ్లలో కార్లలో సొంతూళ్లకు వెళ్లే జనంతో నిండిపోయాయి. హైదరాబాద్ విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీనికితోడు రోడ్డు పనులు జరుగుతుండటంతో రద్దీ పెరిగింది. విజయవాడ వైపు.. చౌటుప్పల్ నుంచి ఎల్లంబావి వరకు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దండుమల్కాపురం ప్రాంతంలో 3 కి.మీ.మేర రద్దీ నెలకొంది. హైదరాబాద్ మా ర్గంలో ఎల్లగిరి నుంచి దండుమల్కాపురం వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు రద్దీని నియం త్రించేందుకు చర్యలు చేపట్టారు. ముంబాయి, ఆదిలాబాద్, కాగజ్‌నగర్ వెళ్లే రోడ్లలో హోటళ్ల వాహనదారులతో కిక్కిరిసాయి.





**VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY LIMITED**

RFP Tender Notice No.16/2026-27/DIR(T)/SGM/GM(VIWSCO)/ Dt: 29-09-2026
Number of works -1, Value of work : RFP Tender
Tender starting Date: 01-10-2026 @ 3.00 PM,
Tender Closing Date: 08-10-2026 @ 4.00 PM
Note: Further details at www.tender.apeprocurement.gov.in
O/o the GM (VIWSCO) Cell No.8187898428
Sd/- CMD (VIWSCO)


# హైదరాబాద్‌లో ఎంఎస్ ధోనీ దంపతులు

## ఎయిర్‌పోర్ట్‌లో అభిమానుల ఘనస్వాగతం

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ భార్యతో కలిసి గురువారం భాగ్యనగరానికి చేరుకున్నారు. పెడల్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఆయన నగరానికి విచ్చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు ఎంఎస్ ధోనీ దంపతులు చేరుకోగా.. అప్పటికే పెద్ద ఎత్తున వేచి చూస్తున్న అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనతో ఫోటోలు దిగేందుకు ఎగపడగా వారిని పోలీసులు నిలువరించారు. అనంతరం ధోనీ



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి భార్యతో కలిసి వెలుపలకు వస్తున్న మహేంద్రసింగ్ ధోనీ

దంపతులు అక్కడి నుంచి జూబ్లీ హిల్స్‌కు బయలుదేరారు. రోడ్ నంబర్ 34కి చేరుకుని, కార్యక్రమం లో పాల్గొనున్నారు. అక్కడ వారిద్దరూ దాదాపు అరగంటపాటు ఉండనున్నారు. హైదరాబాద్‌కు ఎంఎస్ ధోనీ దంపతుల రాకతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పటిష్ట బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. నగరానికి ధోనీ చేరుకున్న క్షణం నుంచి తిరిగి పయనమయ్యే వరకూ పటిష్ట చర్యలు చేపట్టనున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘం కార్యాలయము, వికారాబాద్**
**వికారాబాద్ జిల్లా**

No. MCV/E/1422/2026-27, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 01.10.2026

వికారాబాద్ మునిసిపాలిటీ యందు వివిధ పనులు చేపట్టుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువడమైనది. 1. పనుల సంఖ్య : (03), 2. పనుల విలువ : రూ.40.00 లక్షలు, 3. బిడ్స్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది: 05.10.2026 ఉ.11.00 గంటలకు, 4. బిడ్స్ డౌన్ లోడింగ్ సమర్పించుటకు చివరి తేది : 12-10-2026 మ.3.30 గంటలకు, 5. ప్రైస్ బిడ్ తెరుచు తేది : 12-10-2026 సా.4.00 గంటలకు.

**కొటేషన్ ప్రకటన** : వికారాబాద్ మునిసిపాలిటీలో క్రింది వస్తువుల కోసం వాటి వివరణలు / స్పెసిఫికేషన్లతో కూడిన ధరలను పొందడం కొరకు, స్థానిక అధీకృత ఏజెన్సీలు / సరఫరాదారులు / తయారీదారులు / కాంట్రాక్టర్ల నుండి 05.10.2026 తేదీ నుండి 12.10.2026 వరకు కార్యాలయ పనివేళల్లో సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నాము.

1. ఎల్ఈడీ వీధి దీపాలు (Street lights) మరియు ఎల్ఈడీ లైట్ల విడి భాగాలు. 2. మొక్కల సరఫరా & మొక్కల పెంపకం. 3. మునిసిపల్ వాహనాల మరమ్మతులు. 4. టెంట్ హౌస్ పనులు, పండుగలకు లైటింగ్ పనులు, బారికేడింగ్. 5. నీటి సరఫరా సామాగ్రి & వినియోగ వస్తువులు. 6. పారిశుధ్య వస్తువులు & సంరక్షణా వస్తువులు. 7. బోర్‌వెల్‌ల తవ్వకం. 8. వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికల తయారీ (DPRs). మిగతా వివరములకు https://tender.telangana.gov.in చూడగలరు. లేదా కార్యాలయపు పని వేళల యందు ఫోన్ నెం. 9849907661 నందు సంప్రదించగలరు.

సం/- మునిసిపల్ కమిషనరు, పురపాలక సంఘం వికారాబాద్

DIPR.No.11009-PP/CL/Advt/1/2026-27, తేది: 01.10.2026




వార్త

మూర్ఖులకు వివేకం బోధించడం వృథా శ్రమ,
బొగ్గును ఎంత కడిగినా తెల్లబడదు.

- కబీరు

# మాటల్లోనేనా గాంధీయిజం?

ధర్మాధర్మాలు తెలియవని కాదు, మొదటిది ఒంటబట్టడం లేదు, రెండో వదిలిపెట్టడం లేదన్నట్లుగా ఉంది మద్యం విషయంలో పాలకపెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏకోణంలో చూసినా మద్యం సేవించడం,వ్యాపారం చేస్తూ ఆరోగ్యంతో చెలగాటలాడటం ధర్మంకాదని అందరికి తెలిసిందే. మద్యంవల్ల ఎంత నష్టం జరుగుతున్నదో తెలియందేమీ కాదు. ఆరోగ్యమే కాదు, అత్యాచారాలు, ప్రమాదాలు మితిమీరిపోతున్నాయనే విషయం కూడా పాలకులకు తెలుసు. మద్యం మత్తులో కన్నకూతురిపైనే అత్యాచారాలకు ఎగబడుతున్నారు. తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని కన్న తల్లిదండ్రులనే కర్కశంగా నరికి చంపిన సంఘటనలు తరచుగా చోటు చేసుకుంటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజాసంక్షేమానికి మద్యం ఏమేరకు తూట్లు పొడుస్తున్నదో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. స్వాతంత్య్రం వచ్చిన అనంతరం అప్పటి పాలక పెద్దలు ఈ ప్రమాదాన్ని గుర్తించి మద్యాన్ని భారత్ నుంచి పారద్రోలాలని ఎంతగానో ఆశించారు. మద్యపాన నిషేధాన్ని విధించడమే కాదు, త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నించారు. వాస్తవానికి మద్యపాన నిషేధం అన్నది మహాత్ముడు భారత ప్రజలకు అందించిన అమృతసందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీయే కాదు, స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రజాస్వామ్యవాదులెందరో మద్య పానాన్ని ఈ దేశం నుంచి పారద్రోలాలని నినదించి ఉద్యమించారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నో తీర్మానాలు చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలోనూ పెట్టింది. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మద్యపాన నిషేధం దేశంలో మొట్ట మొదటి సారిగా అమలుచేసింది. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే ఆనాడు తాగుబోతులంటేనే సమాజంలో ఏమాత్రం గౌరవభావాలు ఉండేవి కావు. ఒకరకంగా చెప్పాలంటే సమాజం బహిష్కరించినట్లుగా వ్యవహరించేది. ఎక్కడో చాటుమాటుగా తాగేవారు. పూర్తి మైకంలో పది మందిలోకి రావడానికి ఏమనుకుంటారోననే సిగ్గు, బిడియం ఉండేవి. తాగుబోతుల విషయంలో అప్పటి ప్రభుత్వాలు కూడా ఎంతోకఠినంగా వ్యవహరించేవి.దొంగసారా, మద్యం అమ్మకందారులపై ప్రభుత్వం ఎంతో దృఢవైఖరి అవలంబించేది. కానీ రానురాను పరిస్థితులు మారిపోయాయి. మద్యం సేవించడం ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. ఎంతవరకు వెళ్లిందంటే చివరకు వివాహాది కార్యక్రమాల్లో భోజనానికి ముందు మద్యంసరఫరా చేయడం, గౌరవంగా భావించే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఇకప్రభుత్వం కూడా ఆదాయం కోసం దుకాణాలు పెట్టించి మద్యం సేవించండి,ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చండంటూ బతిమాలి, బంగపడి తాగించే రోజులు దాపురించాయి. గాంధీవారసులమని చెప్పుకుంటున్న వారు పార్టీలు వేరేఅయినా గాంధీ సిద్ధాంతాలను అమలు చేస్తున్నామని చెప్పుకుంటున్న పెద్దలు యేటా క్రమంతప్పకుండా మహాత్ముని జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్న పాలకులు మద్యం నిషేధం విషయంలో మాత్రం అందుకు భిన్నమైన బాటలో నడుస్తున్నారు. గాంధీ జయంతి నాడు రాష్ట్రపతి, ప్రధానమంత్రి మొదలు కేంద్ర పెద్దలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర నేతలు గాంధీసమాధి వద్దకు చేరుకొని ఆయనకు నివాళులు అర్పించి ఆయన సిద్ధాంతాలతోపాటు ఆయన ఆదేశించిన బాటలో నడుస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇది స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి జరుగుతూనే ఉంది. కానీ మరోపక్క దశల వారీగా మద్యం వినియోగాన్ని పెంచుకుంటూ ఆ ఆదాయమే మహా ప్రసాదంగా భావిస్తున్నారు. యేడాదియేడాదికి పెరుగుతున్న మద్యం ఆదాయాన్ని చూస్తే ఏస్థాయిలో వినియోగం అవుతుందో తెలుస్తుంది. ఏమీ చేసి అయినా మద్యం ద్వారా ఎంత వీలైతే అంత ఎలావీలైతే అలా ఆదాయాన్ని పెంచుకోవాలనే ధ్యేయంగా విధానాలకు రూపకల్పన చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మంచినీళ్ల దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్లకొద్దీ నడిచే పరిస్థితుల నుండి ఇప్ప టికీ బయటపడని పల్లెలు కోకొల్లలు. కానీ మద్యం దొరకని గ్రామాలు దుర్భిణి పెట్టి వెతికినా కన్పించకపోవచ్చు. బెల్టుషాపు విధానం ఎవరి ఆలోచనేమో కానీ గ్రామాలకుగ్రామాలనే మద్యంతో ముంచెత్తుతున్నాయి. రికార్డుపరంగా సారాను నిషేధించారు. కానీ అమలు చేసే త్రికరణశుద్ధి పాలకులకు లేకుండాపోతున్నది. కారు చౌకగా లభించే నాటు సారా, గుడంబ తయారీ, కొన్ని ప్రాంతాల్లో కుటీర పరిశ్రమగా మారిపోయింది. అప్పుడప్పుడు రికార్డుల కోసం కేసులు పెడుతున్నారు. దీనిని నియంత్రించడం అధికారులతో సాధ్యంకాదని కొందరు మద్యం వ్యాపారులుచీప్ లిక్కర్‌ను తయారు చేసి నాటుసారా తాగేవారిని తమవైపు తిప్పుకోవడం ఆరంభించారు. ఒకరకంగా చెప్పాలంటేరంగు కలిపిన నాటుసారా రెక్టిఫైడ్ స్పిరిట్ కలిపి మరికొన్ని కెమికల్స్ చల్లి నీరు నింపుతే చీప్ లిక్కర్ తయారవుతుంది. తగిన పరిణామంలో నీళ్ల కలవకపోయినా, వాడే రంగులు కాలం చెల్లినా ఖాళీ సీసాలు సరిగ్గా పరిశుభ్రం చేయకపోయినా చీప్‌లిక్కర్ కాస్త విషతుల్యంగా మారుతుంది.వ్యాపారులకు ఆదాయం తెచ్చిపెట్టే ఈ చీప్ లిక్కర్ అమ్మకాలే అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ చీప్ లిక్కర్ తాగి లక్షలాది మంది నిరుపేదలు అనేక రోగాలబారిన పడి ఆస్పత్రిపాలవుతున్నారు. అందులో కొందరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మరికొందరు తాగి తాగి కృంగికృశించి మంచానికి పరిమితమై లేవలేని స్థితిలో ప్రాణాలు వదులుతున్నారు. ఇంకొందరు కేన్సర్, కిడ్నీలాంటి ప్రాణాంతక వ్యాధులబారిన పడుతున్నారు. మొత్తం మీద అనేక రూపాల్లో మద్యం ప్రజాజీవనాన్ని అస్తవ్యస్థం చేస్తున్నది. ఇటీవల కాలంలో మైనర్లు కూడా ఈమత్తుకు అలవాటు పడుతున్నారు. యేడాది యేడాదికి మద్యం సేవించేవారి సంఖ్య పెరిగిపోతున్నది. మద్యం రక్కసిని మట్టుపెట్టడమే అసలైన ప్రజాసంక్షేమన్న వాస్తవాన్ని ఇప్పటికైనా పాలకులు గుర్తించాలి. ఇలా మద్యాన్ని నీరులా పారిస్తూ యేటా క్రమంతప్పకుండా మహాత్ముని స్మరించుకుంటూ చేసుకునే జయంతులు, వర్ధంతులకు అర్థం ఉండదు.

మనలోని సహజశక్తులే మన అనారోగ్యానికి నిజమైన ఔషధాలు.



హిప్పోక్రేట్స్

ఈ లోకానికి కొత్త వాళ్లంగా వస్తాం, అతిథుల్లా ఉంటాం, స్నేహితుల్లా వెళ్లిపోతాం.



రవీంద్రనాథ్ టాగూర్

# కౌలు సాగులో రైతుల కష్టాలు

**దేశంలో 1995- 2023 మధ్య అధికారిక నివేదికల విశ్లేషణల ప్రకారం 4,05,000 పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల నమోదైన రైతుల మరణాల్లో 56 శాతం కంటే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలే (కౌలురైతులు) ఉన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రైతు స్వారాజ్య వేదిక వంటి సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 75శాతం నుండి 80శాతం దాకా కౌలు రైతులే ఉన్నారని తెలిపాయి. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా కౌలు రైతులతో సహా గ్రామీణ పేదలందరికీ భూపంపిణీ జరగాలి. కౌలు రైతులకు పూర్తి రక్షణ ఉండాలి. గ్రామీణ ప్రజల అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అర్థ ఫ్యూడల్ సంబంధాలను, భూ కేంద్రీకరణను బద్దలు కొట్టాలి. ఈ పని నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేయవు. గ్రామీణ ప్రజలే సమిష్టిగా సాధించుకోవాలి.**

బొల్లిముంత సాంబశివరావు

భారతదేశం వ్యవసాయిక దేశం అనడంలో ఎటువంటి సందేశానికి ఆస్కారం లేదు. భారత ప్రభుత్వ వ్యవసాయిక శాఖ 2024-25 నివేదిక ప్రకారం మొత్తం నికర సాగు భూమి 35కోట్ల ఎకరాలకు పైగా ఉంది. పచ్చికబయళ్లు, తోటలు, సాగుకి అనుకూలమైన భూములు కలుపుకుంటే 44.1 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. దేశం మొత్తం భూమిలో ఇది 59శాతంగా ఉంది.ఫ్యూడల్ వ్యవస్థ నుంచి నేటి అర్ధ భూస్వామ్య వ్యవస్థ వరకు కౌలుదారీ విధానం కొనసాగుతున్నది. అనధికారిక అంచనాల ప్రపంచ బ్యాంకు, జాతీయ నమూనా సర్వే సంస్థల గణాంకాల ప్రకారం 2.13 కోట్లకు పైగా కౌలు రైతుల కుటుంబాలు ఉన్నాయి. ఇది ఖచ్చితమైన లెక్కగా భావించలేము. ఎందుకంటే 92 శాతం పైగా కౌలుఒప్పందాలు నోటిమాటగానే ఉన్నాయి. అలాంటి వారికి కౌలు రైతులుగా గుర్తింపు ఉండదు. వారు రైతుల లెక్కల్లోకి రారు. అందువల్ల వాస్తవ పరిశీలనలో కౌలు రైతుల సంఖ్య కోట్లకొద్ది పెరుగుతుంది. కౌలు రైతులు సాగుచేసే వాస్తవ భూమి 8.5కోట్ల ఎకరాలు ఉంటుందని ఆర్థిక సంస్థల,స్వచ్ఛంద సంస్థల అధ్యయనాల అంచనాగా ఉంది. దేశంలోని కౌలురైతుల్లో 36శాతం మందికి సొంత భూమి సెంట్ కూడా లేదు. దేశవ్యాప్తంగా సగటు కౌలు భూమి 25శాతం దాకా ఉన్నప్పటికీ, నిర్దిష్ట వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో కౌలుభూమి చాలాఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రొఫెసర్ రాధాకృష్ణ కమీషన్,కౌలు రైతుల సంఘాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాస్తవంగా 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు భూమిలో 60 శాతం నుండి 70శాతం కౌలు భూమిగా ఉంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో80శాతం కౌలు రైతులే ఉన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో 50శాతంపైగా కౌలు రైతులున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కూడా కౌలు రైతుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. ఎపి రాష్ట్రంలోని కౌలురైతుల్లో పది లక్షల మందికి సెంటు సొంత భూమి లేదు. తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ సాగు భూమిలో 35 శాతం భూమిని, మొత్తం రైతుల్లో 36శాతంఉన్న కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు కౌలు రైతుగా ఉన్నాడు. పంజాబ్ రాష్ట్రం వ్యవసాయపరంగా అభివృద్ధి చెందినా ,అక్కడ దేశంలోనే అత్యధికంగా 73 శాతం కుటుంబాలకు సొంత భూమి లేదు. సుమారు 25 శాతం వ్యవసాయ కుటుంబాలు కౌలు రైతులుగా ఉన్నట్లు జాతీయ నమూనా సర్వే, వివిధ అధ్యయనాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 25 శాతం భూమి కౌలు ఒప్పందాల కిందనే సేద్యం సాగుతున్నది. బీహార్‌లో మొత్తం రైతుల్లో సుమారు 40 శాతం దాకా కౌలు రైతులు ఉన్నారని వివిధ వ్యవసాయ నివేదికలు, ఆర్థిక అధ్యయనాలువెల్లడిస్తున్నాయి. వ్యవసాయ కుటుంబాల్లో 91 శాతంపైగా చిన్న, సన్న కారు రైతులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి సొంత భూమి లేకపోవడం వల్ల కౌలుదారులుగా ఇతరుల భూములు సాగు చేస్తున్నారు. సుమారు 23శాతం భూమి కౌలు రూపంలో సేద్యం జరుగుతున్నది. ఇక్కడ కూడా నోటి మాట కౌలు



విధానం అమలు జరుగుతున్నది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న కౌలుదారీ చట్టాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. భూ కామందుల ప్రయోజనాలు కాపాడుతున్నాయి. వ్రాతపూర్వక ఒప్పందం ఉంటేనే కౌలుదారుగా గుర్తింపు ఉంటుంది. వ్రాత పూర్వక కౌలు ఒప్పందం లేకపోవడం వల్ల కౌలు రైతులకు ఎలాంటి చట్టపరమైన హక్కులు లేవు. భూకామందు దయ మీద కౌలుభూమి ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెచ్చిన పంట సాగుదార్ల హక్కుల చట్టంలో భూ యజమాని అనుమతి సంతకం ఉంటేనే కౌలురైతుకు ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుంది. భూ యజమానులు అలా సంతకం పెట్టటానికి అంగీకరించకపోవడం వల్ల కౌలురైతుగా గుర్తింపు లేక పంట రుణాలు,ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటనష్ట పరిహారాలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో 87శాతం మంది రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వలేదు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ గణనీయంగా కౌలురైతులు ఉండటానికి కారణం వారి సొంత భూమి లేకపోవడమే. భూ కేంద్రీకరణ పెరగడమే. దేశ వ్యవసాయ భూమిలో దాదాపు 44శాతం భూమి కేవలం 10శాతం అత్యంత ధనిక భూ కామందు కుటుంబాల వద్ద ఉంది. వీరిలో కూడా 5 శాతం కుటుంబాల వద్ద 32 శాతంభూమి ఉంటే, 1 శాతం కుటుంబాలు ఏకంగా 10 శాతం భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. బీహార్‌లోని కొన్ని గ్రామాల్లో ఒక పెద్ద భూస్వామి కుటుంబం గ్రామం మొత్తం భూమిలో 20 శాతం కలిగి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన భూసంస్కరణల చట్టాలు భూ కేంద్రీకరణను బద్దలు చేసి పేదలకు భూపంపిణీ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పాలకులు చేసిన భూసంస్కరణల చట్టాలన్నీ భూస్వామ్య వర్గానికి నష్టం లేకుండా చేసిన కావటమే అందుకు కారణంగా ఉంది. దేశంలోను, తెలుగు రాష్ట్రాల్లోను ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు సాగునీరు, ప్రకృతి వైపరీత్యాలవల్ల పంట నష్టం, మార్కెట్ సౌకర్యం లేకపోవడం, గిట్టుబాటు ధరలు రాకపోవడం. ఈ సమస్యలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. పై సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయి.సేద్యపు ఖర్చులు పెరుగుతున్న, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవడం వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ముఖ్యంగా కౌలు రైతుల బాగా నష్టపోయి అప్పుల పాలై, తీర్చేమార్గం లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దేశంలో 1995- 2023 మధ్య అధికారిక నివేదికల విశ్లేషణల ప్రకారం 4,05,000 పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల నమోదైన రైతుల మరణాల్లో 56 శాతం కంటే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలే (కౌలురైతులు) ఉన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రైతు స్వారాజ్య వేదిక వంటి సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 75శాతం నుండి 80శాతం దాకా కౌలు రైతులే ఉన్నారని తెలిపాయి. కౌలు రైతులుఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా కౌలు రైతులతో సహా గ్రామీణ పేదలందరికీ భూ పంపిణీ జరగాలి. కౌలు రైతులకు పూర్తి రక్షణ ఉండాలి. గ్రామీణ ప్రజల అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అర్థ ఫ్యూడల్ సంబంధాలను, భూ కేంద్రీకరణను బద్దలు కొట్టాలి. ఈ పని నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేయవు. గ్రామీణ ప్రజలే సమిష్టిగా సాధించుకోవాలి. ●

# ఆర్థికవృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమా?

డి జె మోహన రావు

స్థూల దేశీయోత్పత్తి ఒక దేశ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడానికి అత్యంత ప్రభావవంతమైన కొలమానంగా స్థిరపడింది. ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతున్నాయా, ఉత్పత్తి ఎంత విస్తరించింది, దేశం ఎంత ఆదాయం సృష్టిస్తోంది వంటి ప్రశ్నలకు అది స్పష్టమైన సమాధానాలు ఇస్తుంది. కానీ ఒక దేశం ఎక్కువ ఉత్పత్తి చేయడం, అక్కడి ప్రజలు మెరుగైన జీవితాన్ని గడపడం రెండూ ఒకటే అనే హామీ జీడీపీఇవ్వదు. ప్రజల ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు, ఆదాయ పంపిణీ, పర్యావరణ స్థితి, సామాజిక ఐక్యత,సంస్థలపై విశ్వాసం వంటిఅంశాలు ఆర్థికవృద్ధి గణాంకాలకు వెలుపలే మిగిలిపోతాయి.ప్రజలు, భూగోళం పురోగతికి దిక్సూచి అనే నివేదికను ముందుకు తెచ్చింది. జీడీపీని తొలగించడం దీని ఉద్దేశం కాదు. ఆర్థిక ఉత్పత్తిని కొలిచే దానికి తోడుగా ప్రజల సంక్షేమం, సమానత్వం, పర్యావరణం, సామాజిక పరిస్థితులు, భవిష్యత్తు తరాల సామర్థ్యాన్ని కూడా కొలిచే వ్యవస్థ అవసరమని నివేదిక చెబుతోంది. ఇందుకోసం 31 సూచికలతో కూడిన విస్తృత కొలమానాన్ని ప్రతిపాదించింది. దీనికి వెనుక ఉన్న వాస్తవం ముఖ్యమైనది.1980నుంచి 2025వరకు ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు క్షీణించిన సందర్భాలు 2009 ఆర్థిక సంక్షోభం, 2020కొవిడ్ మహమ్మారి సమయంలోమాత్రమే చోటుచేసుకున్నాయి. మిగిలిన కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరించింది. అయినప్పటికీ అనేకదేశాల్లో అసమానతలు పెరిగాయి.పర్యావరణంపై ఒత్తిడి తీవ్రమైంది, ప్రజా సంస్థలపై విశ్వాసం తగ్గింది.కొన్ని సంపన్నదేశాల్లోయువత లో ఆందోళన, ఒంటరితనం పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంటోంది. ఆర్థికవృద్ధి కొనసాగడం, ప్రజల జీవితం సమగ్రంగా మెరుగుపడటం మధ్య ఉన్న అంతరాన్ని ఇది స్పష్టంచేస్తోంది. అందుకే మనం ఏది కొలుస్తామో, దానికి విలువ ఇస్తాం అన్నసూత్రం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ప్రతిపాదిత వ్యవస్థలోని 31సూచికలను నాలుగు విస్తృతరంగాల్లో సమీకరించారు. శాంతి,మానవ హక్కులు, ప్రకృతి పరిరక్షణ, ప్రస్తుతజీవన సంక్షేమం, సమానత్వం, సామాజిక భాగస్వామ్యం, భవిష్యత్తు కోసం స్థిరత్వం, తట్టుకునే సామర్థ్యం. ఇది ఆర్థిక వృద్ధిని తిరస్కరించడం కాదు. వృద్ధి వల్ల సమాజంలో ఏర్పడే వాస్తవ ఫలితాలను మరింత సమగ్రంగా చూడాలన్న ప్రయత్నం. ఈ దృష్టిలో సంపద అంటే కేవలం డబ్బు, భౌతిక ఆస్తులు మాత్రమే కావు. మానవ సామర్థ్యం,సామాజిక సంబంధాలు, సంస్థల బలం, సహజ వనరులు కూడా ఒక దేశ భవిష్యత్తును నిర్ణయించే సంపదలే.ఈరోజు వేగంగా అభివృద్ధి చెందుతూ సహజ వనరులను అతిగా వినియోగించే దేశం తాత్కాలికంగా మంచి గణాంకాలు చూపవచ్చు. కానీ ఆ అభివృద్ధి భవిష్యత్తు తరాల అవకాశాలను తగ్గిస్తే, దానినిపూర్తిస్థాయి పురోగతిగా పరిగణించడం కష్టం. ఇక్కడ మరో కీలక ప్రశ్న పంపిణీ. సగటు ఆదాయం పెరిగిందని చెప్పడం వల్ల ఆ సంపద ఎవరికి చేరిందో తెలియదు. జాతీయ స్థాయిలో ఆరోగ్యం మెరుగుపడిందని చెప్పడం వల్ల పేదలు, వెనుకబడిన ప్రాంతాలు అదేప్రయోజనం పొందాయని నిర్ధారించలేం. అందుకే పురోగతిని కొలిచే వ్యవస్థ సగటుసంఖ్యలను దాటి, ప్రయోజనాలు ఎవరికి చేరుతున్నాయి, ఏప్రాంతాల్లో మార్పు కనిపిస్తోంది అన్నదీ చూపించాలి. అయితే కొత్త సూచికలు రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటికి ఆధారమైన గణాంక వ్యవస్థలు బలంగాఉండాలి.ప్రతిపాదిత సూచికల్లో దాదాపు సగం ఇప్పటికే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కిందసేకరిస్తున్న సమాచారంపైనే ఆధారపడి ఉన్నాయి. అంటే అవసరమైన పునాది అనేక దేశాల్లో ఇప్పటికే ఉంది. ఇప్పుడు ఆ సమాచారాన్ని మరింత విశ్వసనీయంగా, సకాలంలో అందేలా చేయడం,కనిపించని రంగాల్లో కొత్త సమాచారాన్ని సేకరించడం,చివరికి దాన్ని ప్రభుత్వ నిర్ణయాలతో అనుసంధానించడం అవసరం. భారత్‌కు ఈ అంశం ప్రత్యేకంగా వర్తిస్తుంది.జాతీయ సగటు రాష్ట్రాలు, జిల్లాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల మధ్యఉన్న వ్యత్యాసాలను కప్పిపుచ్చే అవకాశం ఉంది. వేతనం లేని సంరక్షణ పని, విద్య నాణ్యత, ప్రజారోగ్యం,ఉపాధి భద్రత, పర్యావరణ నష్టం వంటిఅంశాలు ఆర్థికలెక్కల్లో పూర్తిగా కనిపించకపోయినా, ప్రజల జీవితాలను లోతుగా ప్రభావితం చేస్తాయి. అందువల్ల జాతీయ గణాంకాలతో పాటు స్థానికస్థాయిలో విశ్వసనీయమైన సమాచారం కూడా అవసరం. పురోగతికి సరిహద్దులు కూడా ఉండవు. ఒక దేశంలో పెరిగే వినియోగం మరో దేశంలో పర్యావరణ నష్టానికి కారణం కావచ్చు. ఆర్థిక వ్యవస్థ ఎంతవేగంగా పెరిగిందో చెప్పడంతో పాటు, ఆవృద్ధి ఎవరి జీవితాలను మెరుగుపరిచింది, దాని ప్రయోజనాలు ఎలా పంచబడ్డాయి, దాని కోసం ఏ మూల్యం చెల్లించాం, భవిష్యత్తుతరాలకు ఏమి మిగిల్చాం అన్నదీ చెప్పగలిగినప్పుడే పురోగతికి పూర్తి అర్థం వస్తుంది. ●

# గ్రామస్వరాజ్యమే ప్రజాస్వామ్యానికి మూలం!

రామ కిష్టయ్య సంగన భట్ల

భారత ప్రజాస్వామ్య సౌధానికి గ్రామమే తొలి ప్రాకారము, చిట్టచివరి మూలస్తంభము. పల్లె కన్నీరుపెడితే పట్నం సంబరపడలేదన్న మహాకవి వాక్కు గ్రామీణ జీవన ప్రాముఖ్యాన్ని వేనోళ్ల చాటిచెబుతోంది.కోట్లాది ప్రజల దైనందిన మనుగడతో, కష్టసుఖాలతో పెనవేసుకుపోయిన మౌలిక సమస్యలను ఢిల్లీ దర్బారు నుంచో లేక రాష్ట్రసచివాలయాల నుంచో పరిష్కరించాలనుకోవడం ప్రజాస్వామిక సౌధానికి పగుళ్లు తెచ్చే ఒక భ్రమ మాత్రమే. కేంద్రీకృత అధికార వ్యామోహానికి సరైన విరుగుడుగా, ప్రజలే తమసమస్యలను బేరీజు వేసుకుని, తమ ప్రతినిధుల ద్వారా స్వయం నిర్ణయాధికారంతో పరిష్కార మార్గాలను అన్వేషించుకునే అపురూప వేదికగా పంచాయతీరాజ్ ఆవిర్భవించింది. భారత గ్రామీణ సమాజంలో రచ్చబండల సాక్షిగా గ్రామసభలు, పంచాయతీల రూపంలో ప్రాచీన కాలం నుంచే స్థానిక స్వపరిపాలన ఉన్నప్పటికీ, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణను ఒక బలమైన ఆయుధంగా మలచడంలో బల్వంతరాయ్ గోపాల్‌జీ మెహతా పాత్ర అద్వితీయం, చిరస్మరణీయం. అందుకే ఆయన్ను భారత పంచాయతీరాజ్ వ్యవస్థకు ఆద్యుడిగా, పితామహుడిగా చరిత్ర కీర్తిస్తోంది. భారతదేశంలో స్థానిక సంస్థల పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే, 1882లో లార్డ్ రిప్పన్ ప్రవేశపెట్టిన తీర్మానం ఆధునిక స్వపరిపాలనకు తొలి పునాది రాయిగా నిలిచి, ఆయన్ను స్థానిక స్వపరిపాలన పితామహుడిగా నిలిపింది. అనంతరం 1919 మాంటెగ్యుచెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు, 1935 భారత ప్రభుత్వ చట్టాలు స్థానిక సంస్థలకు కొంత ప్రాతినిధ్య రక్షణ కల్పించినప్పటికీ, అవి వలస పాలకుల పన్నుల వసూలు యంత్రాంగాలుగానే మిగిలిపోయాయి తప్ప ప్రజాస్వామ్య ఆకాంక్షలనుప్రతిబింబించలేకపోయాయి. స్వాతంత్ర్యానంతరం జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో భారత రాజ్యాంగంలోని 40వ అధికరణంలో గ్రామ పంచాయతీల ఏర్పాటును ఆదేశిక సూత్రాలలో చేర్చారు. 1952 అక్టోబర్ 2న జాతిపిత జయంతి సందర్భంగా 55 సామాజిక అభివృద్ధి బ్లాకులతో ప్రారంభమైన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సమాజ వికాస కార్యక్రమం), 1953లో రూపుదిద్దుకున్ననేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ గ్రామీణ వ్యవసాయ, మౌలిక వసతుల కల్పనలో విస్తృత సేవలను అందించినప్పటికీ, అధికార యంత్రాంగం పెత్తనం కారణంగా ప్రజా భాగస్వామ్యం కొరవడి ఆశించిన ప్రగతిని సాధించలేకపోయాయి.ఈ లోటుపాట్లను నిశితంగా శోధించి, గ్రామీణాభివృద్ధిలో ప్రజల ప్రత్యక్షభాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన నిర్మాణాత్మక మార్గాలను అన్వేషించే బృహత్తర బాధ్యతతో 1957 జనవరి 16న జాతీయాభివృద్ధి మండలి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి అధ్యయన కమిటీని నియమించింది. ఆ కమిటీ దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, 1957 నవంబర్ 24న తన చారిత్రకనివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.పరిపాలనా వికేంద్రీకరణ మాత్రమే కాకుండా ప్రజాస్వామిక వికేంద్రీకరణ జరగాలని పిలుపు



నిచ్చిన ఈ నివేదికను 1958 జనవరిలో జాతీయాభివృద్ధి మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. బల్వంతరాయ్‌మెహతా కమిటీ ప్రతిపాదించిన మూడంచెల వ్యవస్థ భారత పరిపాలనా చిత్రపటాన్ని సమూలంగా మార్చివేసింది. గ్రామస్థాయిలో ప్రత్యక్ష ఎన్నికలతో గ్రామపంచాయతీ, బ్లాక్ లేదా మండల స్థాయిలో మధ్యంతర అంచెగా ప్రణాళికా సమన్వయానికి పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ సంస్థగా జిల్లా పరిషత్ ఉండాలని నిర్దేశించింది. అభివృద్ధి పనుల కార్యనిర్వాహక బాధ్యతను ప్రధానంగా పంచాయతీ సమితికి అప్పగిస్తూ, గ్రామీణ సంస్థలకు కేవలం విధులు మాత్రమే కాక తగినన్ని నిధులు, వనరులు, అధికారాలు బదలాయించాలని స్పష్టం చేసింది. ఈ విప్లవాత్మక సిఫారసుల ఆధారంగా 1959 అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు రాజస్థాన్‌లోని నాగౌర్‌లో నాటిప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పంచాయతీరాజ్ వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటిసారిగా లాంఛనంగా ప్రారంభించారు. ఆ వెనువెంటనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ విధానాన్ని స్వీకరించి రెండో రాష్ట్రంగా రికార్డు సృష్టించింది.1959 అక్టోబర్ 11న నాటి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బ్లాక్‌లో నెహ్రూ స్వయంగా పంచాయతీరాజ్ పాలనను ఆరంభించి, ప్రజాస్వామ్య సౌభాగ్యం పల్లెల నుంచే వెల్లివిరియాలని ఉద్బోధించారు. కాలక్రమంలో పంచాయతీలకు మరింత స్వయంప్రతిపత్తి కల్పించాలనే సంకల్పంతో అశోక్ మెహతా కమిటీ, ఎల్.ఎం. సింఘ్వీ కమిటీల నివేదికల ఆధారంగా 1992లో తీసుకువచ్చిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం స్థానిక సంస్థల చరిత్రలో సువర్ణాక్షర లిఖితమైంది. 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిన ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో 9వ భాగం, 11వ షెడ్యూల్ చేర్చబడి, 29 అభివృద్ధి విధులను పంచాయతీలకు అప్పగించారు. గ్రామ సభకు ప్రాథమిక వేదికగా రాజ్యాంగ హోదా, ప్రతి ఐదేళ్లకు ఒకసారి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పారదర్శక ఎన్నికలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు 33శాతం (ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో 50శాతం) రిజర్వేషన్లు, స్థానిక వనరుల పంపిణీకి రాష్ట్ర ఆర్థిక సంఘాల ఏర్పాటు తప్పనిసరి చేయబడ్డాయి. తద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 2.5 లక్షలకు పైగా గ్రామపంచాయతీల్లో 31 లక్షల మందికి పైగా ప్రజాప్రతినిధులు, అందులో 14 లక్షలకు పైగా మహిళా నాయకులు స్థానిక పాలనాపగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే పంచాయతీరాజ్ విజయం కేవలం ఆర్భాటంగా ఎన్నికలు జరపడంతోనో, ప్రజాప్రతినిధుల సంఖ్యతోనో ముడిపడి లేదు. పాలనకు అవసరమైన మూడు 'ఎఫ్'లు ఫండ్స్ (నిధులు), ఫంక్షన్స్ (విధులు), ఫంక్షనరీస్ (సిబ్బంది) గ్రామస్థాయికి సంపూర్ణంగా బదిలీ అయినప్పుడే అసలైన స్వపరిపాలన సాధ్యమవుతుంది. అభివృద్ధి నిధులను కేవలం సంక్షేమ పథకాల పంపిణీకే పరిమితం చేయకుండా, స్థానిక ఉపాధి, తాగునీరు, పారిశుధ్యం, గ్రామ సంపద సృష్టి దిశగా స్వయం నిర్ణయాలు తీసుకునే అధికారం గ్రామాలకు దక్కాలి. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నట్లుగా గ్రామ సభల్లో ప్రజల ఉదాసీనత వీడాలి. గ్రామంలోని ప్రతి పౌరుడూ బడ్జెట్ రూపకల్పన, సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ప్రక్రియల్లో వేలెత్తి ప్రశ్నించే చైతన్యాన్ని ప్రదర్శిం చాలి. ఊరి సమస్య ఊరిలోనే పరిష్కారం అన్న భావన సజీవమైనప్పుడే అధికార పెత్తనం అంతమై ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ●

# ప్రజావాక్కు

## ఎంట్రీ పొరపాట్లు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతకీలకమో, వాటికి ఆధారమైన ఓటరు జాబితా అంతకంటే కీలకమైనది. పరిశుభ్రమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా లేకుండా స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలను ఊహించలేం.అయితే ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలన (సర్) ప్రక్రియపై ప్రజల్లో ఎటువంటి అనుమానాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.ఒక ఓటరుకినోటీసు ఎందుకుఇచ్చారు, ఏ కారణాల వల్ల ఆయన పేరు పరిశీలనకు వచ్చింది, ఎలాంటి పత్రాలను సమర్పించాలి అనే విషయాలపై ఎన్నికల సంఘం సరళమైన, అందరికీ అర్థమయ్యే మార్గదర్శకాలను విడుదల చేయాలి.చాలా సందర్భాల్లో పేర్ల స్పెల్లింగ్ తేడాలు, చిరునామా మార్పులు,పాత రికార్డులు లేదా డేటా ఎంట్రీ పొరపాట్లవల్లే వ్యత్యాసాలు ఏర్పడతాయి. వాటిని ఉద్దేశ పూర్వక తప్పిదాలుగా పరిగణించడం సరైంది కాదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కూరగాయల సాగు చేపట్టాలి

వికసిత్ భారత్ ప్రణాళికలో గ్రామీణ ఆర్థికానికి పెద్ద పీట వేయడమేకాదు గ్రామీణ ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ జరగాలి. ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే గ్రామీణ ఆర్థికవ్యవస్థ పునాదిపైన భారతదేశం ఆధారపడి ఉందని గమనించాలి.తీవ్రమైన ఆహార సంక్షోభం రాబోతున్నదని విదేశాంగ మంత్రి చెపుతున్న నేపథ్యంలో నీటిని ఒడిసి పట్టడమే ప్రధాన కర్తవ్యం కావాలి. దానికి నీటి కుంటల నిర్మాణం పెద్ద సంఖ్యలో చేయాలి. దానికి విరివిగా ప్రచారం చేయడం అవగాహన కల్పించడం ముఖ్యం. అలాగే ప్రతి ప్రభుత్వ కార్యాలయం దగ్గర ఒక రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం చేయాలి.

- భారత అవినాష్, జనగామ

## టీచర్లు చెప్పేది వినాలి

రాష్ట్రంలోఉన్న వివిధగురుకులాల్లో విద్యాబోధన చేస్తున్న వైకల్యం కలిగిన వికలాంగుల లెక్చరర్స్, టీచర్స్, సమస్యలు పరిష్కారం చేయాలి. వైకల్యం గురువులను విద్యార్థులు హేళన చేస్తున్నారు. లెసన్స్ వినడం లేదు. దృష్టి లోపంకలిగిన అంధులు రాత్రి పూట నైట్ స్టడీ డ్యూటీలో ఇబ్బంది పెడుతున్నారు. వారిని దృష్టి లోపం కలిగిన లెక్చరర్స్ టీచర్స్ గుర్తు పట్టలేక పోవుతున్నారు. వివిధ రాకలైన వైకల్యం కలిగిన వికలాంగుల గురువులను నైట్ స్టడీ డ్యూటీ నుండి మినహాయించాలి.

-కె. శ్రీనివాస్, వరంగల్

## కోహ్లీ టెస్టు రిటైర్మెంట్ వెనక్కి తీసుకోవాలి

విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకుని మళ్లీ టెస్టుల్లో ఆడాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్నక్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.ఇప్పటివరకు టెస్ట్‌క్రికెట్‌లో 30 సెంచరీలు సాధించిన కోహ్లీకి ఇంకా టెస్ట్ క్రికెట్ ఆడే సత్తా ఉందని అభిమానులు నమ్ముతున్నారు. అతని ఫిట్‌నెస్, ఆటపై ఉన్న పట్టుదల చూస్తే మరో కొన్ని సంవత్సరాలు క్రికెట్ ఆడగల సామర్థ్యంకనిపిస్తోంది. టెస్ట్‌క్రికెట్‌లో అతనికి ఉన్న అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుంది. కష్టమైన పరిస్థితుల్లో కూడా పోరాడే అతని తీరు ఎంతోమంది యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలిచింది. కోహ్లీని కేవలం భారతీయులే కాకుండా ప్రపంచంలోని ఎంతోమంది క్రికెట్ అభిమానులు తమ రోల్ మోడల్‌గాభావిస్తారు.అలాంటి ఆటగాడు టెస్ట్‌క్రికెట్‌కు దూరంగా ఉండటం అభిమానులకు బాధ కలిగించే విషయమే. అందుకే తన నిర్ణయాన్ని మరోసారి ఆలోచించి, టెస్ట్ క్రికెట్‌కు తిరిగిరావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## దేవాలయ భూములను కాపాడాలి

నేడు చాలా గ్రామాలలో దేవాలయాలకు సంబంధించిన భూములు అక్రమ రిజిస్ట్రేషన్లు బినామీల పేరు పై బదలాయింపు చేస్తున్న సంఘటనలు ఎన్నో చూస్తున్నాం. అధికారం అడ్డం పెట్టుకుని అడిగేటోడు ఎవ్వడు లేరు ఈ గ్రామంలో అని విర్రవీగుతున్న నాయకుల చెర నుండి సమగ్ర సర్వే చేయించి దేవాలయ భూములు కాపాడాలి.ఎవరైతే అక్రమంగా కాజేసరో వారిని చట్ట ప్రకారం శిక్షించాలి.గ్రామంలో ఎక్కడ అవినీతి అక్రమాలు చేస్తూ అప్పనంగా స్వాధీనం చేసుకుంటాం అంటే ఊరుకునేది లేదు.యువత ప్రశ్నిస్తూనే ఉంటుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

నేటి సమాజంలో ఆహార కల్తీ ఒకతీవ్రమైన సమస్యగా మారుతోంది. కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం తక్కువ ధరకు లభించే నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇలాంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్రజలు అనేక రకాలఅనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులుఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపైచర్యలు తీసుకోవాలి.ప్రతి వ్యాపారి నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడం తన బాధ్యతగా గుర్తించాలి.

- కె.రామకృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)



# పైలట్ స్మిత్‌పై గొడ్డలితో దాడి?

## అటాక్ ఎలా జరిగిందంటే?

**టెల్ అవీవ్, అక్టోబరు 1:** ఇజ్రాయిలీ దేశస్థులతో వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో.. పైలట్‌పై కోపైలట్ అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే కాక్‌పిట్‌లోకి ఎలా వెపన్‌ను తీసుకెళ్లారన్న ప్రశ్న ఉత్పన్నం అయ్యింది. ఒమన్‌కు చెందిన కోపైలట్ కత్తి వాడినట్లు తొలుత భావించారు. కానీ ఇండియన్ పైలట్ స్మిత్ మచ్చర్‌ను గొడ్డలితో నరికినట్లు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లోకి వెళ్లే సమయంలో కోపైలట్ వద్ద కత్తి కానీ, మరో ఆయుధం కానీ లేదని, కానీ అతను ఆ కాక్‌పిట్‌లో ఉన్న క్రాష్ యాక్స్ లేదా ఫైర్ యాక్స్ వాడినట్లు భావిస్తున్నారు. దాడి కోసం గొడ్డలి వాడి ఉంటాడని ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా తొలుత అనుమానాలు వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి విమానం బయలుదేరిన రెండున్నర గంటల తర్వాత అకస్మాత్తుగా 33వేల ఫీట్ల ఎత్తు నుంచి 17 వేల ఫీట్లకు గాలిలోనే విమానం దిగజారింది. జోర్డాన్ బోర్డర్ సమీపంలో ఆ విమానం ఒక్కసారిగా వెనక్కి తరిగింది. సౌదీ సిటీ తబుక్‌లో ఆ విమానం ల్యాండ్ అయినట్లు ఫ్లైట్‌రేడార్24 పేర్కొన్నది. ఒకవైపు ప్రయాణికులు అరుస్తుండగా, రక్తంతో తడిసిన పైలట్ మేడే అంటూ ఎటిసితో పేర్కొన్నాడు. విమానాన్ని హైజాక్ చేస్తున్నట్లు అతను ఎటిసికి చెప్పాడు. అయితే అంతర్జాతీయ విమాన నిబంధనల ప్రకారం ప్రతి కమర్షియల్ విమానంలో ఓ చిన్నపాటి గొడ్డలి ఉంటుంది. ఒకవేళ ఎమర్జెన్సీలో అవసరం వస్తే, ఆ గొడ్డలిని వాడే రీతిలో దాన్ని విమానాల్లో తీసుకెళ్తుంటారు. సెప్టెంబర్ లెవన్ దాడులకు ముందు ప్రధాన క్యాబిన్లలో గొడ్డలిని స్టోర్ చేసేవాళ్లు. కానీ ఇప్పుడు ఆ గొడ్డళ్లను కాక్‌పిట్‌కు తరలించారు. దాడికి పాల్పడిన కోపైలట్ వివరాలను ఇంకా పూర్తిగా వెల్లడించలేదు. గొడ్డలితో దాడి చేసిన కోపైలట్‌ది ఒమన్ అని గుర్తించారు. అతన్ని అరెస్టు చేసినట్లు నెతన్యహూ తెలిపారు. విమానం హైజాక్ ఘటన పట్ల దర్యాప్తు చేపడుతున్నట్లు సౌదీ, యూఏఈ అధికారులు వెల్లడించారు. దర్యాప్తు నేపథ్యంలో ఇజ్రాయెల్ వెళ్లే విమానాలను రద్దు చేసినట్లు ఫ్లైదుబాయ్ పేర్కొన్నది. సెప్టెంబర్ లెవన్ లాంటి దాడి జరగకుండా పైటల్ మచ్చర్ అడ్డుకున్నాడని నెతన్యహూ తెలిపారు.

**ఘటన ఎలా జరిగిందంటే:** దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి కోపైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత అధికారులు తెలిపారు.

### ఫ్లై దుబాయ్ విమాన ఘటనలో ఉగ్ర కోణం

**- ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిన యుఎఇ**

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్లాల్సిన ఫ్లైదుబాయ్ సంస్థకు చెందిన విమానంలో అనూహ్య ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ విమాన ఘటన ఇప్పుడు సంచలనం కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని యుఎఇ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు యుఎఇ అటార్నీ జనరల్ కౌన్సిలర్ డా హమద్ అల్ షంసి ఆదేశించారు. దీనిపై యుఎఇ విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటన చేసింది. విమాన ఘటనపై దర్యాప్తు చేసేందుకు నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఘటనపై తీవ్రవాద కోణం సహా అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతామన్నారు. ఈ విమానం యుఎఇలోనే రిజిష్టర్ అయిందని, తమ దేశ జెండా కలిగి ఉందని తెలిపింది. ఈ విమానంలో జరిగిన ఘటనలు తమ దేశ చట్టాలకు చెందుతాయని, ఈ నేర ఘటనల్ని తాము విచారిస్తామని వివరించింది. తమ దేశం బయట ఘటన జరిగినప్పటికీ తమ విచారణ పరిధిలోకి వస్తుందని యుఎఇ తెలిపింది.

# 'ఫ్లైదుబాయ్' కెప్టెన్ స్మిత్‌పై ప్రశంసల వెల్లువ

- రాష్ట్రపతి, ప్రధాని మోడీ సహా ప్రపంచ దేశాధినేతల అభినందనలు
- స్మిత్ మచ్చార్‌పై గొడ్డలితో దాడి... ఎదురొడ్డి విమానం సేఫ్ ల్యాండింగ్
- భారత్ పైలట్ కెప్టెన్ స్మిత్‌కు అవార్డు ప్రకటించిన గుజరాత్ సిఎం
- సౌదీఅరేబియాలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్




**న్యూఢిల్లీ, టెల్ అవీవ్, అక్టోబరు 1:** ఫ్లైదుబాయ్ పైలట్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తున్న విమానం కాక్‌పిట్‌లో పైలట్‌పై కోపైలట్ కత్తితో దాడి చేశాడు. అయితే విమానం హైజాక్‌ను పైలట్ అడ్డుకున్నట్లు తెలుస్తోంది. ఫ్లైదుబాయ్ పైలట్‌ను స్మిత్ మచ్చర్‌గా గుర్తించారు. భారత జాతీయుడైన మచ్చర్ చూపిన తెగువను అందరూ ప్రశంసిస్తున్నారు. ఫ్లైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన యుపిఎస్‌సి శతాబ్ది వేడుకల్లో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. "కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. స్మిత్ మచ్చర్ కుటుంబానికి మోడీ ఫోన్.. అండగా ఉంటామని ప్రధాని భరోసా ఫ్లైదుబాయ్ విమానంలో సహ పైలట్ చేతిలో కత్తి దాడికి గురై, తీవ్ర గాయాలతోనూ ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కుటుంబంతో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. స్మిత్ చూపిన అసామాన్య ధైర్య సాహసాలను ప్రధాని కొనియాడారు. ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రధాని మోడీ నేరుగా స్మిత్ భార్య, తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన పైలట్‌కు భారత రాయబార కార్యాలయాల ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఫ్లైదుబాయ్ పైలట్‌ను స్మిత్ మచ్చర్‌ను 'హీరో'గా పోల్చారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. ఓవల్ ఆఫీసులో రిపోర్టర్లతో మాట్లాడిన ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూతో ఈ అంశం గురించి మాట్లాడినట్లు చెప్పారు. బహుశా ఆ పైలట్ పరిస్థితి క్రిటికల్‌గా ఉండి ఉంటుందని, కానీ అతను చూపిన తెగువ అద్భుతమని, అతనో హీరో అంటూ ట్రంప్ పేర్కొన్నారు. పైలట్ తన కాక్‌పిట్ డోర్‌ను తెరిచి, ప్రయాణికుల నుంచి సహాయం కోరాడని, బహుశా ఆ కోపైలట్ ఉగ్రవాది అయి ఉంటాడని ట్రంప్ అన్నారు. ఓ ఇజ్రాయిలీ ప్యాసింజర్ రక్తసిక్తమైన పైలట్ మచ్చర్‌ను కాపాడినట్లు ట్రంప్ తెలిపారు. ఫ్లైదుబాయ్ విమానంలో సహ పైలట్ జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, అసాధారణ ధైర్యసాహసాలతో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు గుజరాత్ ప్రభుత్వం 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు'ను ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. స్మిత్ మచ్చర్‌ను 'గుజరాతీ వీర పుత్రుడు'గా అభివర్ణించిన భూపేంద్ర పటేల్, కెప్టెన్ ప్రదర్శించిన అసాధారణ ధైర్యం, మానవత్వం ప్రశంసనీయమని కొనియాడారు.

స్మిత్ చూపిన ఈ స్ఫూర్తి రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ప్రజలంతా ప్రార్థిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు.

అతడు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షి స్తూ సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## ఎలాన్ మస్క్‌కు యుఎస్ రక్షణ శాఖలో కీలక బాధ్యతలు

### భవిష్యత్తులో వచ్చే యుద్ధ మార్పులపై అధ్యయనం



**వాషింగ్టన్, అక్టోబరు 1:** అమెరికా రక్షణ రంగం భవిష్యత్తును పూర్తిగా మార్చివేసే దిశగా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో జరిగే యుద్ధాలు, సాంకేతిక మార్పులపై అధ్యయనం చేసేందుకు సరికొత్త ఉన్నతస్థాయి సలహా కమిటీని ఏర్పాటు చేసింది. 'ప్రాజెక్టు మెరిడియన్'గా నామకరణం చేసిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం, స్పేస్‌ఎక్స్, టెల్సా అధినేత ఎలాన్‌మస్క్ నాయకత్వం వహించనున్నారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ గురువారం జరిగిన 'స్టేట్ ఆఫ్ ది ఫోర్స్' ప్రసంగంలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు. అమెరికా సాయుధ బలగాలు వెనుకబడిపోకుండా ముందే అప్రమత్తం చేసేందుకే 'ప్రాజెక్టు మెరిడియన్' దోహదపడుతుందని హెగ్సెత్ చెప్పారు. అమెరికా సైనిక వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. 'ప్రాజెక్ట్ మెరిడియన్' ప్యానెల్‌ను కేవలం ఒకరిద్దరితో పరిమితం చేయకుండా, ప్రైవేట్ రంగంలోని మేధావులను భాగస్వామం చేశారు. ఎలాన్ మస్క్‌తోపాటు డిఫెన్స్ టెక్ దిగ్గజం, అండూరిల్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాల్ లక్కీ, మాజీ హౌస్ స్పీకర్ న్యూట్ గ్రింగ్రిచ్‌లు ఈ ప్రాజెక్టుకు సహాయకులుగా ఉండనున్నారు. రక్షణ శాఖ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎమిల్ మైఖేల్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కమిటీ పనిచేస్తుంది. ప్రైవేట్ రంగ నిపుణులను రక్షణ రంగంలోకి ఈ కమిటీలో చేర్చడంపై పీట్ హెగ్సెత్ స్పందించారు. 'భవిష్యత్తులో జరిగే సంఘర్షణను అంచనా వేసే అత్యుత్తమ మేధావులు కేవలం పెంటగాన్ నాలుగు గోడల మధ్యే ఉండరు. మనకు మనమే ప్రశ్నలు వేసుకుని, అవే సమాధానాలు వెతుక్కోవడంలో నష్టాలు సంభవించే ప్రమాదం ఉంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలోని సరికొత్త ఆలోచనలను రక్షణ వ్యూహాలకు అనుసంధానించడమే ఈ నిర్ణయ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్యానల్‌కు 120 రోజుల గడువు ఈ ప్రాజెక్టుకు అమెరికా రక్షణ శాఖ అత్యంత గడువును విధించింది. 120 రోజుల గడువు లోపే భవిష్యత్తు యుద్ధాల సరళి, వివిధ రంగాలు, సాంకేతికతల గమనంపై అధ్యయనం చేయాలని సూచించింది. ఈ స్వల్ప వ్యవధిలో అధ్యయనాన్ని పూరినత చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో సైనిక నాయకత్వం కోసం ప్రత్యేకంగా ఒక రహస్య నివేదికను కూడా ఈ బృందం సమర్పిస్తుంది.

## ఇళయరాజాకు సుప్రీంలో చుక్కెదురు



**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాల నాటి 'ఎన ఇనియ పొన్ నిలవ్' పాట కాపీరైట్ హక్కుల వివాదంలో ఇళయరాజా దాఖలు చేసిన అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. 1980 నాటి తమిళ చిత్రం 'మూడు పాన్ని'లోని ఈ పాట ట్యూన్‌కు (సంగీతానికి) మాత్రమే ఇళయరాజాకు హక్కులు ఉంటాయని, పాట సాహిత్యం, సౌండ్ రికార్డింగ్‌పై ఆయనకు ఎలాంటి హక్కులు ఉండవని కోర్టు తేల్చిచెప్పింది.

సినిమా నిర్మాత నుంచి సౌండ్ రికార్డింగ్ హక్కులను పొందిన మ్యూజిక్ లేబుల్ 'సరిగమ'కు అనుకూలంగా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 'అగతియ్యా'అనే మరో సినిమాలో ఈ పాటను రీక్రియేట్ చేయడంతో ఈ వివాదం మొదలైంది. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ కేసులో సరిగమ సంస్థకు పూర్తిస్థాయిలో న్యాయపరమైన ఉపశమనం లభించినట్లయింది.

# సంక్షిప్త వార్తలు

## పంజాబ్ పిసిసి చీఫ్ అమరీందర్ సింగ్ రాజా రాజీనామా



**పంజాబ్, అక్టోబర్ 1:** అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు పంజాబ్ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌కు రాజీనామా లేఖ అందించారు. 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు మరికొన్ని నెలలే ఉన్న సమయంలో ఈ మార్పు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మళ్లీ 'కాంగ్రెస్'లోకి శంకర్‌సింగ్ వాఘేలా



**అహ్మదాబాద్, అక్టోబరు 1:** గుజరాత్‌లో 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఆ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత శంకర్‌సింగ్ వాఘేలా తొమ్మిదేళ్ల విరామం తర్వాత తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని గద్దె దించడమే లక్ష ్యంగా తాను కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ మేరకు పార్టీ పెద్దలతో చర్చలు తుది దశకు చేరుకున్నాయని, అయితే రాహుల్ గాంధీతో భేటీ తర్వాతే తన చేరికపై తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

## షూటింగ్‌లో జారిపడ్డ అమితాబ్ బచ్చన్ - మోకాలికి దెబ్బ



**ముంబై, అక్టోబరు 1:** బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ గాయపడ్డారు. ఆయన హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ టెలివిజన్ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సెట్‌లో ఈ ఘటన జరిగింది. షూటింగ్‌లో భాగంగా నడుస్తుండగా ఆయన ప్రమాదవశాత్తు జారిపడటంతో మోకాలికి గాయమైంది. ఈ విషయాన్ని అమితాబ్ స్వయంగా షోలోనే వెల్లడించారు. కెబిసి తాజా ఎపిసోడ్ ప్రారంభంలో ఈ సంఘటన గురించి బిగ్ బీ ప్రేక్షకులకు తెలిపారు. సాధారణంగా షో ప్రారంభంలో నిల్చొని మాట్లాడే ఆయన, ఈసారి మాత్రం కూర్చునే కనిపించారు.

## అఫ్ఘాన్‌లో భూ ప్రకంపనలు ' 5.3గా నమోదు



**కాబూల్, అక్టోబరు 1:** అఫ్ఘానిస్థాన్‌లోని హిందూ కుష్ ప్రాంతంలో గురువారం ఉదయం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 5.3గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సిఎస్) తెలిపింది. భారత కాలమానం ప్రకారం ఉదయం 6.59 గంటలకు భూకంపం వచ్చిందని ఎన్‌సిఎస్ వెల్లడించింది. ఉత్తర అక్షాంశం వద్ద 36.05 డిగ్రీలు, తూర్పు రేఖాంశం వద్ద 68.87 డిగ్రీల వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించామని పేర్కొంది. భూఉపరితలానికి 125 కిలోమీటర్ల లోతులో భూమి కంపించిందని వివరించింది.

## ఫ్రాన్స్‌లో జెన్ ఆల్ఫా నిరసనలు



**పారిస్, అక్టోబరు 1:** భారత్‌లో ఇటీవల 'జెన్ జీ' నిరసనలు మనం చూశాం, తాజాగా ఫ్రాన్స్‌లో 'జెన్ ఆల్ఫా' పేరుతో విద్యార్థులో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. బడుల్లో మెరుగైన సదుపాయాలను డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో విద్యార్థులు మంగళవారం నిరసన ప్రదర్శనలు చేశారు. చెత్త బుట్టలకు నిప్పు పెట్టి పోలీసులపైకి వస్తువులను విసిరేశారు. దీంతో పోలీసులు వారిపై బాష్ప వాయువును ప్రయోగించారు. టైమ్‌టేబుల్, తరగతికి ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య, టీచర్ల కొరత, ఉక్కపోతగా ఉన్న తరగతి గదులు తదితర సమస్యలపై వారం రోజుల నుంచి విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## ఢిల్లీలోక్షీణించిన గాలి నాణ్యత

న్యూఢిల్లీ, అక్టోబరు 1: దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత క్షీ ణించింది. గురువారం ఉదయం ఎక్యూఐ ఉన్నత స్థాయి నుంచి సాధా రణ స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం ఢిల్లీలో ఎక్యూఐ 129గా ఉంది. గత ఐదేళ్ల నుంచి అంటే 2022 నుంచి 2026 వరకు ఢిల్లీలో గాలి నాణ్యతను పరిశీలిస్తే ఈ సెప్టెంబరు నెల సగటు కూడా చాలా తక్కువగా ఉంది. అంటే గడిచిన నాలుగు సెప్టెంబరుల కంటే ఈ సెప్టెంబరులోనే తక్కువ నాణ్యత ఉన్నది. కమి షన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఈ విషయాన్ని వెల్లడించింది.

ఢిల్లీలో యేటా శీతా కాలంలో గాలి నాణ్యత క్షీ ణించడానికి పంట వ్యర్థాలను కాల్చడమే ప్రధాన కారణంగా తెలుస్తున్నది.



## ఉగ్ర నిధుల కేసు: యాసిన్ మాలిక్‌తో పాటు ఏడుగురిపై చార్జీలకు కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** కశ్మీర్ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్‌కు ఢిల్లీలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఏ) కింద మాలిక్‌తో పాటు మరో ఆరుగురు వ్యక్తులు, ఒక కంపెనీపై అభియోగాలు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద, విధ్వంసక కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు పాకిస్థాన్ నుంచి హవాలా మార్గాల్లో నిధులు అందుకున్నారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తు చేస్తున్న ఈ కేసులో, నిందితులపై అభియోగాలు నమోదు చేసేందుకు ప్రాథమికంగా తగినన్ని ఆధారాలు ఉన్నాయని ప్రత్యేక జడ్జి ప్రశాంత్ శర్మ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం రూ.8.94 కోట్ల మేర నేరపూరిత ఆదాయం సమకూరినట్లు ఇడి ఆరోపించింది. యాసిన్ మాలిక్ సౌదీ అరేబియా నుంచి రూ.15.75 లక్షలతో సహా మొత్తం రూ.30.75 లక్షల విదేశీ నిధులను నేరపూరిత ఆదాయంగా పొందినట్లు దర్యాప్తులో తేలింది. 2017లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టింది. యాసిన్ మాలిక్‌తో పాటు ఈ కేసులో జహూర్ అహ్మద్ షా వతాలి, షబ్బీర్ అహ్మద్ షా, మసరత్ ఆలం భట్ తదితరులు నిందితులుగా ఉన్నారు.

సెప్టెంబరు 9న జారీ చేసిన ఈ ఉత్తర్వులు గురువారం వెలుగులోకి వచ్చాయి. భద్రతా కారణాల దృష్ట్యా కొందరు నిందితులను కోర్టుకు తీసుకురాలేకపోవడంతో, జ్యుడీషియల్ కస్టడీలోనే వారి నుంచి అభియోగాలపై సంతకాలు తీసుకోవాలని ఇడికి కోర్టు సూచించింది. కేసు తదుపరి విచారణను అక్టోబరు 30కి వాయిదా వేసింది.

# గిరిజన ప్రాంతాల్లో ఏదీ అభివృద్ధి?

**- అనారోగ్యం, పోషకాహార లోపంతో పిల్లలు మరణిస్తున్నారు - 'ఉపాధి హామీ' అమలు కావడం లేదు - కాంగ్రెస్ అధికారంలోకొస్తే వారి హక్కులు కాపాడతాం - మధ్యప్రదేశ్ బాలాఘాట్‌లో**

### ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ



**బాలాఘాట్, అక్టోబరు 1:** అనారోగ్యం, పోషకాహార లోపం కారణంగా పిల్లలు మరణించిన బాలాఘాట్ గిరిజన ప్రాంతాల్లో, అభివృద్ధి గురించి బిజెపి ప్రభుత్వాలు చేస్తున్న వాదనలు అర్థరహితమని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. బాధితులు ఇంకా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని, గిరిజనులకు కనీస వైద్య సేవలు, విద్య, ఉపాధి, భూ హక్కులు అందడం లేదని ఆయన ఆరోపించారు. అనారోగ్యం కారణంగా తమ పిల్లలను కోల్పోయిన బిర్సా బ్లాక్‌లోని జగ్లా గ్రామానికి చెందిన బైగా గిరిజన కుటుంబాలను గురువారం రాహుల్‌గాంధీ కలిసి, వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ, బాధితులకు తగిన మద్దతు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, అలాగే సంక్షేమ, అటవీ చట్టాల ప్రకారం వారికి దక్కాల్సిన హక్కులను కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. "బాలాఘాట్ గిరిజన ప్రాంతాల్లో చాలా మంది పిల్లలు అనారోగ్యం, పోషకాహార లోపం కారణంగా మరణించారు, అయినప్పటికీ వైద్యం, విద్య లేదా ఉపాధి విషయంలో ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు లేదు. కేంద్ర ప్రభుత్వం గానీ, మధ్యప్రదేశ్ ప్రభుత్వం గానీ తమ కోసం లేనట్లుగా, భారతదేశం నడిబొడ్డున గిరిజనులను గాలికి వదిలేసినట్లుగా అనిపిస్తోంది' అని గాంధీ అన్నారు. "పోషకాహార లోపం, వ్యాధుల కారణంగా చాలా మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు, కానీ బాధిత కుటుంబాలకు పూర్తి పరిహారం అందలేదు. వారిలో సగం మంది ఇంకా దీనికి దూరంగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధి గురించి పదేపదే చెబుతున్నప్పటికీ, ఆ గ్రామాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర కనీస సౌకర్యాల దుస్థితిని ఆయన ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో ఎంజిఎన్ఆర్ఇజిఏ (ఉపాధి హామీ పథకం) సరిగ్గా పనిచేయడం లేదని తీవ్ర ఆరోపణలు చేశారు. పథకం పేరు మార్చడంపై కాకుండా ప్రజలకు ఉపాధి కల్పించడంపై దృష్టి సారించాలని రాహుల్‌గాంధీ సూచించారు. ప్రభుత్వం అభివృద్ధి ప్రకటనలు చేస్తున్నప్పటికీ అవినీతి కొనసాగుతోందని, గిరిజన కుటుంబాలకు మద్దతు అవసరమైనప్పుడు పరిపాలన యంత్రాంగం జాడ కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. గిరిజన వర్గాలను సూచించడానికి కాంగ్రెస్ 'ఆదివాసి' అనే పదాన్ని ఉపయోగిస్తుందని గాంధీ పునరుద్ఘాటించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ఉపయోగించే 'వనవాసి' అనే పదంతో దీనిని పోల్చారు.

'ఆదివాసి' అంటే భారతదేశపు అసలైన నివాసులు అని ఆయన అన్నారు. తమకు అధికారం లభిస్తే, గిరిజన వర్గాలకు పూర్తి మద్దతు అందించి, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి రంగాలలో వారి హక్కులను కాపాడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

ఆయన మహారాష్ట్రలోని బిర్సీ విమానాశ్రయం నుంచి జగ్లాకు రోడ్డు మార్గంలో ప్రయాణించి, మార్గమధ్యంలో మాటే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఆగారు.

ఆయన సుమారు 15 నిమిషాల పాటు విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసు కున్నారు.

# ఇరాక్ నుంచి అమెరికా సైన్యం పూర్తిగా నిష్క్రమణ

### 'ఖరీదైన విహారయాత్ర ముగిసింది' : డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 1:** ఇరాక్ నుంచి అమెరికా సైన్యం పూర్తిగా వైదొలగడాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. నరకంలోని చేసిన అత్యంత ఖరీదైన విహారయాత్ర ఎట్టకేలకు ముగిసిందని వ్యాఖ్యానించారు. శ్వేతసౌధంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్ డెడ్‌లైన్ నాటికి ఉపసంహరణ ప్రక్రియ క్రమబద్ధంగా జరిగిందని వెల్లడించారు. గతంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే అమెరికా ఈ ఊబిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. ఈ ప్రభావం ఎన్నో యేళ్లుగా కొనసాగిందని తెలిపారు. బాగ్దాద్ వాషింగ్టన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఉత్తర ఇరాక్‌లోని ఓ వైమానిక స్థావరం నుంచి చివరి అమెరికా దళాలు నిష్క్రమించాయి. సెప్టెంబరు 30 గడువులోగా ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. దీనిని ట్రంప్ క్రమబద్ధమైన నిష్క్రమణగా ట్రంప్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. గతంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే అమెరికా ఇరాక్‌లో చిక్కుకుపోయిందని ట్రంప్ అన్నారు. ఈ ప్రభావం ఎన్నో ఏళ్లుగా కొనసాగిందని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ఆ ఘట్టం చరిత్రలో కలిసిపోయిందని వ్యాఖ్యానించారు. అమెరికా, ఇరాక్‌లు ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ (ఐసిస్)పై సాధించిన విజయానికి ఈ ఉపసంహరణ ఒక సంకేతమని ట్రంప్ తెలిపారు. అయితే ఇరాక్ భద్రతా దళాలకు శిక్షణ, ఇంటెలిజెన్స్ మద్దతును అమెరికా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాద సంస్థ ఐసిస్ అంతమే లక్ష్యంగా ఇరాక్‌లో 12 యేళ్లుగా కొనసాగుతున్న తమ సైనిక ఆపరేషన్ ముగిసిందని మంగళవారం అమెరికా ప్రకటించింది. ఇరాక్ నుంచి తమ సైనిక దళాల ఉపసంహరణ పూర్తిగా ముగిసిందని అమెరికా సైన్యం అధికారికంగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఇరాక్ ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. ఉత్తర ఇరాక్‌లో మిగిలి ఉన్న చివరి వైమానిక స్థావరం నుంచి కూడా అమెరికా దళాలు పూర్తిగా వెనుదిరిగాయని పెంటగాన్ ప్రకటించింది. అత్యంత క్రమబద్ధంగా ఈ ఉపసంహరణ ప్రక్రియ జరిగినట్లు తెలిపింది. ఇరాక్‌తోపాటు ఆ ప్రాంతంలో ఐసిస్‌ను వ్యవస్థీకృత సైనిక ముప్పుగా లేకుండా చేయడంలో తమ 12 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం విజయవంతమైనట్లు పెంటగాన్ వెల్లడించింది.

# యూ ఆర్ ఎ ట్రూ హీరో!

## మీరు చూపిన తెగువ, ధైర్యం, మానవత్వానికి గొప్ప ఉదాహరణ

## నిన్ను చూసి దేశం, ప్రపంచం గర్విస్తోంది

### కెప్టెన్ స్మిత్‌మచ్చర్‌కు గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ప్రశంసలు

**హైదరాబాద్,అక్టోబరు1,ప్రభాతవార్త:** దుబాయ్-టెల్‌అవీవ్ ఫ్లైదుబాయ్ విమాన ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్పందించారు. విమాన కెప్టెన్ స్మిత్‌మచ్చర్ చూపిన అసాధారణ ధైర్యసాహసాలను గవర్నర్ ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు కెప్టెన్ మచ్చర్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, కర్తవ్యనిబద్ధత అసమాన్యమైనదని గవర్నర్ పేర్కొన్నారు. ఆయన అపారమైన సాహసం, అకుంఠిత స్ఫూర్తి వల్ల మరింత పెద్దవిపత్తు తప్పిందని పేర్కొన్నారు. 'యూ ఆర్ ఏ ట్రూ హీరో. నిన్ను చూసి దేశం, ప్రపంచం గర్విస్తోంది' అని గవర్నర్ అన్నారు. క్లిష్టపరిస్థితుల్లోనూ ప్రయాణికుల రక్షణకు కెప్టెన్ మచ్చర్ చేసిన ప్రయత్నాలు అత్యంత ప్రశంసనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చూపిన ఆయన ధైర్యం, మానవత్వానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని గవర్నర్ అన్నారు. తీవ్ర గాయాల నుంచి కెప్టెన్ స్మిత్‌మచ్చర్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని గవర్నర్ ఆకాంక్షించారు.

# విలీనం జాప్యం జరిగినా ఫస్టుకే జీతాలు

## కాంగ్రెస్ బలపరిచే టిడబ్ల్యుయుకు ఓటు వేయండి

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, అక్టోబరు 1,ప్రభాతవార్త:** ఆర్టీసీ విలీనం ఆలస్యం అయిన ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు ఇస్తున్నామని అంతేకాదు మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణ భారం ప్రభుత్వం మోస్తూ లాభాల బాటలోకి సంస్థను తీసుకొచ్చా మని కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంకు అండగా నిలవాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. టిజిఎస్‌ఆర్‌టిసి యూనియన్ ఎన్నికల సందర్భం గురువారం జరిగిన జూమ్ సమావేశం జరిగింది. డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇంచార్జ్ లు పాల్గొన్న సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎన్నికల గురించి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ టిడబ్ల్యుయు/ఎ-4522 అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి బాణం గుర్తుపై ఓటు వేసి ఆర్టీసీ కార్మికులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి డిపోలో పని చేయాలని కోరారు. ఐఎన్‌టియుసి, ఎస్ డబ్ల్యుసి,టిఎంయు అశ్వత్థామరెడ్డివర్గం, సిఐటియు, ఎస్‌డబ్ల్యుఎఫ్ లు మొత్తం కూడా టిడబ్ల్యుయుకు సంపూర్ణ మద్దతు తెలుపు తున్నారని గుర్తుచేశారు. అన్ని డిపోల అధ్యక్షులను సమన్వయం చేసుకొని ప్రచారం చేయ కోవాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలను డిసిసిలను ఆదేశించారు. ఈ ఆర్టీసీ ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూని యన్‌ను గెలిపించుకోవడం ప్రధాన లక్ష్యంగా పని చేయాలని ఆర్టీసీ జోనల్ ఇన్ చార్జులు, ఆర్టీసీ రీజియన్ ఇన్‌చార్జిని డిపో సెక్రటరీ డిపో అధ్యక్షులను ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభు త్వం ఏర్పడగానే గతంలో పెండింగ్‌లో ఉన్న 2017 పిఆర్‌సి, డిఎ,2013 పెండింగ్ బాండ్స్ క్లియర్ చేశామనీ తెలిపారు. పిఎఫ్ బకాయిలు రూ.1205 కోట్లు ఉంటే వాటిని రూ.600 కోట్లకు, రూ.690 కోట్లు ఉన్న సిసిఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామనీ తెలిపారు.ఇవే కాకుండా నెల వారిగా పిఎఫ్, సిసిఎస్ కి 75 కోట్లు చెల్లిస్తున్నామనీ గుర్తుచేశారు. ఉద్యోగుల పై పని భారం పడకుండా ఉండడానికి 4538 ఉద్యోగాల నియామకాల భర్తీ త్వరలోనే పూర్తవుతుందనీ తెలిపారు. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న 1134 కారుణ్య నియామకాలు చేపట్టామనీ గుర్తుచేశారు.గత ప్రభుత్వం లో వివిధ కారణాలతో శాశ్వతంగా సర్వీసు నుండి రిమూవ్ అయిన వారిలో ఇప్పటి వరకు దాదాపు 250 మందికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందనీ ఆయన వివరించారు.

# దక్షిణ కొరియా అధ్యక్షుడి సలహాదారు

## ప్రొ.యంగ్‌టేచోతో కెటిఆర్ భేటీ

**హైదరాబాద్,అక్టోబరు1,ప్రభాతవార్త:** తెలంగాణ భవన్‌లో గురువారం దక్షి ణ కొరియా అధ్యక్షుడి సలహా దారు ప్రొఫెసర్ యంగ్‌టేచోతో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీ ఆర్) భేటీఅయ్యారు. ఈ సందర్భంగా సియోల్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందంతో కూడా కేటీఆర్ సమావేశం అయ్యారు. అభివృద్ధి చెం దుతున్న దేశం నుంచి గ్లోబల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా కొరియా ప్రస్థానం స్ఫూర్తిదాయకం అని కేటీఆర్ పేర్కొన్నారు. కొరి యా కంపెనీలకు తెలంగాణలో అపార అవకాశాలు.. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రగతి శీల విధానాలు మన బలమని కేటీఆర్ చెప్పారు. యంగ్‌వన్ కార్పొరేషన్, హ్యుందాయ్‌వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలను తెలంగాణకు తీసుకొ చ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, ఆవిష్కరణల్లో తెలం గాణ-కొరియా సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చెప్పారు.



తెలంగాణ భవన్‌లో గురువారం ప్రొఫెసర్ యంగ్‌టేచోకు జ్ఞాపికను అందచేస్తున్న బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్ల నియామకం త్వరలో

### ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 1,ప్రభాతవార్త:** తెలంగాణలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు ఆర్అండ్‌బి శాఖలో గత పది సంవత్స రాలుగా పేరుకు పోయిన ఖాళీలను భర్తీ చేయడానికి పూనుకొన్నామని ఆర్ బిశాఖలో 222 సహాయ కార్య నిర్వాహక ఇంజినీర్ల నియామకాలు చేపడుతున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రాత పరీక్షల షెడ్యూల్ విడుదల కూడా అయిందని ఆయన వివరించారు. నవంబరు 6,7 తేదీల్లో జరుగుతుందని అన్నారు. ఆర్అండ్‌బిలో 466 మంది ఇంజి నీర్లకు వివిధ స్థాయిల్లో పదోన్నతులు ఇచ్చామని తెలిపారు. 208 మంది డిఇలకు ఇఇలుగా పదోన్నతి ఇచ్చామని చెప్పారు. 251 మందికి నూతనంగా పోస్టింగ్‌లు ఇచ్చామని ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత గత పదేళ్లుగా పరి ష్కారం కాని ఉద్యోగ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామనీ చెప్పా రు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు మా ప్రభుత్వం అకింతభావంతో పని చేస్తోందని అన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు నూతన నియా మాకాలతో ఆర్ అండ్ బి శాఖలో పరిపాలనను మరింత బలో పేతం చేస్తున్నమని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగాలు అభివృద్ధి సంక్షేమం ప్రధాన లక్ష్యమనీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

# తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

## లేదంటే ఎస్ఇఒతోపాటు నగరం తగలబడిపోతుంది:

### మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్య

**హైదరాబాద్,అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఓట్ల తొలగింపులో ఎన్నికల కమిషన్ వైఖరి మార్చుకోవాలని, లేదంటే ఎన్నికల కమిషన్ కార్యాలయంతోపాటు హైదరాబాద్ నగరం తగలబడిపోతుందని మాజీ ఎమ్మెల్యే దానం నాగేం దర్ సంచలన కామెంట్స్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్నికల సంఘంపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసి తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. హైదరాబాద్ మొత్తం తగలబడిపోతుందని వ్యా ఖ్యానించారు. ఓట్ల తొలగిం పులో ఎన్నికల కమి షన్ వైఖరి మార్చు కోవాలన్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోని హిమాయత్‌నగర్ డివిజన్ లోనే 20 వేల ఓట్లను ఏకపక్షంగా తొలగించారని పేర్కొన్నారు. 'ఇంకా ఎన్ని పోయాయో నాకు తెల్వదు. ఇందులో చాలామంది బీజేపీతో అనుబంధంగా ఎవరైతే ఏఎంసీలున్నరో.. ఏఆర్‌వోలున్నరో బీజేపీతో కుమ్మక్కై పెద్దఎత్తున ఓట్లు తొలగించే ప్రక్రియ చేపడుతున్నారు. కాబట్టి కమిషనర్‌కు ఫిర్యాదు చేసేం దుకు వెళ్తున్న. ఎవరైతే మా ఓట్లు తీయించే ప్రయత్నం జరుగుతున్నదో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. 'నిజమైన ఓటర్లను, ఇంతవరకు 2000లో ఉండేవారు .. 2002లో ఉండేవారు.. మళ్లీ ఇప్పుడు కూడా ఉండేవారే.. మొన్న పార్లమెంట్ ఎన్నికలప్పుడు కూడా ఉండేవారు.. ఇప్పుడు మాత్రం తీసేశారు. ఈ ఓటు చోరీ నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. తప్పకుండా ఇప్పటిదాకా డిలీట్ చేసిన ఓట్లను మళ్లీ పరిగణలోకి తీసుకొని అందరికీ ఓటు హక్కు కల్పించాలి' డిమాండ్ చేస్తున్నామన్నారు. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు వ్యవస్థీ కృతంగా ఓట్ చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. స్థానికంగా ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. తన నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడే బాధ్యత తనపై ఉందని దానం నాగేందర్ తెలిపారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరు ద్ధరించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈసీ స్పందించకపోతే నిరసనలు, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




గురువారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.2 కోట్ల చేయూత

## విద్యకు చేసే సాయం తరతరాలకు ఉపయోగం:

### డిజిపి సి.వి.ఆనంద్

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపిఎస్) నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిజిపి సి.వి. అన్నారు. విద్య కోసం అందించే సహాయం సమాజంపై శాశ్వత ప్రభావం చూపుతుందని, దాని ప్రయోజనాలు భవిష్యత్ తరాలకు కూడా అందుతాయని పేర్కొన్నారు.

మంచిరేవులలోని వైఐపిఎస్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఎంవైకే లాటిక్రెట్ (ఎంవైకే ఫౌండేషన్) రూ.2 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఈ విరాళాన్ని అందించింది. ఎంవైకే లాటిక్రెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ మురళీ యాదమ గురువారం డిజిపి కార్యాలయంలో సి.వి. ఆనంద్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు కల్పించడమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లక్ష్యమన్నారు. విద్యా సంస్థల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు, ఇతర భాగస్వాములు అందిస్తున్న సహకారం ప్రాజెక్టుకు మరింత బలాన్నిస్తుందని చెప్పారు. విద్యారంగానికి ఇచ్చే విరాళం, చేయూత ఎప్పటికీ విలువైనదేనని, సమాజ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని డిజిపి పేర్కొన్నారు.

# ప్రధాని మోడీ స్ఫూర్తితో ప్రజాసేవ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వ అధినేతగా 25 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ ప్రజల్లో సేవా భావాన్ని, సామాజిక బాధ్యతను మరింత పెంపొందిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ అభియాన్‌లో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని తార్నాక పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ విస్తృతంగా కొనసాగుతుందని వివరించారు. ఈ ప్రచారంలో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛతా డ్రైవ్‌లు, శ్రమదానం మరియు పలు సేవా కార్యక్రమాలను తెలంగాణ అంతటా పార్టీ శ్రేణులు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ అందించిన ప్రజాసేవా స్ఫూర్తిని, పర్యావరణ స్పృహను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే లక్ష్యంగా బీజేపీ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# జెన్‌జిగా సామ రామ్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ అవకాశం

## క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, అక్టోబరు 1,ప్రభాతవార్త:** జెన్ జి ప్రాధాన్యతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడో గుర్తించారనీ ఇం దులో భాగంగానే బాల్మూర్ వెంకట్, అనిల్‌కుమార్ యాదవ్‌లకు గతంలోనే అవకాశం ఇచ్చారని ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా జెన్ జి సామ రామ్మో హన్‌రెడ్డికి అవకాశం ఇచ్చా రని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి అన్నారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లా డుతూ రేవంత్ రెడ్డి సిఎం పదవి చెప్పట్టిన తర్వాత ఎమ్మెల్యే కోటాలో 2 ఎమ్మెల్సీ స్థానాలు వస్తే మహేష్ కుమార్ గౌడ్, బాల్మూర్ వెంకట్‌కు ఇచ్చి సామాజిక సమతుల్యత పాటించారని. రెండోసారి ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీలు ఎస్సి సామజికవర్గం అద్దంకి దయాకర్, ఎస్‌టి కోటాలో శంకర్‌నాయక్, బిసి కోటాలో విజయశాంతికి ఇచ్చారని చరిత్రను వివ రించారు. రెండుసార్లు ఒక్క రెడ్డి సామజికవర్గానికి కూడా ఎమ్మెల్సీ ఇవ్వ లేదనీ ఆయన తెలిపారు. ఇక గవర్నర్ కోట లో రెండు స్థానాలు ఖాళీగా ఉంటే ఒక్కటి మైనారిటీ నేత అజారుద్దీన్ కీ ఇస్తే మరొక్కటి తెలంగాణ ఉద్యమ నేత కోదండ రాంరెడ్డికి ఇచ్చా రని చెప్పారు. అనిల్ కుమార్ యాదవ్ కీ రాజ్యసభ ఎంపిగా ఎంపికచేసి ఎగువ సభకు పంపారని గుర్తుచేశారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు కష్టపడి గెలువాల్సి ఉండటంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆ సామాజిక వర్గంకు ఇచ్చారని బిసిలకు ఎలాంటి పోటీ లేకుండా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలు ఇచ్చారని ఆయన చెప్పారు.



గురువారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

# కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలపై రాహుల్‌గాంధీ మౌనం ఎందుకు?

### బిజెపి రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గాల్లో ప్రయాణిస్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో సహపైలట్ దాడి చేసి విమానాన్ని కూల్చేందుకు యత్నించగా, తీవ్రంగా గాయపడి కూడా ఎదురొడ్డి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కనబరిచిన అద్భుతమైన ధైర్యసాహసాలపై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతుంటే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కనీసం స్పందించకపోవడాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన స్పందిస్తూ... ప్రాణాలకు తెగించి విమాన ప్రమాదాన్ని తప్పించి వందలాది మందిని కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసాన్ని చూసి యావత్ దేశం గర్విస్తూ, ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తుంటే, రాహుల్ గాంధీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రోజంతా పలు అంశాలపై వరుస పోస్టులు పెట్టిన రాహుల్ గాంధీ, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను నిలబెట్టిన భారత పైలట్ ధైర్యసాహసాల విష యంలో ఎందుకు మౌనం వహించారో సమాధానం చెప్పాలని నిలదీశారు.

# కరవు మండలాల ప్రతిపాదన

## మద్దతు ధరతో వంద శాతం కేంద్రం కొనుగోలు చేయాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త :** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలం యూనిట్‌గా కరువు మండలాలకు సంబంధించిన ప్రతిపాదనలకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో కేంద్రం రూపొందించిన కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం కేవలం వర్షపాతం లోటును మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, వర్షపాతం వ్యత్యాసం, పొడి కాలం, విత్తిన విస్తీర్ణం, నేల తేమ, రిజర్వాయర్ నిల్వలు, భూగర్భజల పరిస్థితులు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి, వలసలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. దీనికి గాను వ్యవసాయశాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను వారికి ఇవ్వాల్సిందిగా తెలిపారు.

కరువు తీవ్రతను బహుళ సూచికల ఆధారంగా అంచనా వేసి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలనతో పంట నష్టాన్ని నిర్ధారించాలని చెప్పారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం లోటు ఉంటే లోటు వర్షపాతంగా, 60 నుంచి 99 శాతం లోటు ఉంటే భారీ లోటుగా, వర్షం పూర్తిగా లేకపోతే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణించాలని కరువు నిర్వహణ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయని తెలిపారు. అదే విధంగా, సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే 85 శాతం కంటే తక్కువగా ఉండటం కరువు పరిస్థితికి, 75 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం తీవ్రమైన కరువు పరిస్థితికి సూచికగా పరిగణించాలన్నారు. అలాగే మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ 100 శాతం కొనుగోలు చేయాలి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్రం పిఎస్ఎస్ లో ఆయా రాష్ట్రాలలో సాగవుతున్న పప్పుధాన్యాలు, నూనెగింజల మొత్తం ఉత్పత్తిలో నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే సేకరిస్తుందని, అలా కాకుండా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో పంటలన్నింటినీ మద్దతు ధరకు 100 శాతం కొనుగోలు చేయాలన్నారు. మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చిత్తశుద్ధితో కేంద్రం చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# ఆరేళ్లు అమెరికాలో ఉండి కెటిఆర్ స్టార్‌హోటల్ కొంటే..

# 30 యేళ్లుగా అమెరికాలో ఉన్నవాళ్లెందుకు కొనలేదు?

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఆరేళ్లు అమెరికాలో ఉండి స్టార్‌హోటల్ కెటిఆర్ కొంటే.. 30 యేళ్లుగా అమెరికాలో ఉన్నవాళ్లు ఎందుకు కొనలేదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం కెటిఆర్ వ్యాఖ్యలకు ఎంపి చామల కిరణ్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కెటిఆర్ అమెరికాలో ఉండివచ్చి 2006లో హోటల్ కొన్నానని అంటున్నారని, ఆ తర్వాత మూడు హోటళ్లు కొని 2009 ఎన్నికల అఫిడ విట్‌లో పెట్టానని చెప్తున్నారని, ప్రజలు దీనిని గమనంలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అమెరికాలో 30 యేళ్లుగా ఉంటున్న వాళ్లసైతం ఒక హోటల్, జూబ్లీ హిల్స్‌లో ఒక ఇల్లు కొనలేకపోయారని, ఇంత డబ్బు ఎలా కెటిఆర్‌కు వచ్చాయని అనుమానం వ్యక్తంచేశారు. అమెరికాలో ఆరేళ్లు ఉండి కెటిఆర్ మూడు స్టార్ హోటళ్లు కొన్నారా? అని ప్రశ్నించారు. 2014లో ధనిక రాష్ట్రాన్ని మీకు అప్పగిస్తే ఎందుకు పదేళ్లలో అప్పులు చేశారని అడిగారు. 10 స్టార్‌హోటళ్లు కట్టే సామర్థ్యం ఉన్న కెటిఆర్ ఐటీ, మున్సిపల్ మంత్రిగా ఉండి తెలంగాణను ఎందుకు ధనిక రాష్ట్రం చేయలేదని వాపోయారు. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉండి 8 లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు.

నాకు, మా నాన్నకు ఉండటానికి ఇల్లు లేదని కెటిఆర్ అంటారు.. మళ్లీ అంతలోనే మేము ఆగర్భ శ్రీమంతులమని చెబుతారు.. ఇదీ ఏమిటని అపహాస్యం చేశారు. కెటిఆర్ తన హోటళ్లను మూడింతలు చేసుకున్నారని దేశంలో ఆర్థికమాంద్యంతో చాలా హోటళ్లు మూతపడ్డాయని గుర్తుచేశారు. రాష్ట్రం పూర్తిగా దివాళా తీసింది. కెసిఆర్ కుటుంబంలో అందరికి ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇక్కడ కెటిఆర్, అక్కడ నరేంద్రమోడీ సహకారంతో అంబానీ, అదానీ పరిస్థితులు మెరుగుపడ్డాయని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనతో కెటిఆర్‌కు గుండెల్లో దడ పుడుతోందని అన్నారు. కాళేశ్వరం, ఫార్ములా ఈకార్ రేస్ అవినీతితో వచ్చిన దానితోనే నీ తెలివితేటలుగా మార్చి హోటళ్లు పెట్టారా అని నిల దీశారు. కెటిఆర్‌కు అమెరికాలో, స్విట్జర్లాండ్, ఇంగ్లాండ్‌లో ఎన్ని ఆస్తులు ఉన్నాయో స్వయంగా బయటపెడితే క్లారిటీ వస్తుందని, కెటిఆర్‌కు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయో బయటపెడితే పదేపదే మేము కెటిఆర్ ఆస్తులను బయటపెట్టాల్సిన అవసరం ఉండదని అన్నారు.

# దానంకు టికెట్టు ఇస్తే డిపాజిట్ గల్లంతు!

### ఢిల్లీలో నాగేందర్‌కు వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీలు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఉపఎన్నికలకు సమయం ఆసన్న మవడంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు ముదిరి పోయింది. దానం నాగేందర్ వ్యతిరేకులు ఏఐసిసి దృష్టిని ఆకర్షించేలా అసమ్మతిని తెలపడానికి దేశ రాజధాని న్యూఢిల్లీ నే ఏకంగా వేదిక చేసుకొన్నారు. ఖైరతాబాద్‌లో దానంకు టికెట్ ఇస్తే డిపాజిట్లు గల్లంతు అవుతాయని హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు రూపొం దించారు. సుప్రీంకోర్టుతీర్పుతో అనర్హత వేటుపడిన మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు వ్యతిరేకంగా న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రధాన గేటు వద్ద కాంగ్రెస్ నాయకులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం తీవ్ర రాజకీయ సంచలనంకు తెరలేపింది. ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడి పేరుతో వెలసిన ఈ ఫ్లెక్సీలలో దానం నాగేందర్ రాజకీయ వైఖరిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్‌ను పార్టీ కేడర్ ఎంతమాత్రం ఆమోదించడం లేదని ఆ ఫ్లెక్సీల ద్వారా బహి రంగంగా స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తే కనీసం డిపాజిట్ కూడా దక్కదని సదరు ఫ్లెక్సీలలో ఘాటుగా హెచ్చరించారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నాయకులను కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వలస నేతలకు మళ్లీ టికెట్లు కేటాయిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. ముఖ్యంగా పార్టీ అధిష్టానం దృష్టిని ఆకర్షించేందుకే ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు భావిస్తున్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అంతర్గత విభేదాలు ఇలా రచ్చకెక్కడం గ్రేటర్ హైదరాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నీయాంశంగా మారింది.

# వయోవృద్ధులు సమాజానికి బ్రాండ్ అంబాసిడర్లు




దక్షిణామూర్తిని ఘనంగా సత్కరిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్ తదితరులు

### బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

## వృద్ధుల సంక్షేమం, ఆర్థిక భరోసాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

### వైభవంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 1, ప్రభాతవార్త :** వయోవృద్ధులు సమాజానికి మార్గదర్శకులు, బ్రాండ్ అంబాసిడర్లు అని, వారి అనుభవం, ఆలోచనలు సమా జాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, వారు వయోవృద్ధులు కాదు నవసమాజ నిర్మాతలన్న తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు సేవచేసుకోవడం పూర్వజన్మ సుకృతమని స్పష్టం చేశారు. వయోవృద్ధుల అనుభవం కుటుంబ, ప్రభుత్వ అభివృద్ధికి ఉపయోగపడాల న్నారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రాష్ట్రస్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ వయోవృద్ధుల రక్షణ, గౌరవం, సంక్షేమానికి తమ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అవసరమైతే చట్టాల్లో నిబంధనలు మార్చయినా వారికి రక్షణ కల్పిస్తామని భరోసానిచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనా ప్రభుత్వం సంక్షేమం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ బస్‌పాస్‌లు ఇవ్వాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. వయోవృద్ధులకు 33 జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు, ప్రతీ జిల్లాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారి నియామకం, చేయూత పింఛన్ ద్వారా 15.60 లక్షల మందికి లబ్ధి, వృద్ధాప్యంలో ఆర్థికభారం పడకుండా పదిలక్షల వరకు నగదురహిత వైద్యం, వృద్ధుల సంరక్షణ కోసం 1700మందికి జెరియాట్రిక్ కేర్‌వింగ్‌లో శిక్షణ, 30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు, ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియ సులభతరం చేస్తామని, ట్రిబ్యునళ్లలో 2505 భరణం కేసులు దాఖలు కాగా 1346 కేసులు పరిష్కారమైనట్లు వివరించారు. ఈ సందర్భంగా పొన్నం ఆర్టీసిని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం తగుచర్యలు తీసుకుంటోందని, ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగులకు వెయ్యికోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని, సిసిఎస్, పిఎఫ్ తదితర బకాయిల చెల్లింపులు చేస్తునే ఉన్నామని, రిటైర్డ్ ఆర్టీసి ఉద్యోగుల బకాయిల పరిష్కారంపై ముఖ్యమంత్రితో చర్చించామని, త్వరలోనే వారి బకాయిల చెల్లింపుకు కార్యాచరణ ప్రకటిస్తామని వాగ్దానం చేశారు. మీ సమస్యలు ఎప్పుడైనా చెప్పుకోండి పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భరోసానిచ్చారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సేవలను గుర్తించడం, వారి జీవనాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలపై సమాజంలో అవగాహన కల్పించడం ఈ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. వయోవృద్ధుల గౌరవం, భద్రత, ఆరోగ్యం, ఆర్థిక భరోసాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 డేకేర్ కేంద్రాలను ఏర్పాటుచేసి ఆయా కేంద్రాల్లో పౌష్టికాహారం, వైద్యసేవలు, ఆటలు, వినోద కార్యక్రమాలను ఉచితం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులకు అత్యవసర సమయంలో సహాయం అందించేందుకు 14567 టోల్‌ఫ్రీ ఎల్డర్‌లైన్ అందుబాటులో ఉందని, వేధింపులు, నిరాదరణ, ఒంటరితనం, ఆశ్రయం వంటి సమస్యలపై వారు ఈ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. చివరిగా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్రబోయి, దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి తదితర అధికారు లతో కలిసి వృద్ధుల సంక్షేమం, సేవా కార్యక్రమాలకు విశేష కృషిచేసిన పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు.



బెర్లిన్ విమానాశ్రయంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

## బెర్లిన్‌లో తెలంగాణ లెజిస్లేచర్ ప్రతినిధులకు ఘనస్వాగతం

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసి యేషన్ (సిపిఎ) ఆధ్వర్యంలో స్టడీ టూర్‌లో భాగంగా జర్మనీ రాజధాని బెర్లిన్ నగరానికి చేరుకున్న తెలంగాణ లెజిస్లేచర్ ప్రతినిధులకు బెర్లిన్ విమానాశ్రయంలో తెలంగాణ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ కుమార్‌కు తెలంగాణ విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ లెజిస్లేచర్ తరఫున చేపట్టిన స్టడీ టూర్‌లో భాగంగా ప్రతినిధి బృందం గురువారం బెర్లిన్ నగరానికి చేరుకుంది. ఈ పర్యటనలో భాగంగా పార్లమెంటరీ వ్యవస్థలు, శాసనసభల పనితీరు, ప్రజాస్వామ్య ప్రక్రియలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి వివిధ అంశాలపై అధ్యయనం చేయనున్నారు. అలాగే అక్కడి పార్లమెంటరీ వ్యవస్థలు, ప్రజాప్రతినిధుల విధులు, శాసన ప్రక్రియలకు సంబంధించిన అనేక అంశాలను పరిశీలించి, పరస్పర అనుభవాలను పంచుకోనున్నారు. అంతకుముందు.. బెర్లిన్ విమానాశ్రయంలో తెలంగాణకు చెందిన విద్యార్థులు, ప్రవాస తెలంగాణవాసులు ప్రతినిధి బృందానికి ఆత్మీయ స్వాగతం పలికారు.

## హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణపై ఉత్తర్వులు జారీ

### 76 పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక విభాగాలు

### వివిధ వింగ్‌ల పరిధుల్లో మార్పులు చేర్పులు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణ, విస్తరణ, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులను రేషనలైజ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శాంతిభద్రతల సమర్థవంతమైన పర్యవేక్షణ, నేరాల నియంత్రణ, క్షేత్రస్థాయిలో పోలీసుల స్పందన, సమయాన్ని వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు పోలీసింగ్ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టింది. ఈ మేరకు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ పేరుతో గురువారం జీవోను విడుదల చేసింది. జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 76 పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక విభాగాలు వివిధ వింగ్‌ల పరిధులలో స్పష్టమైన మార్పులు చేర్పులను ప్రభుత్వం చేసింది. శంషాబాద్ జోన్ పరిధిలోని బండ్లగూడ, అల్మాస్‌గూడ ప్రాంతానికి చెందిన బడంగ్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను పూర్తిగా రద్దు చేశారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఠాణా పేరును ఇకపై శంషాబాద్ పీఎస్‌గా మార్చారు.
శంషాబాద్ వార్డు118, కొత్వాల్‌గూడ వార్డు119 పరిధిలోని గ్రామాలను ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోకి విలీనం చేశారు. మార్కెట్ పీఎస్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదిలీ కాగా, మార్కెట్ పీఎస్ పరిధిలోని బేగంపేట్ వార్డు భాగాన్ని మహంకాళి పీఎస్ పరిధిలోకి చేర్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాణా పరిధి యథాతథంగా కొనసాగుతూనే, యూనివర్సిటీ క్యాంపస్ భూభాగమంతా సంపూర్ణంగా ఓయూ పీఎస్ పరిధి కిందకే వచ్చేలా జీవో లో ప్రభుత్వం పేర్కొంది.

**3 పోలీస్ డివిజన్ల పేర్లు మార్పు:**
మహేశ్వరం గేట్ నుంచి 4 కి.మి పరిధిలోని మహేశ్వరం గ్రామాన్ని పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలోకి చేర్చారు. సైబరాబాద్ నార్సింగి పీఎస్ పరిధిలోని హైదర్‌షాకోట్, గండంగూడ, బైరాగిగూడ, పఠాన్ చెరువు వంటి ప్రాంతాలను రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోకి మార్చారు. మల్కాజిగిరి కమిషనరేట్‌లోని హయత్‌నగర్ (వార్డు53), మీర్‌పేట్, అబ్దుల్లాపూర్ మెట్ గ్రామాలను హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలోని అదిబట్ల, మీర్‌పేట్ ఠాణా పరిధిలోకి తీసుకువచ్చారు. పరిపాలనా సౌలభ్యం, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా నగరంలోని మూడు ప్రధాన డివిజన్ల పేర్లను మార్చారు అందులో ఆర్‌జిఐఏ డివిజన్‌ను శంషాబాద్ డివిజన్‌గా, చిక్కడపల్లి డివిజన్ కాచిగూడ డివిజన్‌గా, సంతోశ్ నగర్ డివిజన్ చత్రినాక డివిజన్‌గా మార్చారు. లా అండ్ ఆర్డర్ పీఎస్‌ల సరిహద్దు మార్పులకు అనుగుణంగా ఆయా పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ డివిజన్లను సవరించారు. ఆర్‌జిఐఏ ట్రాఫిక్ పీఎస్‌ను ట్రాఫిక్ శంషాబాద్ పీఎస్‌గా మార్చారు. సైబర్ సెల్ పునర్వ్యవస్థీకరణ:-మహిళా పోలీస్ స్టేషన్లకు కొత్తగా జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్, గోల్కొండ, రాజేంద్రనగర్ జోన్ల వారీగా రీమ్యాపింగ్ చేశారు. సైబర్ నేరాల దర్యాప్తును జోనల్ స్థాయిలో వేగవంతం చేసేలా జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్, గోల్కొండ, రాజేంద్రనగర్ జోనల్ సైబర్‌సెల్‌ను పునర్వ్యవస్థీకరించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023 లోని సెక్షన్7 , హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ (1348ఎఫ్) నిబంధనలకు అనుగుణంగా జారీ చేసిన ఈ నూతన పునర్వ్యవస్థీకరణ నోటిఫికేషన్‌ను తెలంగాణ అధికారిక గెజిట్ ప్రత్యేక సంచికలో ప్రచురిస్తున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

## జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

### మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో పర్యటన

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం గురువారం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌కు వెళ్లిన ఈ బృందంలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ ఎండీ సోనీ బాలాదేవి ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం ఆసియా క్రీడలను వీక్షించి, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించింది. ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, పోటీల నిర్వహణ విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించింది. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన అంశాలను అధ్యయనం చేయడంలో ఈ పర్యటన దోహదపడనుంది.

## చైనా క్యాంపస్ పేరుతో తప్పుడు ప్రచారం

### ఖండించిన నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** నారాయణ, శ్రీ చైతన్య సంస్థల మధ్య "చైనా క్యాంపస్" పేరిట భాగస్వామ్యం కుదిరినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న నకిలీ, అనధికారిక పోస్టర్ను నారాయణ విద్యాసంస్థ తీవ్రంగా ఖండిస్తోంది. సామాజిక మాధ్యమాల్లోని పోస్టర్లో ఉన్న సమాచారం పూర్తిగా అసత్యం, నిరాధారం, కల్పితం అని స్పష్టం చేసింది. నారాయణ సంస్థ అటువంటి ఒప్పందం ఏదీ కుదుర్చుకోలేదని నారాయణ విద్యాసంస్థల ప్రెసిడెంట్ పునీత్ కొత్తప ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతానికి గానీ, భవిష్యత్తులో గానీ అలాంటి ప్రతిపాదనేదీ మా పరిశీలనలో లేదు. మా సంస్థ పేరు, అధికారిక చిహ్నం (లోగో), బ్రాండ్ గుర్తింపును దుర్వినియోగం చేయటం తీవ్రమైన నేరం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, అధ్యాపకులు, ప్రజలెవరూ ఈ మోసపూరిత సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని మనవి చేశారు. నారాయణ సంస్థకు సంబంధించిన ఏ అధికారిక ప్రకటననైనా కేవలం మా అధికారిక మాధ్యమాల ద్వారా మాత్రమే తెలియజేస్తాము అని గుర్తించగలరని స్పష్టం చేశారు. ఈ నకిలీ ప్రచార చిత్రాన్ని రూపొందించి, ప్రచారం చేస్తున్న వారిపై నారాయణ సంస్థ చట్టపరమైన చర్యలు ప్రారంభించిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు కూడా నమోదు చేస్తున్నట్లు వెల్లడించింది.. మీడియా, ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఈ తప్పుడు ప్రచారం వ్యాప్తి చెందకుండా సహకరించవలసిందిగా కోరారు.

# వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ వచ్చేసింది!

### 2027 అక్టోబరు 2 నుంచి నవంబరు 21వరకు టోర్నమెంట్

### దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా మ్యాచ్‌లు

### 14 జట్లు, మూడు దశలు... 57 మ్యాచ్‌లు

### గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, జింబాబ్వే

### నవంబరు 21న జోహాన్నెస్‌బర్గ్ వేదికగా ఫైనల్ పోరు

**కేప్ టౌన్, అక్టోబరు 1:** యావత్ ప్రపంచంలో క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 2027 వరల్డ్ కప్ షెడ్యూల్ రానే వచ్చేసింది. సౌతాఫ్రికా, నమీబియా, జింబాబ్వే వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) గురువారం అధికారికంగా ప్రకటించింది. దీంతో వరల్డ్ కప్ కౌంట్ డౌన్ మొదలైంది. వచ్చే యేడాది అక్టోబరు 2 నుంచి నవంబరు 21 దాకా టోర్నీ జరగనుంది. వచ్చే యేడాది జరగనున్న ఐసిసి పురుషుల వన్డే ప్రపంచ కప్ కోసం చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్‌లను, ప్రస్తుత ఛాంపియన్ ఆస్ట్రేలియాతో పాటు 'గ్రూప్-ఏ'లో చేర్చినట్లు ఐసిసి ప్రకటించింది. 14 జట్లతో కూడిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కోసం గ్రూపుల విభజనను కేప్ టౌన్‌లోని జైట్జ్ మ్యూజియం ఆఫ్ కాంటెంపరరీ ఆర్ట్ ఆఫ్రికా (జైట్జ్ మోకా)లో నిర్వహించిన ఒక అట్టహాసమైన షెడ్యూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారికంగా వెల్లడించారు. గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, సహ ఆతిథ్య దేశం జింబాబ్వే, క్వాలిఫయర్-ఎగా నిలిచిన జట్టుతో కూడిన బలమైన జట్ల వరుస ఉంది. మరోవైపు, గ్రూప్-బిలో సహఆతిథ్య దేశం దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, క్వాలిఫయర్-బి ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లను ఒకే గ్రూప్‌లో చేర్చడం వల్ల ఈ రెండు పొరుగు దేశాల మధ్య గ్రూప్ దశలో హోరాహోరీ పోరు ఖాయమైంది. ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో భారత్ అగ్రస్థానంలో ఉండగా, ఈ మెగా ఈవెంట్‌లో శుభ్‌మన్ గిల్ తొలిసారిగా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2027 ఐసిసి పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ అక్టోబరు 2న ప్రారంభం కాగా, ఫైనల్ నవంబరు 21న జరగనుంది. 24యేళ్ల విరామం తర్వాత ఈ ప్రతిష్టాత్మక 50 ఓవర్ల టోర్నమెంట్ ఆఫ్రికా గడ్డపైకి తిరిగి రావడం కూడా దీనితోనే మొదలవుతుంది.
ఈ టోర్నమెంట్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 14 జట్లు పాల్గొనే ఈ పోటీలో 57 మ్యాచ్‌లు 12 వేదికలలో జరగనున్నాయి. ఆఫ్రికా చివరిసారిగా 2003లో ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చింది. అప్పుడు జరిగిన ఎనిమిదో ఎడిషన్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, కెన్యా దేశాలు సహఆతిథ్య దేశాలుగా వ్యవహరించాయి. తమ ఐసిసి ర్యాంకింగ్‌లు, హోదా ఆధారంగా ఇప్పటికే పది జట్లు నేరుగా అర్హత సాధించాయి. వీటిలో ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలతో పాటు భారత్, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ ఉన్నాయి.

**అక్టోబరు 10న దాయాదుల పోరు.. షెడ్యూల్ పక్కా!**
ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆసక్తిగా చూసే భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌కు ముహూర్తం ఖరారైంది. టోర్నీ ప్రారంభమైన మూడు రోజులకే, అంటే అక్టోబరు 10న చిరకాల ప్రత్యర్థుల సమరం జరగనుంది. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో సాగే గ్రూప్ దశలో భారత్ మొత్తం ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది:
అక్టోబర్ 7: భారత్ - ఆస్ట్రేలియా (కేప్‌టౌన్), అక్టోబరు 10: భారత్ -పాకిస్థాన్, అక్టోబరు 14: భారత్ - అఫ్గానిస్థాన్, అక్టోబరు 17: భారత్ - క్వాలిఫయర్ 'ఏ', అక్టోబరు 24: భారత్ - జింబాబ్వే.




**ఫార్మాట్ ఇలా:**
ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పోటీ పడనున్నాయి. అయితే ఈసారి టోర్నీ ఫార్మాట్ మార్చారు. ఇందులో 10 జట్లు ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా టోర్నీకి క్వాలిఫై అయ్యాయి. మిగిలిన నాలుగు టీమ్స్ క్వాలిఫికేషన్ ద్వారా ఎంపిక అవుతాయి. అలా 14 జట్లతో మూడు రౌండ్లలో టోర్నీ ఉండనుంది. రౌండ్-1లో 14 జట్లలో చివరి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్స్ 'రౌండ్ రాబిన్ సూపర్ సిరీస్'లో తలపడతాయి. ఇందులో అత్యుత్తమంగా ఆడిన ఒక జట్టు మాత్రమే మెయిన్ టోర్నీకి వెళ్తుంది. మిగిలిన రెండు జట్లు నిష్క్రమిస్తాయి. దీంతో 12 జట్లతో మెయిన్ టోర్నమెంట్ షురూ అవుతుంది. 12జట్లను రౌండ్-2లో రెండు గ్రూపులుగా విభజించి ఆడిస్తారు. ఒక్కో గ్రూపులో ఆరేసి జట్లు ఉంటాయి. ఆయా గ్రూపుల్లోని టీమ్స్ రౌండ్ రాబిన్ మోడల్‌లో మిగిలిన జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. ప్రతి గ్రూప్‌లో టాప్-3లో నిలిచన జట్లు తర్వాతి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. అలాగే రెండు గ్రూపుల్లో కలిపి అత్యుత్తమంగా ఆడి నాలుగో స్థానంలో ఉన్న జట్టుకు కూడా అవకాశం ఉంటుంది. ఈ ఏడు జట్లు సూపర్-7 రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. ఈ సూపర్-7లో ఏడు జట్లు కూడా ఒకే గ్రూప్‌లో ఉంటాయి. ఇందులోనూ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. టాప్-4లో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. 1వ, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు తొలి సెమీస్, 2వ, 3వ స్థానాల్లో ఉన్న జట్లు రెండో సెమీస్‌లో ఢీకొంటాయి. ఇందులో నెగ్గిన రెండు టీమ్స్ ఫైనల్స్‌కు వెళ్తాయి.

# ప్రేమను కాదన్నందుకు ప్రాణం తీశాడు

### హారిణి హత్య కేసులో వీడిన మిస్టరీ

### బైక్ గేర్‌వైర్‌ను మెడకు బిగించి హత్య

### నిందితుడు పవన్‌కుమార్ అరెస్ట్, రిమాండ్

### కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడి



గురువారం వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ

**జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబరు 1:** జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో గత నెల 22న జరిగిన నర్సింగ్ విద్యార్థిని హారిణి అను మానాస్పద మృతి కేసును పోలీసులు హత్య కేసుగా ఛేదించారు. ప్రేమను నిరాకరించిందనే ఆగ్రహంతో ఆమెను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.
ఈ కేసులో అదే గ్రామానికి చెందిన దేవరకొండ పవన్‌కుమార్‌ను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన బైక్ గేర్‌వైర్‌తో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ తెలిపారు. హారిణి మృతదేహానికి నిర్వహించిన శవ పంచనామా, వైద్య నివేదికలో ఆమె మెడకు వైరు వంటి వస్తువుతో బిగించి హత్య చేసిన ఆన వాళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో తొలుత అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**ఏడెనిమిదేళ్లుగా ప్రేమ**
పోలీసుల వివరాల ప్రకారం.. హారిణి, పవన్ కుమార్ ఒకే గ్రామానికి చెందినవారు. గత ఏడెనిమిదేళ్లుగా వీరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగింది. ఈ విషయం ఇరు కుటుంబాల పెద్దలకు తెలియడంతో 2020లో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇకపై తాము వేర్వేరుగా ఉంటామని అప్పట్లో ఇద్దరూ అంగీకరించారు. అయితే కొంతకాలం తర్వాత పవన్‌కుమార్ మళ్లీ హారిణి వెంటపడడంతో వారి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగింది. అయితే ఇటీవల పవన్‌కుమార్ ప్రవర్తనపై హారిణి అసంతృప్తి వ్యక్తంచేసి అతడిని దూరం పెట్టినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా ఖాతా లను మార్చుకోవడంతో పాటు ఇతర వ్యక్తులతో పరిచయాలు ఏర్పడ్డాయని పవన్‌కుమార్‌లో ఆమెపై అనుమానం పెరిగిందని పేర్కొన్నారు. దీంతో హారిణిపై ఆగ్రహం పెంచుకున్న అతడు ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.
హత్య అనంతరం పవన్‌కుమార్ తన ద్విచక్ర వాహనాన్ని ఎవరికీ కనిపించని ప్రదేశంలో ఉంచి అక్కడి నుంచి పరారైనట్లు డిఎస్పీ తెలిపారు. అనంతరం ఫోన్ వినియోగించకుండా బస్సులో విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి తిరుపతి వెళ్లినట్లు దర్యాప్తులో గుర్తించారు. అనంతరం ఖమ్మం చేరుకున్న అతడు రాపిడోలో పనిచేసి జీవించేందుకు తన ద్విచక్రవాహనం తీసుకెళ్లేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో గురువారం ఉదయం సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపంలో పవన్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి బైక్, రెండు మొబైల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన గేర్ వైర్‌తోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

**పోలీసు బృందానికి అభినందనలు**
హారిణి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ తరఫున డిఎస్పీ ఆదినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ జీనత్‌కుమార్, అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయసింహారెడ్డి, అదనపు ఎస్సై మనిషా ఇతర పోలీసు సిబ్బందిని అభినందించారు.

## బిల్లుల చెల్లింపుల్లో సర్పంచ్, ఉపసర్పంచ్‌ల మధ్య పంచాయితీకి చెక్

### చెక్కుల చెల్లింపులకు అడ్డంకులు లేకుండా ప్రభుత్వం కీలక ఆదేశాలు

### 7 పని దినాల్లో సంతకం చేయకపోతే కలెక్టర్ విచారణ, మరో చట్టబద్ధ అధికారికి చెక్ డ్రాయింగ్ పవర్

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధం, తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. చెక్కులపై సంతకాలు చేయడం లేదా వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ కీ ద్వారా ఆమోదించడంలో ఉప సర్పంచ్‌లు అనవసరంగా జాప్యం చేస్తే చర్యలు తీసుకునేలా పంచాయతీరాజ్ శాఖ జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ గురువారం మెమో జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో కొంతమంది ఉప సర్పంచ్‌లు ఎలాంటి సరైన కారణం లేకుండా చెక్కులపై సంతకాలు చేయకపోవడం, వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ ద్వారా ఆమోదించకపోవడం వల్ల చెల్లింపులు ఆలస్యం అవుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. చెక్కులపై సంతకం చేయాలని లేదా డిజిటల్ సిగ్నేచర్ కీ ద్వారా వ్యయాన్ని ఆమోదించాలని ఉప సర్పంచ్‌కు సమర్పించిన తేదీ నుంచి ఏడు పని దినాల్లోపు ఎలాంటి సరైన కారణం లేకుండా సంతకం చేయకపోతే.. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.
విచారణలో ఉప సర్పంచ్ ఎలాంటి సరైన కారణం లేకుండా ఉద్దేశపూర్వకంగా చెక్కులపై సంతకం చేయకుండా లేదా డిజిటల్ సిగ్నేచర్ ద్వారా వ్యయాన్ని ఆమోదించకుండా జాప్యం చేసినట్లు తేలితే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018 ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉప సర్పంచ్ కారణం లేకుండా చెక్కులపై సంతకం చేయడం లేదా వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ ద్వారా ఆమోదించడంలో జాప్యం చేసినట్లు విచారణలో తేలితే, చెక్కులను డ్రా చేసే అధికారాన్ని మరో చట్టబద్ధమైన అధికారికి అప్పగించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ అధికారాన్ని పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ, ఎంపీడీవో తదితర చట్టబద్ధ అధికారుల్లో తగిన వారికి అప్పగించే అవకాశం కల్పించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు ఈ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ సూచించింది.

## నేటి నుంచి స్వచ్ఛభారత్ అభియాన్

### రేపు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### ఖైరతాబాద్ స్థానం బిజెపిదే: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** స్వచ్ఛతా సంకల్ప్ కార్యక్రమంపై అక్టోబర్ 2న గాంధీ జయంతి నుంచి అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వరకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ అభియాన్ నిర్వహిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 3న తెలంగాణ వస్తున్నారని, 4వ తేదీన కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన పరిశ్రమకు శంకుస్థాపన చేస్తారన్నారు. అక్కడి నుంచి కరీంనగర్ వెళ్లి.. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని రాత్రికి ఢిల్లీ వెళ్తారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేశారన్నారు. రాముడు వేరు, శివుడు వేరని వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో తెలంగాణ సమాజం ఆయనను ఛీత్కరించుకుంటుందన్నారు. సనాతన ధర్మాన్ని, హిందూ సమాజాన్ని కించపరిచేలా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు. బ్రిటిష్ కాలం నుంచే ఇలా చేయడం కాంగ్రెస్‌కు అలవాటే అన్నారు. చివరకు ఇప్పుడు దేవుళ్ల మధ్య విబేధాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏముంది రేవంత్ రెడ్డి? హిందువులు అన్ని దేవుళ్ల, దేవతలను పూజిస్తారు. మీరు దేవుళ్లను నమ్మకపోతే రాహుల్ గాంధీ కూడా గతంలో శివుడి ఫొటోతో పార్లమెంటులో ఇదే తరహా రాజకీయాలు ఎందుకు చేశారన్నారు. సిఎం 2023లో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలను అమలు చేయకుండా రోజుకో కొత్త నాటకం తెరపైకి తీసుకొస్తున్నారు. కెసిఆర్ 10 ఏళ్లుగా అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని విస్మరించి ఏ నాటకాలు వేశారో ఇప్పుడు మీరు కూడా అలాగే చేస్తున్నారు. రాహుల్ గాంధీ మెప్పు కోసం సనాతన ధర్మంపై, రాజ్యాంగ సంస్థలపై రేవంత్ రెడ్డి ఇలాంటి అర్థంలేని వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ విషయంలో రాహుల్ గాంధీపై రేవంత్ రెడ్డి పోటీ పడుతున్నాడన్నారు.

**ఖైరతాబాద్ ఉప ఎన్నికపై..**
ఖైరతాబాద్ ఎమ్మెల్యే విషయంలో సుప్రీం కోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నాను. ఖైరతాబాద్ సీటు బిజెపికే సొంతం అవుతుందన్నారు. ఈ విషయంలో ప్రజలంతా బిజెపికి అనుకూలంగా ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ తీర్పు అందరు ఫిరాయింపుదారులకు వ్యతిరేకంగా ఇచ్చింది. కెసిఆర్, వైఎస్సార్, రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ రాజీనామా చేయకుండా ఫిరాయింపులు చేసి.. టిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పని చేశారు. దానం నాగేందర్.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ ఎంపి టికెట్‌తో పోటీ చేసి ఓడిపోయాడన్నారు.

# ఫారం-6లో మార్పులు ఎవరి ఆదేశంతో చేశారు?

### ఎన్నికల సంఘం సమాధానమివ్వాలి : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం-6 మార్పులపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదిగా ప్రశ్నలు లేవనెత్తారు. "ఆన్‌లైన్ ఫారం- 6లో జరిగిన మార్పులు చట్టవిరుద్ధంగా జరిగాయి. ఈ విషయాన్ని ఎన్నికల సంఘంలోని కమిషనర్లే స్వయంగా చెప్పారు. ఆ మార్పులు చేయాలని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారు? దీనిపై టిసిఎస్ సంస్థలో ఎవరు సంతకం చేశారు? ఈ మార్పులు చేయడానికి ఆ సంస్థపై ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చారా?" అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మరోవైపు, ఆన్‌లైన్ ఫారం-6లో తీసుకొచ్చిన మార్పులు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ గురువారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే యువకులు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లను పాత ఓటర్ల జాబితాతో లింక్ చేయాలనే నిబంధన వెనుక ఒక వ్యూహం ఉందని ఆరోపించారు. మొదటిసారి ఓటు హక్కు పొందే యువతను ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి ఈ అడ్డంకిని సృష్టించారని దుయ్యబట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ప్రధానమంత్రి, హోంమంత్రి ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు.

# ఫిల్మ్ చాంబర్ వద్ద తీవ్రఉద్రిక్తత

### సమావేశంలోకి దూసుకెళ్లిన సుమలత వర్గం



**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** టాలీవుడ్ ఫిల్మ్ చాంబర్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఫెడరేషన్ సమావేశంలోకి జానీ మాస్టర్ భార్య సుమలత వర్గం దూసుకెళ్లింది. ఫెడరేషన్ నాయకులతో వాగ్వా దానికి దిగారు. సమావేశానికి తనను ఎందుకు అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..చాంబర్ బయట సుమలత ఆందోళనకు దిగారు. దీంతో సుమలతకి 23 క్రాఫ్ట్‌లకు మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. సుమ లతకి మద్దతుగా పలువురు డాన్సర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిని సమావేశానికి ఎందుకు అనుమతించలేదని సుమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను జానీ మాస్టర్ వైఫ్ అయినందుకే నన్ను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. నన్ను తప్పించింది కూడా అందుకే. జాని మాస్టర్‌కు నేను భార్యనే, కానీ డాన్సర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌ను కాదా.. నన్ను ఎలా టార్గెట్ చేస్తారు? అని సుమలత ప్రశ్నించారు. నా ఫైట్ నాది.. జాని మాస్టర్‌కి నాకు సంబంధం ఏంటి? నా మీద కోపాన్ని జాని మాస్టర్ మీద చూపిండం.. నాన్ కోపరేషన్ పెట్టడం ఏంటి? అని ప్రశ్నించారు. ఆయనను ఇండస్ట్రీలో లేకుండా చేయాలి కుట్ర చేస్తున్నారని సుమలత ఆరోపించారు..
మరోవైపు సుమలత ఆరోపణలపై తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం కేసింది. ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేనిపై ఆమె లేనిపోని బురద జల్లుతున్నారు. వ్యక్తిగత విమర్శలతో సుమలత వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. డాన్సర్స్ అసోసియేషన్ వివాదంలో ఫెడరేషన్ కూడా అందరికి ఆమోదయోగ్యమైన సూచనలు చేసిందని ప్రొడక్షన్ యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణ చెప్పారు అందరూ కలసి మెలసి పని చేసుకుంటుంటే ప్రాంతాలు పేర్లతో సుమలత విభేదాలు సృష్టిస్తున్నారు. 23 క్రాఫ్ట్స్ అధ్యక్షులు, ఫెడరేషన్ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్, కోశాధికారి వెల్లంకి శ్రీనివాస్ మండిపడ్డారు. వ్యకి కాదు వ్యవస్థ ముఖ్యం మేము తిరగబడితే వేరేగా ఉంటుంది. వాళ్లు అందరూ కూర్చొని మాట్లాడుకోమని చెప్పాము. కానీ సుమలత అసత్య ప్రచారాలు చేస్తూ.. వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర తెలంగాణ యూనియన్లతో ఫెడరేషన్ కలసి పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి సినీ కార్మికులకు అండగా ఉంటాము అని చెప్పారు. కానీ ఇలాంటి టైమ్ లో ఫెడరేషన్ మీద సుమలత బురద జల్లుతున్నారని ఫెడరేషన్ సీరియస్ అయింది. ఆమె వివాదాలను సృష్టించడం మానుకోవాలని వారు హితవు పలికారు.

# రైతు సంక్షేమమే మోడీ సర్కార్ ధ్యేయం

## 2027-28 రబీ పంటల మద్దతు ధరల పెంపు చరిత్రాత్మకం

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య

**హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** రైతన్నల సంక్షేమానికి, వారి ఆర్థిక పరిపుష్టికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం 2027-28 రబీ మార్కెటింగ్ సీజన్‌కు కనీస మద్దతు ధరలను భారీగా పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని బిజెపి తెలంగాణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బస్వాపురం లక్ష్మీనర్సయ్య మాట్లాడారు. దేశ ప్రగతికి రైతన్నలే వెన్నెముక అనే గట్టి నమ్మకంతో మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అన్నదాతలు పెట్టే ప్రతి రూ. 100 పెట్టుబడికి రూ. 150 రాబడి వచ్చేలా, అంటే ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్లు (50 నికర లాభం) లభించేలా కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు పెద్దపీట వేస్తుందన్నారు. పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ నూనెగింజలు, పప్పుధాన్యాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు నష్టం కలగకుండా రక్షణ కల్పిస్తూ అత్యుత్తమ ధరలను ఖరారు చేశారు.అత్యధికంగా కుసుమల కనీసమద్దతు ధరను క్వింటాలుకు ఏకంగా రూ. 675 పెంచారు. రాప్‌సీడ్/ఆవాల పంటకు క్వింటాలుకు రూ. 413 పెంచడం ద్వారా రైతులకు పెట్టుబడిపై ఏకంగా 96 శాతం లాభం చేకూరనుందన్నారు. మసూర్ పప్పుకు క్వింటాలుకు రూ. 390 పెంచగా, రైతులకు ఉత్పత్తి వ్యయంపై 92 శాతం నికర రాబడి దక్కనుందన్నారు. శనగలకు క్వింటాలుకు రూ. 83, బార్లీకి రూ. 136, గోధుమలకు రూ. 25 చొప్పున కనీస మద్దతు ధరలను పెంచడం జరిగింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఏ (2004 నుండి 2014) పదేళ్ల పాలనతో మోదీ ప్రభుత్వ పాలనను పోల్చి చూస్తే రైతులకు జరిగిన మేలు స్పష్టంగా కనిపిస్తోంది.

యూపీఏ పదేళ్ల కాలంలో ఈ 6 రబీ పంటల కొనుగోలు కేవలం 2,302 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కాగా, మోడీ ప్రభుత్వంలో అది ఏకంగా 3,921 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గత కాంగ్రెస్ పాలనలో 6 రబీ పంటలకు రైతులకు చెల్లించిన మద్దతు ధర మొత్తం కేవలం రూ. 2.65 లక్షల కోట్లు మాత్రమే కాగా, మోడీ ప్రభుత్వ హయాంలో అది రికార్డు స్థాయిలో రూ. 8.36 లక్షల కోట్లకు (రూ. 8,36,000 కోట్లు) చేరిందని, రైతన్నల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ సాహసోపేతమైన, చరిత్రాత్మక నిర్ణయానికి తెలంగాణ రైతాంగం తరఫున, బిజెపి కిసాన్ మోర్చా తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర క్యాబినెట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# బొగ్గు రవాణాలో 4 శాతం వృద్ధి

## ఓవర్ బర్డెన్ తొలగింపులో 11 శాతం నమోదు

### సింగరేణి సిఎండి డాక్టర్ ప్రకాష్

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త** బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో సింగరేణి సంస్థగణనీయమైన వృద్ధిని సాధించిందని సంస్థ సిఎండి డాక్టర్ జ్యోతి ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి 287.6 లక్షల టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేయగా, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో దానికన్నా 4 శాతం వృద్ధితో 299.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిందని వివరించారు. అంతే కాకుండా గత ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 159.1 లక్షల టన్నుల రవాణా చేసిన సింగరేణి ఈ సారి రాష్ట్ర అవసరాలకు పెద్దపీట వేస్తూ 198.2 లక్షల టన్నుల సరఫరా చేయడం విశేషమన్నారు. ఇది గత ఏడాది సరఫరా చేసిన బొగ్గు పరిమాణం కన్నా 24.58 శాతం ఎక్కువగా తెలిపారు. దీనిని బట్టి సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ అవసరాలపై అధిక ప్రాధాన్యత ఇస్తుందని అర్థం అవుతోందని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఈ ఏడాది తొలి ఆర్థిక సంవత్సరంలో 39.8 లక్షల టన్నుల బొగ్గు, యాదాద్రి థర్మల్ కేంద్రానికి 33.9 లక్షల టన్నులు, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 24.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందని వెల్లడించారు.

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 26.6 లక్షల టన్నులు, ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్ కు 25.3 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు చెప్పారు. కాగ ఎల్ నినో పరిస్థితుల కారణంగా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు. అందుకు అనుగుణంగా రాష్ట్రంలోని విద్యుత్ ప్లాంట్ లకు కావాల్సిన బొగ్గును శక్తి మేర సరఫరా చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సజావుగా రవాణా జరపడం కోసం ఐదుగురు ఉన్నతాధికారులకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలను అప్పగించి పర్యవేక్షి స్తున్నారన్నారు.

# మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న కళాకారులు

## తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్


మంత్రిని అడ్డుకుంటూ కార్యాలయం, కాన్వాయ్ వద్ద బైఠాయించి నినదిస్తున్న కళాకారులు

**రవీంద్రభారతి, అక్టోబరు 1 ప్రభాతవార్త :** తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు కాన్వాయ్‌ను అడ్డుకుని కారుముందు బైఠాయించి మాకు న్యాయం చేయాలన్న నినాదాలతో నిరసన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో మంత్రి కార్యాలయం ఎదుట బైఠాయించిన కళాకారులు ప్రాణాలైన అర్పిద్దాం... ఉద్యోగాలు సాధిద్దామని పెద్దయెత్తున నినదిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని కళాకారులు ప్రతినిధులు మాట్లాడుతూ ఆరోపించారు. కళాకారులకు పెన్షన్, ఉద్యోగాలు కల్పిస్తామని హామీని నిలబెట్టుకోపోగా గత రెండు నెలలుగా పలు దఫాలుగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా ఫలిత లేదని విమర్శించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, యాదగిరి, కవిత, పుష్పలత, రమ, రమేష్‌గౌడ్, నర్మద, పెద్దయెత్తున కళాకారులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ కాస్మోటిక్స్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

## - రూ.7 లక్షల సరకు సీజ్ - అనుమతులు లేకుండా విక్రయిస్తున్న ఐదుగురిపై కేసు



స్వాధీనం చేసుకున్న కాస్మెటిక్ ఉత్పత్తులు

**అత్తాపూర్ అక్టోబరు1,ప్రభాతవార్త :** పాకిస్థాన్ నుంచి అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండా దిగుమతి చేసినట్లు అనుమానిస్తున్న కాస్మెటిక్ ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. రాజేంద్రనగర్ జోన్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్, హబీబ్‌నగర్ పోలీసులు, కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.7 లక్షల విలువైన కాస్మెటిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.సెప్టెంబర్ 30న నాంపల్లి, హబీబ్‌నగర్ ప్రాంతాల్లోని బ్యూటీ లేడీస్ ఎంపోరియం, బ్యూటీ క్వీన్, ఎస్.జె. మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం సంతోష్‌నగర్‌లోని మదీనా కాస్మెటిక్ షాపులోనూ అనధికార ఉత్పత్తులను గుర్తించారు. గోరీ, చాందినీ, ఫైజ్, నావియా, గోల్డెన్ పెర్ల్, ఫక్రా గోల్డ్, ఫేస్‌ఫ్రెష్, సదఫ్, వెల్కమ్ తదితర బ్రాండ్లకు చెందిన వైటెనింగ్ క్రీములు, సబ్బులు, సీరమ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.దిదీలీదివీ అధికారులు ఉత్పత్తులను పరిశీలించగా.. భారతదేశంలో దిగుమతి, విక్రయానికి అవసరమైన అనుమతులు, రిజిస్ట్రేషన్ లేవని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వీటిలో పరిమితికి మించి భారలోహాలు ఉండే అవకాశం ఉందని, వినియోగదారుల ఆరోగ్యానికి హానికర ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు సరఫరా? ప్రాథమిక విచారణలో ముంబైకి చెందిన ఓ డీలర్ ద్వారా ఈ సరుకు హైదరాబాద్‌కు చేరినట్లు పోలీసులు గుర్తించారు. సరఫరా చేసిన వ్యక్తితోపాటు ఇతర లింకులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. సరుకు కొనుగోలుకు సంబంధించిన బిల్లులు, ఇన్వాయిస్‌లు లేకపోవడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. అదనపు స్టాక్‌ను ఓ గోడౌన్‌లో నిల్వ చేసినట్లు గుర్తించడంతో దాని వివరాలను సేకరిస్తున్నారు.ఈ వ్యవహారంలో మొహమ్మద్ ఫజల్, మొహమ్మద్ అయాన్, మొహమ్మద్ రియాజుద్దీన్, సయ్యద్ ఆబిద్ అలీ, సయ్యద్ ఇస్మాయిల్ పాత్రపై విచారణ కొనసాగుతోంది. అక్రమ కాస్మెటిక్స్ విక్రయాలపై కేసు నమోదు చేసిన పోలీసులు మరింత దర్యాప్తు చేపట్టారు.రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్ల అదనపు డీసీపీ కె.ఎస్. రావు పర్యవేక్షణలో ఈ దాడులు నిర్వహించిన కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్, హబీబ్‌నగర్ లా అండ్ ఆర్డర్ పోలీసులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అభినందించారు.



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

# విద్యార్థులు ఉద్యోగాల సృష్టికర్తలు కావాలి

## హెచ్‌సియు 26వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా

**గచ్చిబౌలి, అక్టోబరు 1 ప్రభాతవార్త** నేటి విద్యార్థులు ఉద్యోగాల సృష్టికర్తలుగా, పరిశోధకులుగా, పారిశ్రామికవేత్తలుగా రాణించాలని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాంతిసరోవర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను అందజేయడంతో పాటు పిహెచ్‌డి పూర్తి చేసిన విద్యార్థులకు గౌరవ డాక్టరేట్లను అందజేశారు. చదువుల్లో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు యూనివర్సిటీతో పాటు పలు మెడల్స్‌ను బహుకరించారు. స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 1721మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేయగా, అందులో 300 పిహెచ్‌డీ, 178 మెడల్స్ ఉన్నాయి. గురువారం నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమానికి డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్‌తో కలిసి తెలంగాణ గవర్నర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చీఫ్ రెక్టర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా విలువలను మర్చిపోవద్దని సూచించారు. సమాజంలోని సాటి మనుషుల మీద కరుణ చూపించడంతో పాటు విలువలు, వినయంతో జీవిస్తూనే నేడు ప్రపంచాన్ని శాసిస్తున్న ఏఐ, అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని, విజయాలను సమాజ సేవకు ఉపయోగించాలని తెలిపారు. సమాజంలోని నిరుపేదల కోసం తమ జ్ఞానాన్ని ఉపయోగించడంలోనే నిజమైన విజయం దాగి ఉందన్నారు. యువత కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నేటి యువత మదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని, నసా ముక్త్ భారత్ ప్రచారానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కాగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి విద్యార్థులు సాంప్రదాయ వస్త్రదారణతో హాజరై ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సియు చాన్సిలర్ ఎల్.నర్సింహారెడ్డి, వైస్ చాన్సిలర్ అనురాధలతో పాటు వివిధ డిపార్టుమెంట్ల డీన్‌లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెండు కొత్త బల్లి జాతులు

## నల్లగొండ, వరంగల్‌లో కనుగొన్న శాస్త్రవేత్తలు

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త** తెలంగాణలో శాస్త్రవేత్తలు రెండు కొత్త బల్లి జాతులను కనుగొన్నారు. రాష్ట్రంలోని నల్లగొండ, వరంగల్ జిల్లాలో శాస్త్రవేత్తల బృందం క్షేత్ర పరిశోధనల్లో రెండు కొత్త బట్టి జాతులను గుర్తించింది. ఈ జాతులకు హెమిడాక్టిలస్ కెర్ష్ని కోలా, హెమిడాక్టిలస్ కోయయోరం గా నామ కరణం చేశారు. రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా వర్ధమానగూడెం బస్టాప్ సమీపంలోని గుంటుమడుగు, పెద్దవాగు-పెండ్లిపాకల రిజర్వాయర్ మధ్య రాళ్లతో కూడిన ప్రాంతంలో హెమిడాక్టిలస్ కెర్ష్నికోలను గుర్తించారు. ఈ జాతి ప్రధానంగా పొలాలు, చిన్న కొండల దగ్గర ప్రజలు ఉంచిన రాళ్ల కుప్పల మధ్య ఉండే ఖాళీలలో కనిపించేవి. అందుకే దీనికి కెర్ష్నికోలా అని పేరు పెట్టారు. గెక్కోలు గరిష్టంగా 49 మిల్లీమీటర్లు పొడవు వరకూ పెరుగుతాయి. వాటి రంగుల అమరిక, ముదురు రంగు రాళ్లతో కలిసిపోయి వేటాడే జంతువుల నుండి తప్పించుకునేందుకు సహాయ పడుతుంది. వాటి వీపుపై 13 నుండి 15 వరుసల కోణీయ పొలుసులు, పొట్టపై 31 నుండి 32 వరుసల పొలుసులు ఉంటాయి. ఇక రెండో జాతి అయిన హెమిడాక్టిలస్ కోయయోరంను వరంగల్ జిల్లాలోని పాఖల్ వన్యప్రాణుల అభ్యయారణ్య ప్రాంతంలో గుర్తించారు. అటవీ సంరక్షణలో కీలక పాత్ర పోషించిన కోయ గిరిజన సమాజాన్ని గౌరవించడానికి, పరిశోధకులు దీనికి లాటిన్ బహువచన రూపమైన కోయయోరం అని పేరుపెట్టారు. ఇవి గరిష్టంగా 55.6 మిల్లీమీటర్ల పొడవు వరకూ పెరుగుతాయి. గెక్కోలు చాలా చురుకుగా ఉండి, చిన్న శబ్దానికి కూడా పాములా గడ్డి పొదల్లోకి వేగంగా అదృశ్యమవుతాయి. హైదరాబాద్‌లోని జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజినల్ షెంటర్, కోల్‌కతాలోని నెహ్రూ జూలాజికల్ పార్క్, డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఒడిశాలోని ఫకీర్ మోహన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు సంయుక్తంగా క్షేత్రస్థాయి అధ్యయనాలను నిర్వహించారు. మూల పత్రం ప్రకారం దేశంలో ప్రస్తుతం 62 హెమిడాక్టిస్ జాతులు ఉన్నాయి. కొత్తగా తెలంగాణలో గుర్తించిన రెండు జాతులు హెమిడాక్టిలస్ బ్రూకీ గ్రూప్, ముర్రేయి క్లేడ్‌కు చెందినవిగా గుర్తించారు. ఈ ఆవిష్కరణలతో తెలంగాణ భౌగోలిక ప్రాంతానికి ప్రత్యేకమైన సరీసృపాల సంఖ్య ఆరుగుకు పెరిగిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు గుర్తించిన హెమిడాక్టిలస్ ఎములస్, హెమి డాక్టిలస్ ప్లావికాడస్, హెమిక్టిలస్ జెరికోలస్, హెమి డాక్టిలస్ ట్రూబ్లెరి అనే నాలుగు జాతులతో ఇవి చేరాయి. ఈ సేకరించిన నమూ నాలను కోల్కతాలోని జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో, హైదరా బాద్‌లోని ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజినల్ సెంటర్ మ్యూజియంలో భద్రపరిచారు.

# స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణే శాశ్వత పరిష్కారం

## కేంద్రం చొరవ చూపేలా సిఎం చంద్రబాబు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

### బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ అక్టోబర్ 1 ( ప్రభాతవార్త ) :** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం తీవ్ర విచారకరమని, ఇది బీసీల ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో శాసనసభలో చట్టం చేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన లెక్కలు తేల్చి, వరుసగా మూడు ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు విజయవంతంగా అమలు చేశారని ఆయన గుర్తుచేశారు. బలమైన శాస్త్రీయ ప్రాతిపదిక ఉన్నప్పటికీ కోర్టులు ఈ రిజర్వేషన్లను కొట్టివేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో కోర్టులు బీసీ రిజర్వేషన్లను కొట్టివేయడం ఒక సంప్రదాయంగా మారిందని, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి అనేక రాష్ట్రాల్లో 50 శాతం గరిష్ఠ పరిమితిని చూపిస్తూ బీసీల హక్కులను కాలరాస్తున్నారని ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. రాజ్యాంగంలో గానీ, ఏ చట్టంలో గానీ 50 శాతం గరిష్ఠ పరిమితి నిబంధన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. త్రిపుర, మేఘాలయ వంటి ఈశాన్య రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలకు కలిపి 70 నుండి 90 శాతం వరకు రిజర్వేషన్లు అమలవుతుంటే, కేవలం బీసీల విషయానికొచ్చేసరికి ఈ పరిమితులు విధించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ప్రశ్నించారు.దేశంలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో కేవలం 25 శాతం రిజర్వేషన్లే ఇస్తూ అన్యాయం చేస్తున్నారని, చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ల ఊసే లేదని వాపోయారు. స్థానిక సంస్థల్లో అరకొరగా ఇస్తున్న 34 శాతం రిజర్వేషన్లపై కూడా కోర్టులు ప్రతిబంధకాలు విధించడం సమంజసం కాదన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే చొరవ తీసుకుని, రాష్ట్రంలోని అఖిలపక్ష నాయకులను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రితో చర్చలు జరపాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీతో మరియు కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబుకు ఉన్న మంచి సంబంధాలను ఉపయోగించి బీసీ రిజర్వేషన్ల పరిరక్షణకు రాజ్యాంగ సవరణ చేయిస్తే, ఆయన చరిత్రలో నిలిచిపోతారన్నారు.

# బొగ్గు ఉత్పత్తిలో శ్రీరాంపూర్ ఏరియా ముందంజ

## సెప్టెంబర్‌లో 99 శాతం లక్ష్య సాధన.. వార్షిక లక్ష్యాన్ని అధిగమిస్తాం: జిఎం మునిగంటి శ్రీనివాస్



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో సెప్టెంబర్ మాసపు బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, అక్టోబర్ 1, ప్రభాతవార్త** శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పరంగా సెప్టెంబర్ మాసంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని మూడు భూగర్భ గనులు, ఒక ఓపెన్ కాస్ట్ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి వంద శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తిని నమోదు చేశాయని హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి శ్రీరాంపూర్ ఏరియా మొత్తం ఉత్పత్తి లక్ష్యం 4,10,000 టన్నులు కాగా, 4,07,215 టన్నుల బొగ్గు వెలికితీసి 99 శాతం రికార్డు సాధించినట్లు తెలిపారు. భూగర్భ గనులలో ఎస్సార్పీ-1 గని 106 శాతం, ఆర్.కె-7 గని 101 శాతం, ఆర్.కె న్యూటెక్ గని 107 శాతం ఉత్పత్తి సాధించాయని పేర్కొన్నారు. మొత్తం భూగర్భ గనుల లక్ష్యం 1,20,000 టన్నులకు గాను 1,14,470 టన్నులతో 95 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. అలాగే ఉపరితల గనుల్లో ఎస్సార్పీ ఓసీపీ 114 శాతం ఉత్పత్తిని కనబరచగా, ఐకే ఓసీలో కొత్త కాంట్రాక్ట్ ప్రారంభమై 44 శాతం ఉత్పత్తి నమోదైందని తెలిపారు. మొత్తంగా ఓసీపీలలో 2,90,000 టన్నుల లక్ష్యానికి గాను 2,92,745 టన్నులతో 101 శాతం సాధించడం అభినందనీయమన్నారు. మిగిలిన ఆరు నెలల కాలంలో భూగర్భ, ఉపరితల గనుల్లో రక్షణతో కూడిన ఉత్పత్తిని మరింత పెంచి, సంస్థ వార్షిక నిర్దేశిత లక్ష్యాన్ని నూటికి నూరు శాతం అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని జీఎం వివరించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఇప్పటివరకు 3,868 మంది కార్మికుల వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరో 320 మంది ఉద్యోగులకు ఎల్ఎస్‌పీ, 14 మందికి ఎంఎంసీ చెల్లింపులు పూర్తి చేశామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన 9,795 మంది విశ్రాంత ఉద్యోగులకు సీపీఆర్ఎంఎస్ పథకం కింద మెడికల్ కార్డులను అందజేసినట్లు జీఎం వెల్లడించారు.

# మూడేళ్లలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ అనేక ఫలితాలను సాధించింది : ఛైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టీకరణ


నివేదికను విడుదల చేస్తున్న బక్కి వెంకటయ్య

**సైఫాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మూడు సంవత్సరాలలో చేపట్టిన కార్యక్రమాలు, పరిశీలించిన అంశాలు, సాధించిన ఫలితాలు, ప్రభుత్వానికి చేసిన సఫార్సులతో కూడిన నివేధికను కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య విలేకరులతో మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కమిషన్‌కు భూమి, అట్రాసిటి, సర్వీస్ తదితర 5,867 ఫిర్యాదులు అందాయని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. 2023 నుంచి 2026 వరకు 9,102 ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులు నామోదు అయ్యాయని, ఇందులో 213 హత్యలు కాగా, 1,305 బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరిగాయని, కాని కేవలం 32 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయన్నారు. లాకప్ హింసలకు గురైన బాధితులకు కమిషన్ అండగా నిలిచిందని, పరువు హత్యలపైన కూడా కమిషన్ బాధిత కుటుంబాలకు భరోసా కల్పించిందని, దళితుల పట్ల కులవివక్ష పాటిస్తున్న అనేక సంఘటనలు తమ దృష్టికి రావడంతో చర్యలు తీసుకున్నామన్నారు. పెండింగ్ నిధులు, బాధితులకు నష్టపరిహారం కూడా అందించడం జరిగిందని, 41సి ఆర్పిపై పోరాటం చేశారమని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు డబుల్ బెడ్‌రూంలు అందించామని ఆయన వివరించారు. అంతేకాకుండా ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైపవర్ కమిటి సమావేశం జరిగిందన్నారు.

# విదేశీ యువతులతో వ్యభిచారం

## గచ్చిబౌలిలో హోటల్ మీద దాడి

### ఇద్దరు వ్యక్తులు అరెస్టు - పోలీసుల అదుపులో ముగ్గురు యువతులు

**గచ్చిబౌలి, అక్టోబరు 1 ప్రభాతవార్త:** విదేశీ యువతులతో నగరంలో అక్రమంగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును గచ్చిబౌలి పోలీసులు చేధించారు. ఢిల్లీకి చెందిన వ్యక్తి విదేశీ యువతులను పంపిస్తుండగా, గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో వారిని ఉంచి, సదరు హోటల్ మేనేజర్ విటులను ఆకర్షించి వ్యభిచారం చేయిస్తున్నాడు. పోలీసులు ఈ హోటల్ మీద దాడి చేసి ముగ్గురు విదేశీ యువతులను రక్షించడంతో పాటు ఓ విటుడు, అర్గనైజర్‌ను అరెస్టు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని ఎపిహెచ్‌బి కాలనీలో గల డ్రీమ్ ఫ్రైడ్ హోటల్‌లో విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న ఎహెచ్‌టియు, గచ్చిబౌలి పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఓ యువతి, తుర్క్‌మోనిస్తాన్‌కు చెందిన ఇద్దరు యువతులను ఈ హోటల్ నుంచి రెస్క్యూ చేసి కూకట్‌పల్లి రెస్క్యూ హోంకు తరలించారు. ఈ దాడిలో విటుడు హర్షిత్ సింగానియాతో పాటు హోటల్ మేనేజర్, వ్యభిచార గృహం నిర్వాహకుడు మోహన్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీకి చెందిన నిఖిల్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో విదేశీ యువతులను బుక్ చేసి నగరానికి పంపించేవాడు. నగరంలో వీరికి గచ్చిబౌలి డ్రీమ్ ఫ్రైడ్ హోటల్ మేనేజర్ మోహన్‌రెడ్డి ఆశ్రయం కల్పించి, వారితో వ్యభిచారం చేయించసాగాడు. ఇదే తరహాలో గత నెల రోజుల క్రితం ముగ్గురు యువతులను నిఖిల్ నగరానికి పంపించగా, వారిని హోటల్‌లో ఉంచిన మోహన్‌రెడ్డి వారితో వ్యభిచారం చేయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మోహన్‌రెడ్డితో పాటు విటుడు హర్షిత్ సింగానియాలను అరెస్టు చేసి, ముగ్గురు యువతులను రెస్క్యూ చేశారు. వీరి వద్ద నుంచి 13వేల రూపాయల నగదు, 23 కండోమ్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పియం కుసుమ్‌లో 100 మెగావాట్ల మైలురాయి

## సౌర విద్యుత్ విస్తరణకు కీలక ముందడుగు

### ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్

**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త** పిఎం కుసుమ్‌లో 100 మెగావాట్ల మైలురాయిని సాధించినట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కె వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో సౌర విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తూ, పునరుత్పాదక విద్యుత్ దిశగా టీజీ ఎన్పీడీసీఎల్ చేపడుతున్న చర్యలకు నిదర్శనమన్నారు. రైతుల భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తితో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పించడమే పియం కుసుమ్ పథకం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవడంతో పాటు, ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే అవకాశం లభిస్తుందని వివరించారు. తద్వారా రైతుల ఆర్థిక సాధికారతతో పాటు స్థానికంగా పునరుత్పాదక విద్యుత్ లభ్యత పెరగడం, సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటం తగ్గడం వంటి ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత వేగంగా విస్తరించేందుకు అవసరమైన చర్యలను కొనసాగించాలని సూచించారు. ప్రస్తుతం మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం వివిధ దశల్లో ఉందన్నారు. రానున్న 3 నుంచి 4 నెలల్లో మొత్తం 300 మెగావాట్ల సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. సౌర విద్యుత్ విస్తరణ ద్వారా రైతులకు అదనపు ఆదాయం, వినియోగదారులకు పర్యావరణహిత విద్యుత్, సంస్థకు పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ అనే మూడు ప్రధాన ప్రయోజనాలను సాధించే దిశగా తమ సంస్థ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

100 మెగావాట్ల మైలురాయి సాధనతో ప్రారంభమైన ఈ ప్రస్థానం త్వరలో 300 మెగావాట్ల స్థాయికి చేరుకోనుండటం పునరుత్పాదక ఇంధన విస్తరణకు మరో కీలక ఘట్టంగా నిలవనుందని స్పష్టం చేశారు.

# మంచి మార్గంలో నడవాలన్నదే ..



గాంధీ తన జీవితంలో స్వయంగా మరియు ఇతరుల వలన జరిగిన విషయాల అనుభవం నుండి తీసుకున్న నిర్ణయాలే ఎవరికి, ఎందుకూ కూడా భయపడకుండా ఉండడం 'తల్లి తండ్రులకి అబద్ధం చెప్పి మోసం చేయొద్దు అనుకోవడం. ఎప్పుడు నిజమే చెప్పాలి అని సత్య మార్గంలో నడవడం మరియు తన తోటి వారిని కూడా ప్రోత్సహించడం, సత్యము పలకడం కోసం ఏమైనా చేయవచ్చు అని హరిశ్చంద్ర నాటకం ద్వారా తీసుకున్న నిర్ణయం, ట్రైన్‌లో తనకు జరిగిన అన్యాయం ఇంకా ఎవరికి జరుగొద్దు అని 'సత్యగ్రహ' ఉద్యమాన్ని మొదలు పెట్టడం.. ఇవన్నీ మోహన్‌దాస్ కరంచంద్ గాంధీకి ఎవరు చెప్పలేరు తాను స్వయంగా తీసుకున్న నిర్ణయాలే.. మనం ఇప్పుడు ఇలా స్వాతంత్ర్యంగా జీవించడానికి కారణం. ఇప్పటికి తన మాటలు, మార్గాలు మనం అనుసరించేలా చేస్తున్నాయి. అందరు మంచి మార్గంలో నడవాలన్నదే గాంధీ కోరిక. ఒకసారి గాంధీ యొక్క తరగతి గదికి ఎడ్యుకేషన్ ఆఫీసర్ వచ్చాడు. అపుడు ఇంగ్లీష్‌క్లాస్ జరుగుతుంది. ఆఫీసర్ నేను కొన్ని ఆంగ్ల పదాలు చెప్తాను వాటిని మీరు చూడకుండా రాయాలి అని చెప్పాడు.అక్కడే ఉన్న మాస్టారు ఆ మాట విని భయపడ్డాడు. ఏ విద్యార్థి అయినా తప్పుగా రాస్తే తన పరిస్థితి ఎలా అని..? ఆఫీసర్ కొన్ని పదాలు చెప్పాడు. ఒక్క గాంధీ తప్ప మిగతా అందరు కరెక్ట్‌గా రాసారు. అది చూసిన మాస్టారు గాంధీకి పక్క వారి దాంట్లో చూసి కాపీ చేయమని సైగలు చేసాడు.కానీ గాంధీ అలా చేయలేదు. క్లాస్ నుండి ఆఫీసర్ వెళ్లిపోయాక మాస్టారు గాంధీ దగ్గరికి వెళ్లి, నేను చెప్పాను కదా..! కాపీ చేసి రాయమని ఎందుకు చేయలేవు? అని కోపగించు కున్నాడు. అపుడు గాంధీ, సారీ మాస్టారు నేను కాపీ చేయలేను నేను ఎంతవరకు రాయగలనో అంతే రాస్తాను. అని చెప్పాడు. అంత చిన్న వయసులోనే గాంధీజీ పక్క వారి దాంట్లో చూసి కాపీ చేయమని సైగలు చేసాడు. కానీ గాంధీ అలా చేయలేదు. క్లాస్ నుంచి ఆఫీసర్ వెళ్లిపోయాక మాస్టారు గాంధీ దగ్గరికి వెళ్లి, నేను చెప్పాను కదా..! కాపీ చేసే రాయమని ఎందుకు చేయలేవు? అని కోపగించుకు న్నాడు. అపుడు గాంధీ, సారీ..! మాస్టారు నేను కాపీ చేయలేను నేను ఎంత వరకు రాయగలనో అంతే రాస్తాను. అని చెప్పాడు. అంత చిన్న వయసులోనే గాంధీజీ యొక్క నిజాయితీని చూసి మాస్టారు ఆశ్చర్య పోయాడు. ◻

## జొన్న ఊతప్పం



జొన్నపిండి: కప్పు
గోధుమ పిండి: అరకప్పుబియ్యపిండి:
పావు కప్పుపెరుగు: కప్పు
క్యాబేజీ, క్యారట్ తురుము: అరకప్పు క్యాప్సికం: మీడియం సైజు ఒకటి కొత్తిమీర: రెండు రెబ్బలు
పచ్చి మిరప కాయలు: మూడు
నూనె: పావు కప్పు ఉప్పు: తగినంత

తయారీ : విధానం:ముందుగా క్యాప్సికంను తీసుకుని సన్నగా ముక్కలు చేసుకోవాలి. కొత్తిమీర, పచ్చి మిరపకాయల్ని కూడా బాగా సన్నగా తరుక్కోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని ముందుగానే లెక్క ప్రకారం కొలిచి పెట్టుకున్న జొన్న, గోధుమ, బియ్యప్పిండ్లను అందులో వేయాలి. వాటితో పాటే తురిమిన క్యాబేజీ, క్యారట్‌లు, క్యాప్సికం ముక్కలు, కొత్తిమీర పచ్చిమిర్చిలను కూడా వేయాలి. వీటన్నింటినీ కాస్త అటూ ఇటూ కలపాలి. ఇప్పుడు పెరుగు, ఉప్పు కూడా అందులో వేయాలి. ఊతప్పం వేసేందుకు అనువుగా పిండి ఉండేలా బాగా కలుపుకోవాలి. తర్వాత పొయ్యి మీద పెనం పెట్టి, నూనె బొట్టు వేసి అరచేయంత అప్పచ్చిల్లా పిండిని వేసి కాల్చుకుంటే.. మినీ వెజ్ జొన్న ఊతప్పం రెడీ అయినట్లే! ఇది తీపి ఆవకాయ కాంబినేషన్‌లో తినడానికి బాగుంటుంది. ◻



# సత్తా చాటిన 'చికిత'

పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామ వాసి అయిన చికిత ప్రస్థానం ఎంతో స్ఫూర్తి దాయకం. ఆరేళ్ల వయసులో ఆమెను ఆర్చర్‌గా చూడాలని తండ్రి శ్రీనివాసరావు కల కన్నారు. గ్రామంలో సరైన వసతులు లేకపోవడంతో ఆయనే తొలి కోచ్‌గా మారారు. పొలంలో వరి కోతల తర్వాత మిగిలిన గడ్డివామునే లక్ష్యంగా చేసి చికితతో ప్రాక్టీస్ చేయించారు. ఖరీదైన విల్లు, క్రీడా పరికరాల కోసం తమ జీవనాధార మైన

రెండు స్వర్ణాలు గెలిచి లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాదించారు చికిత. తండ్రే తొలి కోచ్ ఆమెకు. పొలంలోని గడివామే తొలి టార్గెట్. కూతురి క్రీడా పరికరాల కోసం వరికోత యంత్రం అమ్మిన ఆమె నాన్న. అలా ఆమె అంతర్జాతీయ వేదికలపై పతకాలతో )నిలకడైన ప్రదర్శన ఇచ్చారు చికిత. తెలంగాణకు చెందిన యువ ఆర్చర్ తానిపర్తి చికిత అంతర్జాతీయ వేదికపై సంచలనం సృష్టించింది. జపాన్‌లో జరిగిన పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి ఏకంగా రెండు స్వర్ణ పతకాలు సాధించింది. ఈ విజయంతో ఆమె ప్రతిష్ఠాత్మక లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖరారు చేసుకుంది. చికిత ప్రస్థానం స్ఫూర్తిదాయకం

వరికోత యంత్రాన్ని అమ్మి, బ్యాంకులో రుణం తీసుకోవడం ఆయన త్యాగానికి నిదర్శనం. తండ్రి ప్రోత్సాహంతో జాతీయ సబ్‌జూనియర్ పోటీల్లో రెండు పతకాలు గెలిచిన చికిత, నాలుగేళ్ల క్రితం సోనేపట్‌లోని సాయ్ ఆర్చరీ అకాడమీలో చోటు దక్కించుకుంది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. గత ఏడాది చైనాలో జరిగిన ప్రపంచకప్‌లో రజతం, ఆసియా కప్‌లో కాంస్యం, వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి తన సత్తా చాటింది. ఈ ఏడాది వరల్డ్ కప్, ఆసియా కప్‌లలోనూ పతకాలతో రాణించిన ఆమె, ఇప్పుడు జపాన్‌లో రెండు స్వర్ణాలను ముద్దాడి ఒలింపిక్స్‌లో దేశం తరఫున పతకంపై బలమైన ఆశలు రేకెత్తించింది. ◻

## 'కనకధారా స్తోత్రం'

శంకర భగవత్పాదులవారు ఒక పేదరాలి దారిద్ర్యాన్ని తొలగించడం కోసం కనకధారా స్తోత్రం ఆశువుగా చెప్పారు. ఫలితంగా లక్ష్మీదేవి ఆ పేదరాలి వాకిట్లో బంగారు ఉసిరి కాయలు కురిపించి అనుగ్రహించింది.



అలాంటి 'కనకధారా స్తోత్రం' ఎంతో శక్తిమంతమైనది .. మరెంతో మహిమాన్వితమైనది. దారిద్రంతో బాధ పడేవారు ఈ స్తోత్రాన్ని అనునిత్యం అత్యంత భక్తి శ్రద్ధలతో పఠించడం వలన దారిద్రం తొలగిపోతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి.ఇక వ్యాపార సంబంధమైన విషయాల్లో ఆటంకాలు ఏర్పడినప్పుడు .. వ్యాపారంలో నష్టాలు ఎదురవుతున్నప్పుడు ఈ స్తోత్రాన్ని పఠించడం వలన మంచి ఫలితం ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇక చాలా మంది అప్పులతో బాధపడుతుంటారు. అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేసి .. వాటిని తీర్చలేక ఇబ్బంది పడు తుంటారు. అలాంటివారు ప్రతిరోజు నవగ్రహ స్తోత్రం పఠిం చడం వలన ఫలితం ఉంటుంది. ఇక నానా రకాల సమస్యలు చుట్టుముట్టి ఆవేదానికి గురిచేస్తున్నట్టయితే, విష్ణు సహస్ర నామ పారాయణం చేయడానికి మించిన విరుగుడు లేదనేది మహర్షుల మాట. ◻

## గడువు తేదీ చూస్తున్నారా?

నెలసరి సమయంలో పరిశుభ్రతను పాటించేందుకు ప్రస్తుతం వివిధ రకాల శ్యానిటరీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. న్యాప్‌కిన్లు, ఋతుస్రావ కప్స్/డిస్కులు, ట్యాంపన్స్, వంటి వాటిని ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. అయితే వీటిని కొనుగోలు చేసే చాలామంది ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను పట్టించుకోరు. ఎందుకంటే ఇవి శరీరానికి బయట వాడే ఉత్పత్తులు కాబట్టి ప్రమాదమేమీ ఉండదన్నది చాలామంది అభిప్రాయం. కానీ అన్ని వస్తువుల్లాగే వీటికీ ఎక్స్‌ప్రైరీ ఉంటుంది, దాన్ని భర్తీ చేస్తే వాటిని ఎన్ని రోజులు వాడాలో పరిశీలించుకోవడం మంచిది. శ్యానిటరీ న్యాప్కిన్ల ప్యాకెట్లపై తయారీ తేదీ రాసి ఉంటుంది. దాని కిందే ఎప్పటిలోగా వాడాలో కూడా రాసి ఉంటుంది. కాబట్టి ఈ పరిశీలనలో ఉంచుకొని గడువు తేదీ దాటి వాటిని కొనుగోలు చేయడం మంచిది. సహజసిద్ధమైన ఉత్పత్తులతో తయారుచేసిన ట్యాంపన్లను.. ఎక్కువ కాలమే వాడే నిపుణులు. అలాగని ఏళ్ల తరబడి మూలన పడి ఉన్న ట్యాంపన్లను అస్సలు ఉపయోగించ కూడదు. ఎందుకంటే అవి



చూడడానికి తాజాగా కనిపించినా.. వాటిపై సూక్ష్మ క్రిములు పెరిగి హాని కలిగించే ప్రమాదం ఉంది. ఈ ఎక్స్పైరీ తేదీని పరిశీలించడమూ మర్చిపోవద్దు. చాలావరకు మెన్స్ట్రువల్ కప్స్ తిరిగి ఉపయోగించే విధంగానే ఉంటాయి. అయితే వీటి నాణ్యత, మనం పాటించే శుభ్రతను బట్టి కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఈ వంటి వాటి లేబుల్ని ఓసారి పరిశీలించడం ముఖ్యం. ◻

## రుచులు అలవాటు చేయాలి!

సమయాభావం, పని ఒత్తిడి వల్ల ఉద్యోగాలు చేసే అమ్మలకు పిల్లల లంచ్ బాక్సులు సర్దడం ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ ఐదు నిమిషాల్లో అయిపోయే మ్యాగీ, రెండు నిమిషాల్లో ఓపెన్ చేసి ఇచ్చే బిస్కెట్, చిప్స్ ప్యాకెట్ రోజువారీ స్నాక్స్ జాబితాలో, లంచ్ బాక్సుల్లోకి చేరిపోతున్నాయి. క్రమంగా కృత్రిమ రుచులకు అలవాటుపడి ఇంట్లో చేసిన ఆరోగ్యకరమైన వంటలు తినడానికి పిల్లలూ మారాం చేస్తారు. అయితే, ఈ అలవాటు అప్పటికప్పుడు సమయాన్ని ఆదా చేసినప్పటికీ, ప్యాకేజ్డ్ ఫుడ్‌లోని మోనోసోడియం గ్లుటామెట్, అధిక ఉప్పు, చక్కెర, పామాయిల్, ప్రిజర్వేటివ్‌లు పిల్లల పొట్టలో పోషకాల స్థానంలో రసాయనాలను నింపుతున్నాయి. అలాగని ఉద్యోగాన్ని, ఇంటినీ చక్కబెట్టుకునే తల్లుల శ్రమను తక్కువ చేయలేం కానీ, కాస్త ముందస్తు ప్రణాళిక ఉంటే పిల్లల ఆరోగ్యానికి మేలైన ఆహారాన్ని సులువుగా అందించవచ్చు. బుజ్జాయిల్ని అనారోగ్యాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. సెలవు రోజుల్లోనే రాగి, నువ్వుల లడ్డూలు పెట్టుకుంటే వారం రోజులకు



సరిపోతాయి. తామర గింజలు (మఖానా), వేరు శనగలను వేయించి గాలిచొరని డబ్బాలో భద్రపరిస్తే ఉదయాన్నే బాక్స్‌లో వేయడం క్షణాల పని. ముందురోజే క్యారెట్లు, బీన్స్ నాలుగు తరిగి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే పొద్దున్నే వెజిటబుల్ పోహా లేదా సేమియా ఉప్మా కేవలం ఐదు నిమిషాల్లో సిద్ధమవు తుంది. ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే పెసరట్లు, జొన్న దోశలు ప్యాకెట్ ఫుడ్స్ కంటే ఎంతో మేలైనవి. చిన్నారులను ఆకట్టుకోవడానికి చిన్న చిన్న ఇడ్లీలపై కూరగాయల ముక్కలు వేసి రంగురంగుల వండవచ్చు. చపాతీలో పనీర్, ఆలూ లేదా కోడిగుడ్డు తురుమును నింపి రోల్స్‌లా చేసిస్తే చిన్నారులు ఎంతో ఇష్టంగా తింటారు. రోజువారీ స్నాక్స్‌గా మరమరాలు, గుగ్గిళ్లు, తాజా పండ్లు ఇచే అలాటు చేస్తే పిల్లలు ఆరోగ్యంగా పెరగడమే కాకుండా దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారు. ◻

## 'డోరతీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. 'డోరతీ' సినిమా గురించి నెల రోజుల క్రితం కార్తీక్ నాకు ఫోన్ చేసి చెప్పాడు. టైటిల్ కొత్తగా అనిపించింది. వచ్చి సినిమా చూడమని చెప్పారు. ఈ సినిమా గురించి నాకు పెద్దగా ఏమీ తెలియదు. కీర్తి సురేష్ ఉందని మాత్రమే తెలుసు. వెళ్లి సినిమా చూశాను. అందరూ హ్యాపీగా థియేటర్లకు వెళ్లి సినిమా చూడండి. అందరికీ థాంక్యూ. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ.. 'డోరతీ' నాకు చాలా స్పెషల్ ఫిలిం. ఎందుకంటే ఇది నా మనసుకు చాలా దగ్గరైన కథ. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే తమిళనాడులో రిలీజ్ తర్వాత ప్రేక్షకులు సినిమాను చాలా గొప్పగా ఆదరిస్తున్నారు. థియేటర్లలో చాలా ఎంజాయ్ చేస్తు న్నారు. తెలుగులో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్న రానా గారికి థాంక్యూ. రిషికాంత్ మాట్లాడుతూ.. ఇలాంటి గొప్ప సినిమా చేసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్‌కి థాంక్యూ. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న రానాకి కూడా ధన్యవాదాలు. తమిళనాడు లో ఈ సినిమాకు ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. సనంత్ మాట్లాడుతూ.. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. అదృష్టం ఉంటేనే ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం వస్తుంది. తమిళంలో ఈ సినిమా అద్భుతంగా ఆడుతోంది. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో కూడా సినిమాకు మంచి స్పందన లభిస్తోంది. పవన్ మాట్లా డుతూ.. ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం చాలా ఆనం దంగా ఉంది. కార్తీక్ సుబ్బ రాజ్ ఈ సినిమాను అద్భు తంగా తెరకెక్కించారు. తమిళ నాడులో సినిమాకు చాలా గొప్ప రెస్పాన్స్ వస్తోంది. కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ.. ఈ సినిమా తమిళ నాడులో ఇప్పటికే సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి ఇళయ రాజా సంగీతం సమకూర్చడంతో పాటు తమి ళంలో అద్భుతమైన పాటలు రాశారు. ఆ పాటలను తెలుగులో రాసే అవకాశం నాకు దక్కడం చాలా ఆనందంగా ఉంది.

## తెర

## 'తత్వం'లో క్లైమాక్స్‌ను ఎవరూ గెస్ చేయలేరు: దినేష్ తేజ



**తత్వం సినిమాను ఒప్పుకోవడానికి రీజన్ ఏమిటి?** ఈ సినిమాలో ఎవరూ గెస్ చేయలేని ట్విస్ట్‌లు.. క్లైమాక్స్‌లో ఉండే ఎమోషన్.. తనకు తాను ఏమీ తెలుసుకున్నాడు తనకు ఏమీ తత్వం బోదపడింది అనే పాయింట్‌తో పాటు టోటల్ ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కొత్తగా అనిపించింది. రేపు థియేటర్‌లో జనాలు కూడా అదే ఫీలవుతారు.

**ఇది ఎలాంటి కథ?** మూడనమ్మకంకు నమ్మకం మధ్య ఓ సన్నని గీత ఉంటుంది. దాని చుట్టే ఈ కథ తిరగుతుంది. 2000వ సంవత్సరంలో నడిచే కథ ఇది.

**ఈ సినిమా సమయంలో మీకు యాక్సిడెంట్ జరిగిందని తెలిసింది?** ఈ సినిమాకు జరిగిన నెగెటివ్‌లతో అన్నీ ఈ సినిమాకు దిష్టి పోయింది అనుకుంటున్నాం. మా సినిమా కంటెంట్ చాలా గట్టిది. ఈ సినిమా ప్రమోషన్ టైమ్‌లో నాకు హీరోయిన్‌కు యాక్సిడెంట్ జరిగింది. నాకు ఇది సెకండ్ లైఫ్. డే వన్ రోజు కథ విన్నప్పుడు నాలో ఎలాంటి నమ్మకం ఉందే ఈ రోజుకు అంతకు మించి ఈ చిత్రం విజయంపై విశ్వాసం ఉంది. ఆడియన్స్‌కు సినిమా తప్పకుండా నచ్చుతుంది.

**మీరు ఎదురుచూస్తున్నకమర్షియల్ సక్సెస్ ఈ సినిమాతో వస్తుందని అనుకుంటున్నారా?** కమర్షియల్ సక్సెస్ ఒక్కటే చూడటం లేదు. కొన్ని సినిమాలు చేస్తున్నప్పుడు. ఈ కథ చెప్పాలని అనిపించి చేసిన సినిమా. ఇది కూడా నావెల్టీ కథ కాబట్టి చేశాను.

**మీకు ఈ సినిమాలో పాత్ర పర్సనల్‌గా ఎంత వరకు శాటిస్‌ఫాక్షన్ ఇచ్చింది?** పర్సనల్‌గా నేను ఏ రోల్ చేసిన పూర్తి సంతృప్తిగానే చేస్తాను. హాండ్రెడ్ పర్సెంట్ న్యాయం చేస్తాను.

**వెబ్‌సీరిస్‌లు ఒప్పుకోవడం లేదా?** ఓటీటీ వెబ్‌సీరిస్ ఆఫర్లు వచ్చాయి. అంత శాటిస్‌ఫాక్షన్ కథలు రాలేదు. అందుకే ఒప్పుకోలేదు.

**ప్రస్తుతం చేస్తున్న సినిమాలు?** హుషారు 2తో పాటు విజయనగరం బ్యాక్‌డ్రాప్‌తో ఓ యాక్షన్ డ్రామా చేశాను. సతీష్ వెగేశ్న కథా కేళి ఉంది

**తత్వంతో మీకు ఎలాంటి గుర్తింపు వస్తుందని అనుకుంటున్నారు?** ఈ సినిమా తరువాత కొత్త కథలతో వచ్చే రచయితలకు నేను కూడా ఒక ఆప్షన్‌గా ఉంటాననే నమ్మకం ఉంది.

## 'గీతాంజలి' నవంబర్ 13న 4కెలో రీ రిలీజ్



కొన్ని సినిమాలు థియేటర్లలో విడుదలై ఎన్నేళ్లు గడిచినా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేస్తుంటాయి. అలాంటి ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో కింగ్ నాగార్జున'గీతాంజలి ఒకటి. ఇప్పుడు ఈ లవ్‌ఫుల్ క్లాసిక్ మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. నవంబర్ 13న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా 4కె వెర్షన్‌లో 'గీతాంజలి' గ్రాండ్‌గా రీ రిలీజ్ కానుంది. ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రం అద్భుతమైన కథనం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు, గొప్ప సంగీతంతో ప్రేక్షకులపై ప్రత్యేకమైన ముద్ర వేసింది. నాగార్జున, గిరిజ జంటగా నటించిన ఈ సినిమా ప్రేమ, భావోద్వేగాలు, అందమైన అనుభూతులను ప్రత్యేకమైన శైలిలో ఆవిష్కరించింది. ఇప్పటివరకు 'గీతాంజలి'ని ప్రేమించిన ప్రేక్షకులకు ఈ 4కె రీరిలీజ్ మరోసారి ఆ మధురానుభూతిని థియేటర్‌లో అందించనుంది. పిక్చర్ క్వాలిటీ, విజువల్ డీటెయిలింగ్‌తో సినిమా మరింత గ్రాండ్‌గా కనిపించనుంది. అదే సమయంలో ఒరిజినల్ సినిమా అందించిన ఎమోషన్, చార్మ్‌ను ఎలాంటి మార్పు లేకుండా ప్రేక్షకులకు అందించను న్నారు.మాస్ట్రో ఇళయరాజా అందించిన సంగీతం 'గీతాంజలి'కి ఇప్పటికీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఆయన స్వరపరిచిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎవర్ గ్రీన్.బూర్లె శివ ప్రసాద్ నేతృత్వంలోని శ్రీ పద్మిని సినిమాస్ ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ను మరోసారి ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లోకి తీసుకొస్తోంది. ఇప్పటికే ఈ సినిమాను ప్రేమించిన అభిమానులతో పాటు, కొత్త తరం ప్రేక్షకులకుకూడా గీతాంజలిని బిగ్ స్క్రీన్‌పై ఎక్స్ పీరియన్స్ చేసే అవకాశం లభించనుంది.

## 'ఆత్మకథ' చిత్ర ఆడియో లాంచ్



'ఆత్మకథ' ఆడియో లాంచ్ కార్యక్రమంలో 'హనుమాన్ మ్యూజిక్' లేబుల్ లాంచ్....చిన్న సినిమాలకు అండగా హనుమాన్ 'మ్యూజిక్' ఆడియో లేబుల్ ఉంటుంది : హనుమాన్ మ్యూజిక్ ఎండి అవినాష్ కూనపరెడ్డి.. వారాహి ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై సోమేష్ నిర్మాతగా శ్రీనివాస్ బండ్రెడ్డి రచనా దర్శకత్వంలో రానున్న చిత్రం ఆత్మ కథ యాన్ అన్ టోల్డ్ స్టోరీ. జెమిని సురేష్ హీరోగా రూప హీరోయిన్‌గా చేయగా సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయలక్ష్మి, శ్రీనివాస్ నాయుడు, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఎక్స్ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ... నా మిత్రుడు కోనపురెడ్డి అవినాష్ ప్రారంభించిన హనుమాన్ మ్యూజిక్ మొదలు పెట్టడం చాలా సంతోషంగా ఉంది. సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ... నేను ఈ కార్యక్రమానికి రావడానికి ముఖ్య కారణం సురేష్. ఈ సినిమా కథ నాకు దర్శకులు చెప్పిన ప్పుడు నాకు చాలా సర్ప్రైజ్‌గా అనిపించింది. సంగీత దర్శకుడు రఘు కుంచె మాట్లాడుతూ... ముందుగా సంగీత దర్శకుడు శ్రేయస్‌కు ఆల్ ద బెస్ట్. హనుమాన్ మ్యూజిక్ మంచి విజయం సాధించాలని కోరుకుంటు న్నాను. రిథమ్ స్టూడియో ఇన్చార్జి కొల్లి రామకృష్ణ మాట్లాడుతూ... శ్రీనివాస్ కథ, దర్శకత్వం చాలా బావుంటాయి. నటుడు రక్షిత్ మాట్లాడుతూ... శ్రీనివాస్ నాకు బాగా తెలుసు. అవినాష్ చిన్న సినిమాల కోసం హను మాన్ మ్యూజిక్ స్థాపించడం గొప్ప విషయం. నటుడు నాగ మహేష్ మాట్లా డుతూ... ఈ కార్యక్రమానికి వచ్చిన సంగీతం సముద్రం లాంటిది. శ్రేయాస్ చాలా సున్నా వయసులోనే అటువంటి సంగీతంలో మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ.... ముందుగా సురేష్ గారికి, అలాగే దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. సంగీత దర్శకుడు వారాహి శ్రేయాస్ మాట్లాడుతూ... మా సినిమాను హనుమాన్ మ్యూజిక్ లో యాడ్ చేసినందుకు థాంక్స్. దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ... శ్రేయాస్ నిర్మాతకు కొడుకు అని కాదు, అతను ఏం చేయగలడో కూడా చూసాను. ఈ సినిమాకు సంగీతం అందించేందుకు చాలా కష్టపడ్డాడు.

## 'చకోర' అక్టోబర్ 9న రిలీజ్



High Joy Commercials బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, జు॥శ – Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ చకోర – Lunar Bird .ఈ చిత్రాన్ని వీక్షి ంచిన సెన్సార్ సభ్యులు చిత్ర నిర్మాత మరియు దర్శకుల్ని అభినం దించారు. సెన్సార్ కత్తెరకు పని చెప్పకుండా యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ను అతి తక్కువ నిడివి 2.17.58 సెకండ్స్ తో ఆద్యంతం ప్రేక్షకులని సీట్ లో నుంచి కదలకుండా కట్టిపడేసే స్క్రీన్ ప్లే తో చిత్రాన్ని రక్తి కట్టించారని చిత్ర యూనిట్ ని ప్రశంసించారు. శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా చకోర – Lunar Love Birde చిత్రం ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది. చకోర ఆడియో హక్కులు TSeries Music దక్కించుకుంది. నటీనటులు శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్, యామిని, ఎల్ బి శ్రీరామ్, సుమన్, బ్రహ్మాజీ, ఇంద్రజ, మణి చందన, నెల్లూరు సుదర్శన్, ప్రభావతి, మాధవి ప్రసాద్, జనార్ధన్, ఆకెళ్ళ గోపాల కృష్ణ, వంగపండు,వంశీ, సుమంత్, భాను, సూర్య మాకిరెడ్డి, తదితరులు.

## 'రణబాలి' 'ది హిస్టరీ వి ఫర్ గాట్' విడుదల



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' . ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టి సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తు_న్నారు. అక్టోబర్ 16న విజయ దశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'రణబాలి' నెవర్ ఫర్ గెట్ ది ట్రూత్ పేరుతో రూపొందించిన 4 ఎపిసోడ్స్ డాక్యుమెంటరీ సిరీస్ లో సెకండ్ ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్ గాట్' ఈ రోజు యూట్యూబ్ లో స్ట్రీమింగ్ కు వచ్చేసింది. ఈ ఎపిసోడ్ లో చరిత్రలో బ్రిటీషర్స్ మనకు తెలియకుండా ఇంటెన్షనల్ గా కనుమరుగు చేసిన నిజాలు ఏంటి, అన్నపూర్ణగా వెలిగిన మన దేశపు ధాన్య సిరులను రైల్వేల నిర్మాణంతో బ్రిటీషర్స్ ఎలా దోచుకు పోయారో హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రశ్మిక తెలి పారు. హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లా డుతూ చరిత్రలో మనకు కొన్ని సత్యాలు తెలియలేదు అంటే అందుకు కారణం బ్రిటీషర్స్ ఆ నిజాలు మనకు తెలియకుండా చేయడమే. మనం కూడా వాటి గురించి పెద్దగా చర్చించుకోలేదు. ఈ సినిమా కోసం నేను రీసెర్చ్ చేస్తున్నప్పుడు ఆ కాలం గురించి, అప్పటి పరిస్థితులు, ప్రజల గురించి లోతుగా తెలిసింది. అసలు అప్పుడేం జరిగింది అని తెలిసిన తర్వాత ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. అన్నారు.హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ మన స్నేహితులు కొందరు బ్రిటీషర్స్ మనకు కొన్ని మంచి పనులు చేశారు. ఇండియన్ రైల్వేస్ ను బ్రిటీష్ వాళ్లు మనకు నిర్మించి ఇచ్చారని చెబుతుంటారు.

## ఆసియా క్రీడలు



# రెజ్లింగ్‌లో నితేష్‌కు రజతం

**నగోయా:** ఆసియా క్రీడల్లో, పురుషుల గ్రీకో రోమన్ 97 కేజీల రెజ్లింగ్‌లో భారత్‌కు చెందిన నితేష్ సివాచ్ రజత పతకం గెలుచుకోగా, మహిళల 62 కేజీల విభాగంలో మంగోలియాకు చెందిన అల్జిన్ టోగ్టోఖ్‌తో జరిగిన పతక పోరులో ఓడిపోవడంతో మాన్సీ అహ్లావత్ కాంస్య పతకాన్ని కోల్పోయింది. గురువారం నగోయాలో జరిగిన ఫైనల్‌లో జపాన్‌కు చెందిన యూరి నకజాటో చేతిలో 0-4 తేడాతో ఓడిపోయిన నితేష్, రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. 1962 ఆసియా క్రీడల తర్వాత ఈ ఖండాంతర ఈవెంట్‌లో గ్రీకోరోమన్ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడిగా నిలిచినప్పటికీ, అతను తన ప్రచారాన్ని స్వర్ణ పతకంతో పూర్తి చేయలేకపోయాడు. కాంస్య పతకం కోసం జరిగిన పోరులో మాన్సీ, ఆల్జిన్ చేతిలో 2-5 తేడాతో ఓడిపోయింది. మాన్సీని బౌండరీ బయటకు నెట్టివేసి, ఆ మంగోలియన్ క్రీడాకారిణి ప్రారంభంలోనే 2-0 ఆధిక్యాన్ని సంపాదించి, మొదటి రౌండ్ మొత్తం అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆ తర్వాత తన ప్రత్యర్థిని బౌండరీ బయటకు నెట్టడంతో మాన్సీ స్కోరును 2-2తో సమం చేసింది. అయితే, చివరి క్షణాల్లో ఆల్జిన్ మరో 2పాయింట్లు సాధించింది. స్కోరింగ్‌పై భారత దేశం చేసిన ఛాలెంజ్ విఫలమవడంతో, మంగోలియన్ క్రీడాకారిణికి మరో పాయింట్ లభించింది.

# ఫైనల్‌కు భారత్

## 169 పరుగుల తేడాతో శ్రీలంక చిత్తు



**నిస్షిన్:** ఆసియా గేమ్స్ రెండో సెమీఫైనల్‌లో భారత జట్టు అదరగొట్టి అద్భుత విజయం సాధించింది. గురువారం శ్రీలంకతో జరిగిన కీలక పోరులో 124 పరుగుల భారీ తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. కేవలం 9.5 ఓవర్లలోనే శ్రీలంక 45 పరుగులకు ఆలౌట్ అయింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. శ్రీలంక కనీస పోటీ ఇవ్వలేకపోయింది. నేపాల్, హాంగ్ కాంగ్ కంటే అధ్వాన్నంగా ఆడింది. 170 పరుగుల లక్ష్యం ముందు శ్రీలంకకు మంచి ఆరంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో ఓవర్ పూర్తయ్యేలోపే మూడు వికెట్లు కోల్పోయిన లంకపై భారత బౌలర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. వికెట్లు వరుసగా పడటంతో శ్రీలంక బ్యాటర్లపై ఒత్తిడి మరింత పెరిగింది. స్కోరుబోర్డుపై పరుగులు వేగంగా చేరకపోవడంతో లక్ష్యాన్ని అందుకోవడం కష్టంగా మారింది. జస్‌ప్రీత్ బుమ్రా వేసిన తొలి ఓవర్‌లోనే శ్రీలంక ఒక్క పరుగు చేయకుండానే రెండు వికెట్లు కోల్పోయింది. రవి బిష్ణోయ్ వేసిన రెండో ఓవర్‌లో రనౌట్ రూపంలో మరో వికెట్ పడగా, నాలుగో ఓవర్‌లో అక్షర్ పటేల్ మరో రెండు వికెట్లు పడగొట్టాడు. ఐదో ఓవర్‌లో కాస్త నిలకడగా ఆడిన నువానిడు ఫెర్నాండో(15) కూడా రనౌట్ అయ్యాడు. ఏడో ఓవర్‌లోవాషింగ్టన్ సుందర్ మరో వికెట్ పడగొట్టగా, 10వ ఓవర్‌లో అభిషేక్ శర్మ 2 వికెట్లు తీసాడు. అదేఓవర్‌లో తారిండు రత్నాయకే రనౌట్ అయ్యాడు. 9.5 ఓవర్ల వద్ద చివరి వికెట్ పడటంతో శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసింది. తొలుత భారత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ 80 పరుగులతో ప్రధాన పాత్ర పోషించాడు. వాషింగ్టన్ సుందర్ 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత్ 20 ఓవర్లలో 169/7 స్కోరు సాధించింది. చివరి ఓవర్‌లో 18 పరుగులు రావడం కూడా భారత స్కోరునుపెంచింది. ఆతర్వాత బౌలింగ్‌లోనూ అదేజోరును కొనసాగించిన భారత్, శ్రీలంకను 45 పరుగులకే పరిమితం చేసింది. 124 పరుగుల విజయంతో సెమీఫైనల్‌ను ముగించిన టీమిండియా ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్‌లో స్వర్ణ పతకం కోసం పోరాడనుంది. శ్రీలంకకు మాత్రం ఈ ఓటమితో టైటిల్ రేసు ముగిసింది.

# బంగ్లాపై గెలుపు: ఫైనల్‌కు పాకిస్థాన్

**నిస్షిన్:** కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో వర్షం కారణంగా అంతరాయం కలిగిన పురుషుల క్రికెట్ సెమీఫైనల్‌లో పాకిస్థాన్ గురువారం ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్ ఖరారు చేసుకుంది. రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా అవుట్‌ఫీల్డ్ ఆటకు అనుకూలంగా లేకపోవడంతో, మ్యాచ్‌ను ఇరు జట్లకు 13 ఓవర్లకు కుదించారు, బంగ్లాదేశ్ నిర్దేశించిన 111/7 స్కోరును పాకిస్థాన్ 11.3 ఓవర్లలో ఛేదించి, తొమ్మిది బంతులు మిగిలి ఉండగానే 112/4 స్కోరుతో ముగించింది. పాకిస్థాన్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి బంగ్లాదేశ్ చాలా ఇబ్బంది పడింది. సుఫ్యాన్ మోకిమ్ 3/26తో రాణించగా, అరఫత్ మిన్హాస్ 2/23తో వికెట్లు పడగొట్టాడు. సైమ్ అయూబ్ ముఖ్యంగా పొదుపుగా బౌలింగ్ చేసి, తన రెండు ఓవర్లలో కేవలం మూడు పరు గులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ కూడా తీశాడు. తంజిద్ హాసన్ తమీమ్, కెప్టెన్ లిట్టన్ దాస్, పర్వేజ్ హుస్సేన్ ఎమోన్, సైఫ్ హాసన్‌ల వికెట్లు కోల్పోవడంతో, 6.3 ఓవర్లలో బంగ్లాదేశ్ 45/4 స్కోరుకు పడిపోయింది. ఆ తర్వాత తౌహిద్ హృదయ్ 42 పరుగులు చేసి జట్టుకు ఊపునివ్వగా, మొసాడెక్ హుస్సేన్ 11 పరుగులు చేశాడు. మహేది హాసన్, సాహిబ్జాదా ఫర్హాన్‌ను ఔట్ చేయడంతో పాకిస్థాన్ కూడా ఆరంభంలోనే ఒత్తిడిని ఎదుర్కొంది. అయితే, మాజ్ సదాకత్(15), ఉస్మాన్ ఖాన్(14), అయూబ్(21)ల మెరుపు ఇన్నింగ్స్‌లు ఛేజింగ్ ను సరైన మార్గంలో ఉంచాయి. పాకిస్థాన్ 76/4 స్కోరు వద్ద ఉండగా ముస్తఫిజుర్ రెహమాన్ వేసిన ఒకే ఓవర్‌లో అబ్దుల్ సమద్ 22 పరుగులు బాదగా, హసన్ నవాజ్ 22 బంతుల్లో 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సమద్ 15బంతుల్లో 30పరుగులతో నాటౌట్‌గా నిలవగా, 12వఓవర్‌లో నవాజ్ విజయపు బౌండరీని సాధించాడు. ఈ ఫలితంతో పాకిస్థాన్ ఆసియా క్రీడల్లో తొలిసారిగా పురుషుల క్రికెట్ ఫైనల్‌కు చేరుకుంది.




# ఆర్చరీలో గణేష్‌కు కాంస్యం

**ఒకాజాకి:** భారత కాంపౌండ్ ఆర్చర్ గణేష్ మణి రత్నం తిరుమూరు ఆసియా క్రీడల్లో పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించడంతో, ఐచినగోయా క్రీడల్లో ఆర్చరీ విభాగంలో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఒకాజాకిలో గురువారం జరిగిన కాంస్య పతక పోరులో గణేష్, వియత్నాంకు చెందిన కాంగ్ డక్ డాంగ్‌ను 149-144 తేడాతో ఓడించాడు. గణేష్ చివరిలో అద్భుతంగా ఆడి, 14 సార్లు 10 పాయింట్లు సాధించి,



చివరగా వరుసగా మూడు10 పాయింట్లతోతన వియత్నాం ప్రత్యర్థిపై ఆధిక్యం సాధించి మూడవ స్థానాన్ని దక్కించుకున్నాడు. బుధవారం జరిగిన పురుషుల టీమ్ కాంపౌండ్ ఈవెంట్‌లో భారత్ స్వర్ణం గెలవడంలో సహాయపడిన తర్వాత, ప్రస్తుతం జరుగుతున్న క్రీడల్లో గణేష్‌కు ఇది రెండవ పతకం. కాగా భారత్ కాంపౌండ్ ఆర్చరీ పోటీలను టీమ్ ఈవెంట్లలో మూడు స్వర్ణ పతకాలతో, వ్యక్తిగత పోటీలలో ఒక కాంస్య పతకంతో ముగించింది.




# వాలీబాల్‌లో పాక్ విజయం

## భారత్ వరుస సెట్లలో ఓటమి

**ఒకాజాకి:** ఐచినగోయా 2026 గేమ్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో పాకిస్థాన్ వరుస సెట్లలో భారత్‌ను ఓడించింది. ఒకాజాకిలో గురువారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 25-19, 25-23, 25-18 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌లో స్థానం ఖాయం చేసుకుంది. ఈ ఫలితంతో 64 ఏళ్లలో ఆసియా క్రీడల్లో పురుషుల వాలీబాల్‌లో పాకిస్థాన్ తొలిసారిగా టాప్ ఫోర్‌లో స్థానం దక్కించుకుంది. తొలి సెట్ ఆరంభంలో హోరాహోరీగా సాగింది, ఇరు జట్లు 11-11తో సమంగా నిలిచాయి.

ఆ తర్వాత పాకిస్తాన్ వరుసగా ఐదు పాయింట్లు సాధించి 16-11 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అదే ఆధిక్యాన్ని కొనసాగించి సెట్‌ను 25-19 తేడాతో కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో 19-16 ఆధిక్యం సాధించడంతో భారత్ పట్టు సాధించినట్లే కనిపించింది. అయితే, వరుస తప్పిదాల కారణంగా పాకిస్థాన్ పుంజుకుని సెట్‌ను 25-23తో కైవసం చేసుకుంది, దీంతో భారత్ రెండు సెట్లు వెనుకబడింది. మూడవ సెట్‌లో పాకిస్తాన్ ఆధిపత్యం కొనసాగించి 25-18 తేడాతో విజయాన్ని పూర్తి చేసింది.పూల్ సిలో మూడు విజయాలతో అగ్రస్థానంలో నిలిచిన భారత్, అజేయంగా నాకౌట్ దశలోకి ప్రవేశించింది.

# నాలుగో రోజూ నష్టాలే

## సెన్సెక్స్ 571, నిఫ్టీ 22,450 పాయింట్లు డౌన్

**ముంబై, అక్టోబరు 1:** పెరుగుతున్న ఇంధన ధరలు, అస్థిరమైన బాండ్ దిగుబడులు, మరింత ద్రవ్య బిగింపునకు అవకాశంపై పెరిగిన ఆందోళనల మధ్య, దేశీయ ఈక్విటీ మార్కెట్ గురువారం భారీ నష్టాలతో ముగిసింది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లో కూడా నష్టాలు కొనసాగాయి. సెన్సెక్స్ 570.59 పాయింట్లు లేదా 0.79 శాతం క్షీ ణించి 71,909.70 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 198.50 పాయింట్లు లేదా 0.88 శాతం పడిపోయి




22,421.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక దృక్పథంపై వ్యాఖ్యానిస్తూ, నిపుణులు నిఫ్టీ తన వారపు 200ఎస్ఎంఎ జోన్ అయిన 22,600- 22,580 దిగువకు పడిపోయిందని, 22,400 వద్ద అంచనా వేసిన మద్దతును దాదాపుగా పరీక్షించిందన్నారు. “22,400 స్థాయిని కాపాడుకోవడంలో విఫలమైతే, మార్కెట్ బలహీనత 22,200-22,000 స్థాయిల వైపు విస్తరించవచ్చు, కాగా 22,600-22,800 స్థాయిలు ఇప్పుడు తక్షణ నిరోధక శ్రేణిగా మారాయ్ణి అని మార్కెట్ పరిశీలకులు పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. అంతర్జాతీయ బాండ్ మార్కెట్లలో మార్పులు కూడా మదుపరులను అప్రమత్తం చేశాయి. దీంతో పలు రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. నిఫ్టీలో బజాజ్ ఆటో, మారుతి సుజుకి ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఆటో, ఆర్థిక రంగ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.01 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.97 శాతం చొప్పున పడిపోయాయి. ఆటోమొబైల్, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీ షేర్లు మాత్రం మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే, ఆటోమొబైల్, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎక్కువగా ఎదుర్కొన్నాయి. రంగాల వారీ సూచీలలో, నిఫ్టీ ఆటో, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీలు అత్యంత తీవ్రమైన క్షీ ణతను నమోదు చేశాయి. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాక్స్ మార్కెట్‌కు కొంతమేర మద్దతునిచ్చాయి. ఈ సెషన్‌లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన రంగంగా నిలిచింది. “దీర్ఘకాలిక పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను కొనసాగించి, మార్కెట్ బలహీనతను ఉపయోగించుకుని క్రమంగా కొనుగోళ్లు పెంచుకోవచ్చు. మరోవైపు, అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వం నుండి బలమైన చర్యలు వచ్చి ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో స్థిరత్వాన్ని పునరుద్ధరించే వరకు స్వల్పకాలిక పెట్టుబడిదారులు వేచి చూసే ధోరణిని అవలంబించవచ్ఛు అని విశ్లేషకులు పేర్కొన్నారు.




# సెప్టెంబరులో జిఎస్‌టి వసూళ్లు రూ.2.04 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** జిఎస్‌టి వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. సెప్టెంబరులో స్థూల జిఎస్‌టి వసూళ్లు 14.7 శాతం పెరిగి రూ.2,03,521 కోట్లకు చేరాయి. గతేడాది సెప్టెంబరులో రూ.1,77,173 కోట్లుగా ఉన్న వసూళ్లతో పోలిస్తే ఈసారి గణనీయమైన పెరుగుదల నమోదైంది. వరుసగా మూడో నెలలోనూ జిఎస్‌టి వసూళ్లు రూ.2 లక్షల కోట్లకు చేరువగా లేదా అంతకుమించి ఉండటం గమనార్హం.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.